www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దినపత్రిక
శనివారం 17 మే 2025
సంపుటి :06 సంచిక : 346 , పేజీలు : 12 వెల:రూ.5/-
TELANGANA, ANDHRA PRADESH



## ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం

- ఆర్మీకి కృతజ్ఞతగా నేడు బిజెపి తిరంగా యాత్ర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

2 లో..

# రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- వచ్చే మూడేళ్లలో మరింతగా పెరిగే ఛాన్స్
- డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తికి లక్ష్యం
- ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల అప్‌గ్రేడేషన్‌పై దృష్టి
- ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్
- స్మార్ట్ పోల్స్ వినియోగంపై దృష్టి సారించాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ స్పష్టీకరణ




**హైదరాబాద్,మే16( వెలుతురు):** వచ్చే మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సబ్‌స్టేషన్లు అప్‌గ్రేడ్ చేసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. విద్యుత్‌శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. భవిష్యత్‌లో డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్ మారబోతోంది. విద్యుత్ లైన్ల ఆధునికీకరణపై దృష్టి సారించాలి. ఫ్యూచర్‌సిటీలో పూర్తిగా భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ విద్యుత్ టవర్లు, లైన్లు, స్తంభాలు కనిపించకూడదు. గ్రేటర్ పరిధిలో స్మార్ట్‌పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అన్నారు. ఓఆర్‌ఆర్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ ఏడాది విద్యుత్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరినట్లు-అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాదితో పోలిస్తే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందన్నారు. 2025-26లో విద్యుత్ డిమాండ్ 18,138 మెగావాట్లకు పెరుగుతుందని, 2034-35 నాటికి విద్యుత్ డిమాండ్ 31,808 మెగావాట్లకు చేరుతుందని అధికారులు వివరించారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని సీఎంకి అధికారులు వివరించారు. గత ఏడాదితో పోల్చితే

2 లో..




హిందూ సంఘటిత శక్తిని చాటేలా దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా

## “హిందూ ఏక్తా యాత్ర” సంచలనం కాబోతోంది

- యావత్ తెలంగాణకు స్ఫూర్తిగా నిలిచేలా కరీంనగర్ లో ‘ఏక్తా యాత్ర’ సక్సెస్ చేస్తాం
- ప్రతి ఒక్క హిందువు ఈ యాత్రలో పాల్గొనాలి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యలు
- కరీంనగర్ లో బీజేపీ శ్రేణులతో ‘హిందూ ఏక్తా యాత్ర’ సన్నాహక సమావేశం
- లక్ష మందిదాకా యాత్రకు హాజరవుతారని అంచనా
- ఇంటింటికీ వెళ్లి యాత్రకు ఆహ్వానించాలని నాయకులను కోరిన సంజయ్

2 లో..

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తి చాటాం

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ,మే16( వెలుతురు):** ఇటీవలి ఆపరేషన్ సిందూర్ భారతదేశపు త్రివిధ దళాల శక్తి సంపన్నతను ప్రపంచానికి చాటి చెప్పిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ప్రధాని మోడీ స్థిరమైన రాజకీయ సంకల్పం, మరోవైపు పలు కీలక సంస్థల నిర్దిష్ట ఇంటలిజెన్స్ సమాచార క్రోడీకరణ, దేశ సాయుధ బలగాల పోరాట పటిమ, ఈ మూడు అంశాలు భారత్ అంటే ఏమిటీ,మన శక్తి ఏ పాటిది? అనే కీలక విషయాలను వెల్లడించిందని వివరించారు. దేశ రాజధానిలో శుక్రవారం అధునాతన మల్టి ఏజెన్సీ సెంటర్ ప్రారంభం తరువాతి సభలో ఆయన

2 లో..

## ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం

### అసలు సినిమా చూస్తామంటే చూపిస్తాం

- ఉగ్రవాదాన్ని ఆపకపోతే తడాఖా చూపుతాం
- మరోమారు పాక్‌కు రాజ్‌నాథ్ ఘాటు హెచ్చరిక
- భుజ్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన రక్షణ మంత్రి




**భుజ్,మే16( వెలుతురు):** దేశ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాక్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఆపరేషన్ సిందూర్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు చూసిందంతా ఓ ట్రైలర్ మాత్రమేనని అన్నారు. శుక్రవారం భుజ్ ఏయిర్‌బేస్‌లో రాజ్‌నాథ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ అధికారులతో ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. ’ ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ఇప్పటి వరకు చూసిందంతా ట్రైలర్ మాత్రమే. సరైన సమయం వచ్చినపుడు ప్రపంచం మొత్తానికి పూర్తి సినిమా చూపిస్తాం. పాకిస్తాన్‌ను ఇప్పుడు ప్రొబేషన్ పీరియడ్‌లో పెట్టాము. పాక్ తన బుద్ధి మార్చుకుంటే పర్లేదు. లేకపోతే కఠినమైన శిక్షలు వేస్తాం’ అని అన్నారు. ఏయిర్‌ఫోర్స్

2 లో..



## సీఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి కి తీవ్ర విభేదాలు...

- రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసింది... అప్పులు పుట్టడం లేదు...
- మీడియా చిట్ చాట్ లో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యలు...

2 లో..



**హైదరాబాద్ వెలుతురు మే 16:** రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసింది. అప్పులు పుట్టడం లేదు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన తెలంగాణకు శాపంగా మారిందని సీఎం రేవంత్ రెడ్డి పలుసార్లు బహిరంగ వేదికలపై మాట్లాడారు. రాష్ట్రానికి రాబడి ఎంత, ఖర్చు ఎంత అనే లెక్కలు కూడా చెప్పారు. అయితే

## మంత్రి కొండా సురేఖ నిజాలు మాట్లాడారు

- తెలంగాణలో కాంగ్రెస్ కమిషన్ సర్కార్
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన కెటిఆర్
- తన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్నారన్న సురేఖ



**హైదరాబాద్, మే16( వెలుతురు):** వరంగల్‌లో గురువారం మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారాన్ని రేపాయి. మంత్రులు డబ్బులు తీసిన తర్వాతే ఫైళ్లపై సంతకాలు పెడతారని ఆమె చెప్పిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా శుక్రవారం స్పందించారు. కొండా సురేఖ మాట్లాడిన కొన్ని నిజాలకు అభినందనలు అని, తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్

3 లో..

## కమిషన్లతో నడిచింది కెసిఆర్ ప్రభుత్వమే

- అధికారం పోవడంతో దిక్కుతోచని కెటిఆర్
- మండిపడ్డ మంత్రి సీతక్క

**హైదరాబాద్,మే16( వెలుతురు):** కమిషన్లతో నడిచిన ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీది అని మంత్రి సీతక్క ఆరోపించారు. కేటీఆర్ కు అధికారం పోయాక పిచ్చోడు అయిపోయాడని ఆమె మండిపడ్డారు. శుక్రవారం నాడిక్కడ ఆమె మాట్లాడుతూ.. చెల్లి కవిత రేపో మాపో రాజీనామా చేస్తదని తెలుస్తుందని అన్నారు. కమిషన్లకి కక్కుర్తి పడ్డది కేటీఆర్.. బీఆర్ఎస్ కమిషన్ల ప్రభుత్వం అన్నారు. కన్నీళ్లు తుడిచే ప్రభుత్వం మాది అని ఆమె అన్నారు. ఇక, సుందరిమణుల్లో ఒకరికో ఒక్క అమ్మాయి అలా చేస్తే దాన్ని

3 లో..




## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

- రైతులు దిగులు చెందాల్సిన పనిలేదు
- మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

2 లో..

**రాజన్న సిరిసిల్ల, మే16(వెలుతురు):** తెలంగాణ ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలుకి సంబంధించి రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎక్కడైనా ఏదైనా మస్య ఉంటే తెలియచేయాలని అన్నారు.



## దేశంలోకి ఉగ్రవాదులు అడుగిడితే.. అదే చివరి రోజు

- ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు గుణపాఠం చెప్పాం
- విజయవాడ తిరంగా ర్యాలీలో సిఎం చంద్రబాబు
- పాక్ తీరుతో భారత్ ప్రశాంతంగా ఉండలేకపోతోంది: పవన్



**విజయవాడ,మే16 ( వెలుతురు):** తీవ్రవాదం రూపంలో ఎవరూ దేశంలో అడుగుపెట్టినా వారికదే చివరిరోజు అవుతందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హెచ్చరించారు. జాతి పునర్నిర్మాణంలో అందరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. భారతమాత కీర్తి ప్రతాపాన్ని చాటుతూ తిరంగా ర్యాలీ చేపట్టామని చంద్రబాబునాయుడు తెలిపారు. విజయవాడలో శుక్రవారం భారీ తిరంగా ర్యాలీ జరిగింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద

2 లో..

## సోలార్ విద్యుత్‌దే భవిష్యత్

- ఎపిలో ఉత్పత్తితో దేశమంతటికి సరఫరా
- గుత్తిలో రెన్యూ ఎనర్జీకి శంకుస్థాపన
- చంద్రబాబు బ్రాండ్‌తోనే ఎపికి పరిశ్రమల రాక
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి

**అనంతపురం,మే16( వెలుతురు):** మన నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా.. భారతదేశానికి మొత్తం సరఫరా చేస్తామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ సోలార్ ప్రాజెక్ట్ ద్వారా విద్యుత్ ఛార్జీలు తగ్గుతాయన్నారు. రెన్యువబుల్ ఎనర్జీ పరిశ్రమ మాత్రమే కాదు ఉద్యమం అని పేర్కొన్నారు. భారత క్లీన్ ఎనర్జీ విప్లవానికి శంకుస్థాపన చేశాం అని, ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి అనుగుణంగా ప్రాజెక్ట్ రూపకల్పన చేశామని చెప్పారు. మేక్ ఇన్ ఇండియా ద్వారా

3 లో..




## రక్షణ బలగాలకు ఆత్మస్థైర్యం

- ఆలయాల్లో పూజలు..సర్వమత ప్రార్థనలు
- జనసేనాని పవన్ కళ్యాణ్ వెల్లడి



3 లో..

(మొదటి పేజీ తరువాయి..)

## రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగింది అన్నారు. 2025-26లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగు తుందని అంచనా వేశారు. 2034-35 నాటికి 31,808 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు- ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల విద్యుత్ డిమాండ్ పెరుగుతుంది అన్నారు. విద్యుత్ అవసరాల కోసం ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలి.. రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్టులకు విద్యుత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు- ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను లెక్కలోకి తీసుకోవాలి.. కొత్తగా ఏర్పాటు- చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ ను దృష్టిలో పెట్టు-కుని ముందుకు కొనసాగాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్ గా మారబోతుంది.. హైదరాబాద్ లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నా మని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. అయితే, రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల ఆధునీకరణ పైనా దృష్టి సారించాలి.. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు- చేయాలని ఆయన తెలిపారు. ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదు.. హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్ ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు- చేయాలని సూచించారు. అలాగే, సెక్రటె-రియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు లాంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ను అందుబాటులోకి తీసుకు రావాలని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## ఆపరేషన్ సిందూర్‌తో భారత్ శక్తి చాటాం

మాట్లాడారు. ఎప్పటికప్పుడు ఇంటలిజెన్స్ సమాచార సేకరణ , పలు సంస్థల మధ్య పంపిణీ, సముచిత సమన్వయం నిర్వహణకు ఈ కీలక కేంద్రం ఏర్పాటు- జరిగింది. ఓ ధృఢమైన నాయకత్వం, గురి తప్పని సమాచార సేకరణ, నిరుపమాన దాడుల శక్తియుక్తులు ఇప్పుడు దేశాన్ని మరింత శక్తివంతం చేశాయని అమిత్ షా ఈ సందర్భంగా తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత చోటు-చేసుకున్న మన అత్యంత కీలకమైన ఆపరేషన్ సిదూర ప్రధాని మోడీ చెక్కుచెదరని రాజకీయ చిత్తశుద్ధికి, మొక్కవోని ధక్షతకు నిదర్శనం అయిందని పేర్కొన్నారు. ఇక్కడ ప్రారంభం అయిన మల్టీ ఏజెన్సీ సెంటర్ దేశ ఇంటలిజెన్స్ బ్యూరో పరిధిలో పనిచేస్తుంది. 26/11 ముంబై దాడుల తరువాతి క్రమంలో దేశంలో పలు స్థాయిల నిఘా సమాచార వ్యవస్థల మధ్య సత్వర సమగ్ర రీతి సమన్వయానికి ఈ మల్టీ ఏజెన్సీ సెంటర్ ఏర్పాటు- జరిగింది. సకాలంలో సమాచారం సేకరించడం తరువాతి క్రమంలో పలు సంస్థల సమన్వయంతో తీసుకోవల్సిన చర్యల గురించి ఆలోచించి తాత్సారం లేకుండా స్పందించడం ఈ ఏజెన్సీ ముఖ్య ఉద్ధేశం అన్నారు.

## ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం

**హైదరాబాద్,మే16( వెలుతురు):**
భారత్‌పై దాడి చేస్తే ప్రతిదాడి ఎలా ఉంటుందో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్‌కు నిరూపించామని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పాక్ దిక్కుతోచని స్థితిలో కాళ్ల బేరానికి వచ్చిందని అన్నారు. దాని వైమానిక స్థావరాలు భారత్ దాడిలో ధ్వంసం అయ్యాయని అన్నారు. ఉగ్రవాదులకు ఊతమిస్తే ఇక పాక్ అంతుచూస్తామని ప్రధాని మోడీ హెచ్చరించారని అన్నారు. ప్రధాని మోదీ ఉగ్రవాదుల అంతు చూస్తున్నారని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. పాక్‌తో పోరులో భారత సైన్యం చరిత్ర రాసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. భాజపా నిర్వహించే తిరంగా యాత్రలో అందరూ పాల్గొనాలని కోరారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచే ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసింది. పాక్ ఆర్మీకి చెందిన 11 కీలకమైన స్థావరాలను మన దేశ సైనికులు ధ్వంసం చేశారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాం. అంబేద్కర్ విగ్రహం నుంచి మిలటరీ ట్యాంక్ వరకు ఈ యాత్ర ఉంటుందన్నారు. అనేక మంది ప్రముఖులు ఈ యాత్రలో పాల్గొనబోతున్నారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్రలో ఎమ్మెల్యేలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇది సైనికులకు ఆత్మస్థయిర్యం నింపేలా, వారికి మద్దతుగా చేస్తున్నదని అన్నారు. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. ఇకపోతే ఈ దాడితో భారత సైనికపాటవాన్ని ప్రపంచం గుర్తించిందని అన్నారు.

## ఇప్పటి వరకు ట్రైలర్ మాత్రమే చూపాం

అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఏయిర్‌ఫోర్స్ అధికారుల పని తీరును పొగడటానికి తనకు మాటలు సరిపోవటం లేదన్నారు. యావత్ దేశం తరపునుంచి మరోసారి ఏయిర్‌ఫోర్స్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పాకిస్తాన్ గడ్డమీద ఉన్న 9 ఉగ్రవాద స్థావరాలను మీరు ఎలా ధ్వంసం చేశారో ప్రపంచం మొత్తం చూసింది. తర్వాత కూడా వారి ఏయిర్‌బేస్‌లను ధ్వంసం చేశారు. భారత్ యుద్ధ నియమాలు, టెక్నాలజీ మారిందని ప్రపంచానికి మీరు చాటి చెప్పారు. ధైర్య, సాహసాలకు ఇండియన్ ఏయిర్‌ఫోర్స్ ప్రతీకగా నిలిచింది. ఏయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌కు నా కృతజ్ఞతలు. అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు' అంటూ పొగడ్తల వర్షం కురిపించారు.గురువారం జమ్మూకాశ్మీర్ పర్యటనలో భాగంగా పాకిస్తాన్‌పై ఫైర్ అయ్యారు. పాకిస్తాన్ దగ్గర ఉన్న అణు బాంబులను లాక్కోవాలని ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీకి విజ్ఞప్తి చేశారు. పాకిస్థాన్ ఎన్నోఏళ్లుగా పెంచి..పోషిస్తున్న ఉగ్రవాదాన్ని భారత సైన్యం కేవలం 23 నిమిషాల్లో తుడిచిపెట్టేసిందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం పాక్ చర్యలను భారత్ పరిశీలిస్తుందని.. తేడా వస్తే చర్యలు మరింత కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. గుజరాత్‌లోని భుజ్ వైమానిక దళ సైనికులతో సమావేశమైన కేంద్ర మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి వచ్చిన నిధులలో ఎక్కువ భాగాన్ని పాకిస్థాన్ తన దేశంలో ఉగ్రవాద మౌలిక సదుపాయాల కోసం ఖర్చు చేస్తుందన్నారు. అప్పు చేసి మరీ దాయాది దేశం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్రవాద స్థావరాలను పునర్నిర్మించడానికి జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు రూ.14 కోట్ల ఇస్తున్నట్లు పాక్ ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని రాజ్‌నాథ్ అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టు-కొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని కోరారు. భవిష్యత్తులోనూ ఆ దేశానికి ఎలాంటి సహాయం అందించొద్దని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు భారత్ అర్ధరాత్రి ఉదయపు వెలుగు ఎలా ఉంటు-ందో చూపించిందని.. మన సైనికుల పరాక్రమం చూసి దేశ, విదేశాల్లోని భారతీయులు గర్విస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ఈ ఆపరేషన్ ప్రపంచం దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. మన బ్రహ్మోస్ క్షిపణి శక్తిని దాయాది దేశం కూడా అంగీకరించిందని పేర్కొన్నారు. భుజ్ వైమానిక స్థావరం అనేక పాకిస్థాన్ డ్రోన్‌లను కూల్చడాన్ని ప్రస్తావిస్తూ..సైన్యాన్ని ప్రశంసించారు. 1965లోనూ పాకిస్థాన్‌పై మన విజయానికి భుజ్ సాక్షిగా నిలిచిందని గుర్తు చేశారు. ఇదిలావుంటే ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు-) ఆ దేశానికి మంజూరయ్యాయి. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ గురువారం జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్‌కు నష్టపరిహారం ఇవ్వనున్నట్లు- ప్రకటించారు. భారత్ చేసిన వైమానిక దాడుల్లో 14 మంది మసూద్ కుటు-ంబసభ్యులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని ఆ దేశ ప్రధాని పేర్కొన్నారు. ఈ క్రమంలో కేవలం మసూద్ కుటు-ంబానికి రూ.14 కోట్లు- చెల్లించే అవకాశం ఉంది. అదనంగా భారత్ దాడుల్లో ధ్వంసమైన ఇళ్లను పునర్నిర్మిస్తామని పాక్ ప్రధాని హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లకు పక్కాగా ఏర్పాట్లు

జిల్లాలోని వేములవాడ అర్బన్ తహసిల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్, వరి ధాన్యం కొనుగోలుపై మంత్రులు, సీఎస్, జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో జరుగుతున్న వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు చేస్తుంది అన్నారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ తో పాటు- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ జరిగిందని పేర్కొన్నారు. అయితే, అధిక తూకం లేకుండా, ధాన్యం తరలింపుకు రవాణా ఇబ్బందులు రాకుండా.. చర్యలు తీసుకోవడంతో పాటు- పేమెంట్ ఆలస్యం కాకుండా వెంట వెంటనే రైతుల ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రైతులకు ఏమైనా ఇబ్బంది కలిగితే టోల్ ఫ్రీ నెంబర్ కి ఫిర్యాదు చేయండి అని సూచించారు. కానీ, రైతులు ధాన్యాన్ని బయట అమ్ముకోవద్దు అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది.. పంట ఎండి పోయిందనే అవకాశం లేకుండా విద్యుత్ ఇబ్బందులు లేకుండా, నీటిని వాడుకుంటూ పంటలు కాపాడుకున్నాం అన్నారు. ఎందుకంటే, మాది రైతుల ప్రభుత్వం అని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు.

### హిందూ సంఘటిత శక్తిని చాటేలా దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా

# “హిందూ ఏక్తా యాత్ర” సంచలనం కాబోతోంది

**కరీంనగర్ వెలుతురు మే 16:**
కరీంనగర్ లో ఈనెల 22న నిర్వహించబోయే “హిందూ ఏక్తా యాత్ర” తెలంగాణలో ఓ సంచలనం కాబోతోందని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. హిందువుల సంఘటిత శక్తి చాటేలా.....దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా.... సంతుష్టీకరణ పేరుతో ఒక వర్గం ఓట్ల కోసం హిందువుల మధ్య విభేధాలు సృష్టిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే నాయకుల చెంప చెల్లుమనేలా “హిందూ ఏక్తా యాత్ర”ను కనీవినీ ఎరగని రీతిలో నిర్వహిస్తామన్నారు. “హిందూ ఏక్తా యాత్ర రాజకీయ కార్యక్రమం కానేకాదు. ఇది ఒక పార్టీకి సంబంధించినది కాదు. హిందూ శక్తిని ప్రదర్శించే యాత్ర మాత్రమే. బొట్టు పెట్టుకునే ప్రతి ఒక్కరిదీ”అని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం నుండి మండల కేంద్రాలదాకా, మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ దాకా గడప గడప నుండి హిందువులంతా యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులంతా ఇంటింటికీ వెళ్లి ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర'కు తరలిరావాలంటూ ఆహ్వానించాలని కోరారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో శుక్రవారం రోజున సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ మండలాల అధ్యక్షులు, ఇంఛార్జీలు, ముఖ్య నాయకులు, మహిళా మోర్చా నాయకులతో 'హిందూ ఏక్తా యాత్ర' సన్నాహక సమావేశం నిర్వహించారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ సునీల్ రావు, చెన్నమనేని వికాస్ రావు, గుగ్గిళ్ల రమేశ్, ఒదేలు, వాసాల రమేశ్ తదితరులు



హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే... తెలంగాణ ఉద్యమంతో ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. ఇక మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ తో రాజకీయాలు నడవవు. ఇప్పుడు జాతీయవాదులను, హిందువులందరినీ ఏకం చేయాల్సిన అవసరం వచ్చింది. పెహెల్ గాం ఘటనతో ఏం జరిగిందో అందరం చూసినం. ప్రతి ఒక్క హిందువు ఆ ఘటనను చూసి రగలిపోయారు. ఉగ్రవాదులతోపాటు పాకిస్తాన్ అంతు చూడాలని కోరుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందో మీ అందరికీ తెలుసు. ఇప్పుడు హిందువులందరినీ ఏకం చేయాల్సిన అవసరం ఏర్పడింది. హిందూ ఏక్తా యాత్ర ద్వారా హిందువులందరికీ సంఘటితం చేసే మహత్తర అవకాశం వచ్చింది. ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర' ద్వారా ఈ అవకాశం మనందరికీ వచ్చింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లండి. హిందూ ఏక్తా యాత్రకు ఆహ్వానించండి. అసలు ఏక్తా యాత్ర ఉద్దేశమేమిటి? హిందువులంతా ఐక్యంగా ఉండకపోతే ఏం జరిగే ప్రమాదముందో తెలియజేయాలి. యువతను, మహిళలను, విద్యార్థులను, కుల సంఘాలను, ప్రజా సంఘాలను, వృత్తి సంఘాలను ఏకం చేయాలి. లక్ష మందికి తగ్గకుండా ర్యాలీలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. వరంగల్ లో పూజారిని హత్య చేస్తే హిందువులందరినీ ఏకం చేయడం ద్వారా ఆ తరువాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకంగా 14 కార్పొరేటర్ స్థానాలను కైవసం చేసుకున్నాం. కరీంనగర్ లోనూ సత్తా చాటాం. మీ అందరికీ ఈ యాత్ర పేరుతో ప్రతి ఒక్కరినీ కలుసుకునే అవకాశం వచ్చింది. మీ నాయకత్వాన్ని ప్రూవ్ చేసుకునే సమయం వచ్చింది.ఇకపై కరీంనగర్ లో ఏ ఒక్క గల్లీ చూసినా కాషాయ జెండాలే కన్పించాలి. సర్పంచ్, ఎంపీటీసీ, కార్పొరేటర్ గెలవాలంటే కాషాయ జెండా పట్టాల్సిందే. కరీంనగర్ లో ఇప్పటికే



కాషాయ వాతావరణం నెలకొంది. మనం చేయాల్సిందల్లా హిందువుల ఐక్యతను చాటి చెప్పడమే. హిందూ ఏక్తా యాత్ర పేరుతో అందివచ్చిన ఈ అవకాశాన్ని మీరంతా ఉపయోగించుకోవాలని, హిందువులందరినీ సంఘటితం చేయాలని కోరుతున్నా.

## సీఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి కి తీవ్ర విభేదాలు...

ఆర్థిక శాఖ మంత్రి కూడా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రం ఏనాడు ఆ విషయాలను ప్రస్తావించలేదు. సీఎం మాట్లాడిన తర్వాత కూడా ఆయనకు మద్దతుగా స్పందించిన దాఖలాలు లేవు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి విషయంలో సీఎం తీరును తప్పు పడుతూ బీఆర్ఎస్, బీజెపి ముఖ్యనేతలు మాట్లాడినప్పటికీ, వారికి కౌంటర్ ఇవ్వడానికి భట్టి విక్రమార్క ఏనాడు ఆసక్తి చూపలేదు. దీన్నిబట్టి సీఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టికి తీవ్ర విభేదాలున్నాయని స్పష్టమవుతోంది.

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వికారాబాద్ సభలో మాట్లాడారు. తెలంగాణలో కుటుంబాలను మించి రేషన్ కార్డులు ఉన్నాయిని, రాష్ట్రంలో కోటి పది లక్షల కుటుంబాలు ఉంటే.. కోటి పాతిక లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని ఉచితాలు తగ్గించాలి. నిరుపేదలైన అర్హులకే ఉచితాలు అందాలంటూ సంక్షేమ పథకాలకు కోత విధించాలనే ధోరణిలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి.

సిఎం రేవంత్ రెడ్డి సొంత విధానాలను హైకమాండు వద్ద వ్యతిరేకిస్తున్నారు. దాంతో అధిష్టానం వద్ద రేవంత్ రెడ్డి ఇమేజ్ గ్రాఫ్ బాగా పడిపోయింది. మొన్న హైదరాబాదుకు వచ్చిన రాహుల్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డితో భేటీ కాకుండానే తిరిగి ఢిల్లీ వెళ్లిపోవడమే అందుకు నిదర్శనం.

గత రెండు, మూడు నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ బాహాటంగా మాట్లాడుతున్నారు. కానీ మంత్రులు మాత్రం మాట్లాడడం లేదు. ఆదాయం లేదు, అప్పులు పుట్టడం లేదు కాబట్టి ఇచ్చిన హామీలను అమలు చేయలేమని ప్రజలకు చెప్పేద్దామని సీఎం రేవంత్ భావిస్తున్నారు. దాని వల్ల ప్రభుత్వానికి మరింత చెడ్డపేరు వస్తుందని, ఇక కాంగ్రెస్ ఎప్పటికీ కోలుకోలేనంతగా భ్రష్టుపడుతుందనేది మొదట్నుంచి హస్తం పార్టీలో ఉన్న మంత్రుల ఆందోళన. కానీ ముఖ్యమంత్రి ఏమో గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ప్రజలకు వివరిస్తూ ఫైనాన్షియల్ ఎమర్జెన్సీ విధించాలని చూస్తున్నారు. ఆర్థిక ఎమర్జెన్సీ విధించడం ద్వారానే ఇచ్చిన హామీలను అమలు చేయలేమని చెప్పగలమని, ఉద్యోగుల బకాయిలు ఇవ్వకుండా ఎగ్గొట్టవచ్చని రైతు భరోసా స్కీములో కోత పెడుతూ ఐదెకరాల వరకు అమలు చేయడం, ఫీజు రీఎంబర్స్ మెంట్ స్కీమును ఎత్తివేయడం వంటివి చేయవచ్చనేది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలు.

ఆర్థిక ఎమర్జెన్సీ విధించే విషయంలోనే సీఎం రేవంత్ రెడ్డికి, ఇతర మంత్రలకు మధ్య హాట్ హాట్ డిస్కషన్స్ జరుగుతున్నట్టు సమాచారం. మంత్రుల మధ్య తర్జనభర్జనలు, మల్లగుల్లాలు, చర్చోపచర్చలు ఓ కొలిక్కిరాకపోవడంతో దానిపై నిర్ణయం తీసుకోలేకపోతున్నారని తెలుస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, గత బీఆర్ఎస్ వైఫల్యాలు ప్రజల్లో చర్చకు రావాలనే సీఎం రేవంత్ రెడ్డి అదే పనిగా రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందని, తనను కోసినా ఒక్క రుపాయి కూడా అదనంగా రాదని చెప్పడం వెనకున్న అసలు అజెండా ఫైనాన్షియల్ ఎమర్జెన్సీ విధించడమే అని సమాచారం.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు నియామకం వెనక కారణం కూడా ఆయన పదేళ్లకు పైగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసి ఉండడం. బీఆర్ఎస్ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిన తీరును ఆయన సీఎం రేవంత్ రెడ్డికి విపులంగా చెప్పి ఉంటారు. ముఖ్యమంత్రి చేస్తున్న ఆర్థిక ఎమర్జెన్సీ విధించే ఆలోచనలకు అనుకూలంగా గ్రౌండ్ ప్రిపేర్ చేయడంలో రామకృష్ణారావు సేవలు కీలకమని భావించే ఆయనను సీఎస్ గా నియమించారని సమాచారం. ఆయన ఇచ్చే ఇన్పుట్సుతోనే సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని, అప్పులు పుట్టడం లేదని, ఉద్యోగుల బకాయిలు చెల్లించడం సాధ్యం కాదనే అంశాలను మాట్లాడారని తెలుస్తోంది.

క్యాబినెటు మంత్రుల్లో సమన్వయం కొరవడింది. కొందరు మంత్రుల వ్యవహారాల్లో సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని, దాంతో వారు ముఖ్యమంత్రి తీరుపట్ల అసంతృప్తితో ఉన్నారని మీడియాలోనే కథనాలు వచ్చాయి. మంత్రులకు కూడా అపాయింట్ మెంట్ ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి ఇబ్బందులు పెడుతున్నారని సమాచారం. దాంతో మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తమను కలుపుకుని పోవడం లేదని, చాలా అంశాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఎప్పటికప్పుడు అధిష్టానానికి నివేదికలు పంపుతున్నారు. ఇలా పైకి అంతా ఒకటే అన్నట్టుగా కనిపిస్తున్నప్పటికీ క్యాబినెటు మంత్రుల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయని సమాచారం. భూముల అన్యాక్రాంతం విషయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటికి సీఎం రేవంత్ రెడ్డికి మధ్య గ్యాపు పెరిగిందట.

ఇపుడున్న మంత్రుల్లోనే తనకు అనుకూలంగా ఉన్నవారు తక్కువగా ఉండడంతో సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ విస్తరణ జరిగితే తన వ్యతిరేకులే మంత్రులు అవుతారనే ఆందోళనతో ఉన్నారు. అందుకే మంత్రివర్గ విస్తరణను తనదైన వ్యూహాలు, ఎత్తుగడలతో అడ్డుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని సీనియర్ నేత జానారెడ్డిచే కాంగ్రెస్ హైకమాండుకు లేఖ రాయించడం, మాదిగలకు, లంబాడాలకు క్యాబినెటులో స్థానం కల్పించాలంటూ సంబంధిత ఎమ్మెల్యేల నుంచి తాను స్వయంగా వినతిపత్రం తీసుకోవడమే కాకుండా హైకమాండుకు రిప్రజంటేషను పంపడం వంటి వ్యూహాలను అమలు చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి మంత్రి పదవి విషయంలో ఇద్దరు ఎమ్మెల్యేల మధ్య విభేదాలు వచ్చేలా వ్యవహరించడం వంటి ఎత్తుగడలన్నీ సీఎం రేవంత్ రెడ్డి వేసిన స్కెచులే.

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వడంపై హైకమాండ్ ప్రామిస్ ఉందని ఆయనకు మద్దతిస్తునే మరోవైపు రంగారెడ్డి జిల్లా కోటాలో మల్ రెడ్డి రంగారెడ్డిని మంత్రి పదవి కోసం లాబీయింగ్ చేసుకోమని సీఎం రేవంత్ రెడ్డినే సూచించారు. ఆ మేరకు జానారెడ్డితో ఢిల్లీకి లేఖ రాయించారు. వివేక్ కు కూడా హైకమాండ్ మంత్రి పదవిని ప్రామిస్ చేసిందని చెప్తూనే క్యాబినెటులో మాలలతో సమానంగా మాదిగలకు ఉండాలని ఆ వర్గం ఎమ్మెల్యేలందరినీ మరో మంత్రి పదవి కోసం ఢిల్లీకి పంపారు. ఇలా మంత్రి పదవుల ఆశావహులందరినీ ఎగదోస్తూ సమీకరణాలను గందరగోళపరుస్తూ అసలు మంత్రివర్గ విస్తరణ జరగకుండా ముఖ్యమంత్రి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.

బీసీలకు క్యాబినెటులో ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. మంత్రివర్గ విస్తరణ జరిగితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఫార్ములా ప్రకారం మరో నాలుగు బెర్తులు ఇవ్వాల్సి ఉంటుంది.అంటే వాకిటి శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, వీర్లపల్లి శంకర్ లకు మంత్రి పదవి దక్కే ఛాన్స్ ఉంది. అసలు బీసీలకు మరో నాలుగు మంత్రి పదవులు ఇవ్వడం సీఎం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదు. ఎమ్మెల్యే టికెట్ల విషయంలో కూడా బీసీలకు తక్కువ సీట్లు దక్కేలా చేసింది కూడా రేవంత్ రెడ్డినే. బీసీల నుంచి పొన్నం ప్రభాకర్ కు డిప్యూటీ సిఎం పదవి, మాదిగల నుంచి దామోదర రాజనర్సింహాకు కూడా డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాల్సి ఉంటుంది. మరో ఇద్దరికి ఉపముఖ్యమంత్రి పదవులు వస్తే తన ప్రాధానత్య తగ్గుతుందని భట్టి విక్రమార్క కూడా క్యాబినెటు విస్తరణకు అడ్డుపడుతున్నారు.

అసలు మంత్రివర్గ విస్తరణ జరగడం సీఎం రేవంత్ రెడ్డికే ఇష్టం లేదు. ఆయన పైకి హైకమాండ్ వద్ద క్యాబినెటు విస్తరణకు సంబంధించి కసరత్తు చేస్తూనే మరోవైపు సమీకరణాలు సాధ్యం కాకుండా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. తనకు అనుకూలమైన వారికి మంత్రి పదవులు వచ్చే అవకాశం లేకపోవడం, కొత్త మంత్రులు వస్తే తన వద్ద ఉన్న హెూం శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పట్టణాభివృద్ధి శాఖ, విద్యా శాఖ ఇంకా ఇతర శాఖలు పోతాయి. ఆ శాఖలను వదులుకోవడం సీఎం రేవంత్ రెడ్డికి ఇష్టం లేదు. అందుకే ఆయన మంత్రివర్గ విస్తరణకు వ్యూహాత్మకంగా అడ్డుపడుతూ నెపం హైకమాండుపై నెడుతున్నారు. అంటే మంత్రివర్గ విస్తరణకు ఉన్న ప్రధాన అడ్డంకి సీఎం రేవంత్ రెడ్డినే. కొత్త మంత్రులు రాకుండా అడ్డుపడుతున్న కుట్రదారు ముఖ్యమంత్రినే. ఏడాదిన్నర కాలంగా మంత్రివర్గ విస్తరణ చేపట్టకపోవడానికి తెర వెనక మంత్రాంగం నడుపుతున్నది సీఎం రేవంత్ రెడ్డినే. మంత్రి పదవుల ఆశావహులను ఓవైపు హైకమాండు పెద్దలను కలవాలని సూచిస్తూనే మరోవైపు వారికి వ్యతిరేకండా సమీకరణాలను సిద్ధం చేసి అధిష్టానానికి నివేదికలు ఇస్తున్నది కూడా ముఖ్యమంత్రినే. అంటే దూడను పాలు చీకమంటున్నడు. ఆవును తన్నమంటున్నడు. ఇదీ క్యాబినెటు విస్తరణ వెనకున్న రేవంత్ రెడ్డి మాస్టర్ మైండ్. మంత్రివర్గ విస్తరణ జరగకపోవడానికి సిఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా వ్యహరించడం ఎంత కారణమో, కాంగ్రెస్ అధిష్టానం పెద్దలు కూడా తమదైన ఎత్తగడలు వేస్తుండడం కూడా అంతే కారణం. సీనియర్ మంత్రులు ఇస్తున్న నివేదికలతో పాటు తమతో సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుకు కాంగ్రెస్ హైకమాండ్ కూడా అసంతృప్తిగా ఉందట. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కూడా కాలేదని అందుకే సీఎం మార్పుపై తొందరపడడం లేదని హైకమాండ్ పెద్దలంటున్నారట. ముఖ్యమంత్రి మార్పు గురించి హైకమాండ్ ఆలోచన చేస్తోంది కాబట్టే, మంత్రి వర్గ విస్తరణ గురించి సీరియసుగా కసరత్తు చేయడం లేదట.

లోకల్ బాడీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి మార్పు గురించి ఆలోచిస్తామని హైకమాండ్ పెద్దలు సీనియర్ మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిలతో చెప్పిందట. అందుకే వారిద్దరు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, కొడంగల్ భూముల సేకరణ వంటి అంశాల్లో సీఎం రేవంత్ రెడ్డి లోపాలు, తప్పిదాలతో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి తీరుపై అసంతృప్తితో ఉన్న అంశాలపై అదే పనిగా హైకమాండుకు నివేదికలు పంపుతున్నారట.

## దేశంలోకి ఉగ్రవాదులు అడుగిడితే.. అదే చివరి రోజు

తిరంగా ర్యాలీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి, మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నేతలు, కార్యకర్తలు, విజయవాడ నగరవాసులు భారీగా పాల్గొన్నారు. జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీకి నగరవాసులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ఆరేషన్ సిందూర్ లాంటి కార్యక్రమాలకు దేశం సిద్ధమని ప్రపంచంలోని ఉగ్రవాదులకు హెచ్చరిక కావాలని సీఎం చంద్రబాబు అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశంలో పాకిస్థాన్ వల్ల ఎప్పుడు ప్రశాంతత చూడలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతుంటే పాకిస్థాన్ చూసి ఓర్వలేక పోతుందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంత ప్రశాంతంగా ఉన్నామంటే బోర్డర్‌లో దేశాన్ని కాపాడుతున్న సైనికులతోనేనని తెలిపారు. దేశం కోసం పోరాడిన మురళీనాయక్ లాంటి సైనికులు దేశానికి నిజమైన నాయకులని చెప్పారు. చనిపోతే సైనికుడిగా దేశం కోసం పోరాడిన మురళీ నాయక్‌లాగా చనిపోవాలని అన్నారు. సెలబ్రిటీస్ నుంచి దేశభక్తి ఆశించవద్దని... సినిమా హీరోలంతా దేశాన్ని నడిపేవారు కాదని అన్నారు. వాళ్లంతా ఎంటర్-టైన్ చేసేవాళ్లు మాత్రమేనని చెప్పారు. శాంతి వచనాలు ఇక పని చేయవని అన్నారు. పాకిస్థాన్ వాళ్లు తమ దేశంలోకి వచ్చి కొడితే ... వాళ్ల సరిహద్దు దాటి వారి ఇళ్లల్లోకి వచ్చి తాము కొడతామని పవన్ కల్యాణ్ తీవ్రంగా హెచ్చరించారు. భారతదేశానికి తమ ఐక్యమత్యాన్ని చాటేందుకు తిరంగా యాత్రకు ప్రజలు భారీగా తరలి వచ్చారని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తెలిపారు. 2014 సంవత్సరం నుంచి సమర్ధవంతమైన నాయకత్వం దేశానికి లభించిందని గుర్తుచేశారు. దేశ భద్రతకు ఆటంకం కలిగిస్తే.. ఎదురుదాడి చాలా తీవ్రంగా ఉంటు-ందని హెచ్చరించారు. ఇటీ-వల మన వాళ్లను ఉగ్రవాదులు పొట్టన పెట్టు-కున్న ఘటనకు పాకిస్థాన్‌కు జవాబు ధీటు-గా ఇచ్చామని దగ్గుబాటి పురంధేశ్వరి ఉద్ఘాటించారు. మన పౌరులపై పాకిస్థాన్ దాడులు చేస్తే.. వారి స్థావరాలను ధ్వంసం చేశాం. సరిహద్దుల్లో వారి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశప్రజలకు రక్షణ వలయంగా నిలబడుతున్న సైనికులకు, ప్రధాని మోదీకి సంఘీభావంగా ఈ తిరంగా యాత్ర చేపట్టాం. ఈ యాత్రకు అందరూ స్వచ్ఛందంగా వచ్చారు. మన రాష్ట్రానికి చెందిన ముద్దుబిడ్డ మురళీ నాయక్ ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో ధీ-టైన సమాధానం ఇచ్చారు. ఉగ్రవాదం .. చర్చలు సమాంతరంగా వెళ్లలేవు.. ఉగ్రవాదం .. వాణిజ్యం సమాంతరంగా వెళ్లకూడదని మోదీ స్పష్టంగా చెప్పారు. నీరు, రక్తం కూడా సమాంతరంగా పారలేవనే ధృడమైన అభిప్రాయాలను ప్రధాని మోదీ సందేశాన్ని పొరుగు దేశానికి ఇచ్చారు. పాకిస్థాన్ నేడు తోకముడిచి మన ప్రభుత్వానికి సింధూ జలాలను వదలాలని లేఖ రాసింది. మన దేశం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటు-న్న నేపథ్యంలో సైనికులకు అండగా ఉంటూ మన ప్రజలంతా సంఘీభావం తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో సైనికులకు, మోదీకి ప్రజలంతా అండగా ఉండాలని దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు.

## రక్షణ బలగాలకు ఆత్మస్థయిర్యం

**అమరావతి,మే16( వెలుతురు):**

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడి యావత్ దేశాన్ని కదిలించిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. జాతీయ భద్రత కోసం జనసేన ఆధ్వర్యంలో సర్వమత ప్రార్థనలు చేస్తున్నామని అన్నారు. సైనిక బలగాలకు ఆధ్యాత్మిక సంఘీభావం ప్రకటిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు. ఇలాంటి సమయంలో ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద మూలాలపై, వారికి సహకరిస్తున్న పాకిస్థాన్ ఆర్మీపై దాడులు చేసి ఉగ్రమూకలను అంతం చేసి తిరుగులేని ధైర్య సాహసాలను భారత బలగాలు ప్రదర్శించాయని పవన్ కల్యాణ్ చెప్పారు. భారత్‌కు రక్షణ కవచంలా నిలిచిన మన భద్రతా దళాలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న భారతదేశానికి, మన రక్షణ బలగాల రక్షణ కోసం పూజలు చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. తమిళనాడులోని దేవసేనాని సుబ్రహ్మణ్య స్వామి వారి 6 షష్ట షణ్ముఖ ఆలయాల్లో, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని 4 సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లో, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ వారి ఆలయంలో, అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో, ఇతర ఆలయాలు, మసీదుల్లో, చర్చిల్లో సర్వమత ప్రార్థనలు చేస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలో జనసేన నేతలకు, జనసైనికులను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. మతాలకు అతీతంగా ఈ సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్న నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. భారత సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు, ఉగ్రవాదాన్ని తుద ముట్టించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా, బలంగా నిలబడుదాం, భారత దేశపు ఐక్యతను చాటి చెబుదామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## సోలార్ విద్యుత్‌దే భవిష్యత్

రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకొస్తామన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని మంత్రి లోకేశ్ చెప్పుకొచ్చారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లిలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్..సోలార్ ప్రాజెక్టుకు నారా లోకేశ్ భూమిపూజ చేశారు. 2,300 ఎకరాల్లో రూ.22వేల కోట్లతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఎపిలో పలు సంస్థలు పెట్టుబడి పెట్టడానికి సిఎం చంద్రబాబు బ్రాండే కారణమని మంత్రి లోకేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్. రెన్యూ సంస్థ చైర్మన్, సీఈఓ సుమంత్ సిన్హా, తదితర జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ .... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయని అన్నారు. వివిధ సంస్థలు పెట్టుబడి పెట్టడానికి సిఎం చంద్రబాబు బ్రాండే కారణమని చెప్పారు. రాయలసీమలో రెన్యూ విద్యుత్ కాంప్లెక్స్ ఏర్పాటుతో 10 వేల మందికి ఉద్యోగాలు కల్పించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. నేలపై ఉత్పత్తయ్యే విద్యుత్ రాష్ట్రానికే కాకుండా ... దేశ అవసరాలకు కూడా ఉపయోగ పడనుందని తెలిపారు. ఇలాంటి ప్రాజెక్టులతో విద్యుత్ ఛార్జీలు తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. త్వరలోనే కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తామని లోకేష్ వెల్లడించారు. గత ప్రభుత్వం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేకపోయిందని విమర్శించారు. ఒక్క పెట్టుబడి కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. ప్రస్తుతం టాటా ఎనర్జీ, టీసీఎస్ సహా అనేక సంస్థలు పెట్టు-బడులు పెడుతున్నాయని లోకేష్ వివరించారు. డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను వచ్చే నెలలో భర్తీ చేస్తామని లోకేష్ వివరించారు. వైసీపీ హయాంలో రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా రాలేదు. ఈ సోలార్ ప్రాజెక్ట్ ద్వారా విద్యుత్ చార్జీలు తగ్గుతాయి. మన ఆంధ్ర రాష్ట్రం నుంచి భారతదేశానికి మొత్తం మనమే విద్యుత్ సరఫరా చేస్తాం. గడచిన ఐదు సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్రంలో ఒక్క రోడ్డు వేయలేదు, రోడ్డుపై ఉన్న గుంతలను కూడా పూడ్చలేదు. రెన్యువబుల్ ఎనర్జీ పరిశ్రమ మాత్రమే కాదు.. ఉద్యమం. భారత క్లీన్ ఎనర్జీ విప్లవానికి శంకుస్థాపన చేశాం. ఏపీ క్లీన్ ఎనర్జీ పాలసీకి అనుగుణంగా ఎ÷-జాజెక్ట్ రూపకల్పన చేశాం. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణే మా నినాదం. అనంతపురానికి కియా మోటార్ల పరిశ్రమ తెచ్చాం. మేక్ ఇన్ ఇండియా ద్వారా రాష్ట్రానికి మరిన్ని పెట్టు-బడులు తీసుకొస్తాం. వైసీపీ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల కాలంలో సర్వనాశనం చేశారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం భారీ విక్టరీ సాధించిన తర్వాత రాష్ట్రం పురోగతి సాధించిందని అన్నారు. రాయలసీమ ప్రకాశం జిల్లాలో సోలార్ గ్రీన్ ఎనర్జీగా తీర్చిదిద్దుతాం. భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీని కూడా రాయలసీమకు తీసుకొస్తాం. ఎన్డీఏ కూటమి 11 నెలలోనే సంక్షేమ పథకాలతో పాటు- అభివృద్ధిలో ముందుకు వెళుతున్నాం. ప్రజలు ఆశీస్సులు ఉంటే రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి చూపిస్తాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పునర్విభజన చేసిన తర్వాత రాజధాని ఎక్కడో తెలియదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని అమరావతిగా తీర్చిదిద్దుతున్నారు. 2019 నుంచి 24 వరకు వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేశారని మంత్రి నారా లోకేశ్ చెప్పుకొచ్చారు.

## మంత్రి కొండా సురేఖ నిజాలు మాట్లాడారు

కమీషన్ సర్కార్ నడుస్తోందని విమర్శించారు. 30 శాతం కమిషన్ లేకుండా ఫైళ్లపై మంత్రులు సంతకాలు పెట్టరని వారి సహచర మంత్రులే చెబుతున్నారని, సచివాలయం లోపల కాంట్రాక్టర్లు ధర్నాలు చేయడం చూస్తే, ఈ వ్యవస్థలో కమిషన్ వ్యవహారం ఎంత లోతుగా ఉందో స్పష్టమవుతోందన్నారు. మంత్రుల పేర్లను బహిర్గతం చేసి ప్రజలకు సత్యం చెప్పాలని కొండా సురేఖని కోరుతున్నానని, రేవంత్ రెడ్డి లేదా రాహుల్ గాంధీ, ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా? అంటూ కేటీఆర్ విమర్శల వర్షం కురిపించారు. అయితే దీనిపై కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పుగా ప్రచారం చేస్తోందని, తన మాటల ఉద్దేశం గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులపైనేనని స్పష్టం చేశారు. పనులకు అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు అన్నదే నా మాట. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలపై ఎలాంటి విమర్శలు చేయలేదంటూ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారానికి తావు ఇవ్వడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు. ఓ అభివృద్ధి కార్యక్రమానికి భూమి పూజ సందర్భంగా తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి అరబిందో ఫార్మా కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.4.5కోట్లతో భవనం నిర్మించేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. 'క్లియరెన్స్ కోసం మంత్రుల వద్దకు కొన్ని ఫైల్స్ వస్తుంటాయి. మామూలుగా మంత్రులు అలాంటి ఫైల్స్ వచ్చినప్పుడు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేం మాత్రం మాకు నయా పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు.. సామాజిక బాధ్యతగా స్కూల్‌ను అభివృద్ధి చేయాలని కోరాం' అని ఆమె వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. తన వ్యాఖ్యలు కలకలం సృష్టించడంతో కొండా సురేఖ వివరణ ఇచ్చారు. భారాస ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారన్నారు. ఇలా తప్పుడు ప్రచారం చేయడం సహేతుకం కాదని చెప్పారు. ఏ పని-కై-నా అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారని అన్నానని తెలిపారు.

## కమిషన్లతో నడిచింది కెసిఆర్ ప్రభుత్వమే

ప్రభుత్వానికి అంట గట్టడం అవివేకం, దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేటీఆర్ అబద్ధాలు చెప్పి కాలం వెల్లదిస్తున్నారు..గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో భూములు మారిపోయాయని మంత్రి సీతక్క ఆరోపించారు. అయితే, ధరణిలో మోఖ మీద ఉన్న రైతులకు కాకుండా వేరే వాళ్ళకి భూములు పట్టాలు చేశారని సీతక్క అన్నారు. భూమి న్యాయంగా ఎవ్వరికి దక్కాలో వారికే దక్కేందుకు తీసుకొచ్చిందే భూ భారతి లక్ష్యం.. భూ స్వాములకు తిరిగి భూములు తీసుకోవడం కోసం ధరణి పని చేసింది.. జూన్ 2వ తేదీ నుంచి రైతుల కనీళ్లు తుడిచేది భూ భారతి అమలు చేస్తున్నాం.. ఇక, రాజకీయ జోక్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలు.. ఐటిడిఎల పరిధిలో ఉన్న వాళ్ళకు స్పెషల్ గా ఇండ్లు ఇస్తాం.. అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసమే ఇందిరమ్మ ఇండ్లు.. ప్రజా ప్రతినిధులు అర్హత లేని వారు ఉంటే చెప్పండి తొలగించడానికి మేము సిద్ధంగా ఉన్నామని మంత్రి అన్నారు. ఈ లిస్టులో రాకపోతే తరువాత వచ్చే లిస్టులో ఉంటదని మంత్రి సీతక్క వెల్లడించింది. ఇక, భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా రెండో విడత పెంచికల్ పెట్ లో నిర్వహించడం జరుగుతుందని మంత్రి సీతక్క అన్నారు. 12 ఏళ్ల నుంచి ఎదుర్కొంటున్న చిక్కు ముడులను తీయడానికి భూ భారతి చట్టం తీసుకొచ్చాం.. కాస్తు కాలం తీసేయడంతో రైతులు ఆత్మహత్యలు, అధికారులపై దాడులు జరిగాయి.. కేసీఆర్ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాహుల్ గాంధీ కూడా ధరణిని తీసేస్తామని అన్నారు.. రైతు హక్కులు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.. పోడు చేస్తున్న రైతులకు గిరి వికాసం క్రింద సోలార్ ను అందించి భూమి సస్యశ్యామలం చేయాలని కోరారు.. ప్రతి నియోజకవర్గంలో3500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం.. ఐటిడిఎ నుంచి కూడా ఆదివాసులకు అందించేందుకు చర్యలు చేపట్టాం.. ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు రైతులకు సహకరించాలి, ఎలాటి ఇబ్బందులు పె-÷-టటొ-దని పేర్కొన్నారు. కొత్త అడవిని కొట్టవద్దు. దాని కోసం అవగాహన కల్పిస్తామని సీతక్క చెప్పుకొచ్చారు.

# ధరణి వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు

- భూ భారతి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తాం
- పట్టాదారు పాసు పుస్తకంలో భూకమతాల మ్యాపుల ముద్రణ
- నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాల భూభారతి సదస్సుల్లో
- రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార

**పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ / నిర్మల్ / ఆసిఫాబాద్ వెలుతురు మే 16:**



ధరణి పోర్టల్ వల్ల రైతులు నిద్రలేని రాత్రులు గడిపారని, గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్ల తొందరపాటు వల్ల వారి ప్రమేయం లేకుండానే రైతులు శిక్షను అనుభవించారని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

శుక్రవారం నాడు నిర్మల్ ఆసిఫాబాద్ జిల్లాల్లో గిరిజన



సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి సీతక్క తో కలిసి భూభారతి అవగాహన సదస్సుల్లో మంత్రి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో భాగంగా ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

భూభారతి నాలుగు పైలట్ మండలాల్లో 13వేల దరఖాస్తులు



వచ్చాయని వీలైనంతవరకూ ఈనెల 30వ తేదీలోగా పరిష్కరించవలసిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. తహసిల్దార్, ఆర్డిఓ, అదనపు కలెక్టర్, కలెక్టర్, సీసీఎల్ఏ, ఆపై ట్రిబ్యునల్ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థను ఈ చట్టం అనుసరించి రూపొందించినట్లు తెలిపారు.

ప్రజలకు రెవెన్యూశాఖ సేవలు సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణను అమలు చేస్తుందని పేర్కొన్నారు. భూభారతి కార్యక్రమం ద్వారా భూ సంబంధిత సమస్యల పరిష్కారం వేగవంతంగా జరగడమే కాకుండా, రైతులకు నమ్మకమైన భూ సమాచారం అందుతోందని మంత్రి తెలిపారు. వాస్తవిక డేటాతో భూ పత్రాలను సమర్పించడం వల్ల భవిష్యత్తులో హక్కులపై ఆందోళనలు తలెత్తవని స్పష్టం చేశారు. ఉద్దేశ్యపూర్వకంగా భూ సమస్యలను అ పరిష్కృతంగా ఉంచుతే సంబంధిత అధికారులపై చర్యలు ఉంటాయన్నారు.

భూ యజమానుల భూ కమతాలకు మ్యాపులను పట్టాదారు పాసుపుస్తకంలో ముద్రించి ఇస్తామని తెలిపారు. ఆరువేల మంది లైసెన్సు కలిగి ఉన్న సర్వేయర్లను అధికారికంగా నియమిస్తున్నామని చెప్పారు. దీంతో భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియ సులభతరం అవుతుందని అన్నారు. అలాగే త్వరలోనే గ్రామ రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని అన్నారు. భూములు ఉన్న ప్రతి ఒక్కరికి భూ భారతి చట్టం ద్వారా రక్షణ ఏర్పడుతుందని అన్నారు. పట్టా లేని భూములను సాగు చేసుకుంటున్న అర్హులైన పోడు భూముల రైతులకు పట్టాలు అందజేస్తామని అన్నారు. ఈ సమావేశాల్లో సిసిఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లపై ఆందోళన వద్దు



అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని అన్నారు. తొలి విడతలో ఇండ్లు రానివారు ఆందోళన చెందవద్దని అన్నారు. మొదటి విడతగా ప్రతీ నియోజక వర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని, మరో నాలుగు విడతల్లో కూడా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని మంత్రి పొంగులేటి అన్నారు.

# ఆపరేషన్ సిందూర్‌తో పెరగనున్న రక్షణ బడ్జెట్

- మరో 50వేల కోట్లు కేటాయించున్న కేంద్రం
- తాజా కేటాయింపులపై సన్నాహాలు?

**న్యూఢిల్లీ,మే16( వెలుతురు):**

భారత్-పాక్ ఉద్రిక్తతల వేళ రక్షణరంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- సమాచారం. ఆ రంగానికి రూ.50,000 కోట్ల మేర బడ్జెట్ లో అదనపు కేటాయింపులు చేపట్టవచ్చని తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా సన్నాహాలు చేస్తుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది రక్షణశాఖ కేటాయింపులు రూ.6.81 లక్షల కోట్లుగా ఉన్నాయి. తాజాగా పెంపునకు పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం లభించే అవకాశాలున్నాయి. దాంతో రక్షణశాఖకు కేటాయించిన నిధులు రూ.7 లక్షల కోట్లు- దాటుతాయని ఆ వర్గాలు తెలిపాయి. ఇండియన్ ఆర్మీ వరుస విజయాలు సాధించిన నేపథ్యంలో.. భవిష్యత్ అవసరాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రక్షణ శాఖకు మరో 50 వేల కోట్ల రూపాయల నిధుల్ని కేటాయించాలని భావిస్తున్నట్లు- తెలుస్తోంది. పహల్గామ్ దాడి తర్వాత భారత్ ఏ విధంగా స్పందిస్తుందా.. అని ప్రతీ భారత పౌరుడితో పాటు ప్రపంచం మొత్తం ఎంతో ఆత్రుతగా ఎదురు చూసింది. ఎవ్వరూ ఊహించని విధంగా ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది. పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి మరీ ఇండియన్ ఆర్మీ ఉగ్రవాదులపై దాడులు




చేసింది. వంద మంది ఉగ్రవాదులు ఈ దాడుల్లో చనిపోయారు. తర్వాత రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధంలో కూడా భారత్ తన సత్తా ఏంటో చూపించింది. పాకిస్తాన్‌లోని ఏయిర్‌బేస్‌లు, ఆర్మీ పోస్టులను ధ్వంసం చేసింది. 2025.. 2026 సంవత్సరానికి గాను భారత ప్రభుత్వం రక్షణ శాఖకు 6.81 లక్షల కోట్లను కేటాయించింది. గత సంవత్సరం కంటే ఇది చాలా ఎక్కువ. 2024..2025 సంవత్సరానికి గానూ కేంద్రం 6.22 కోట్లను కేటాయించింది. 2025..2026 సంవత్సరానికి ఆ నిధుల్ని 9.2 శాతం పెంచేసింది. వచ్చే బడ్జెట్.. అంటే 2026, 2027 సంవత్సరానికి గాను 6.81 లక్షల కోట్లకు మరో 50 వేల కోట్లు వచ్చి చేరే అవకాశం ఉంది. మొత్తంగా రక్షణ శాఖ బడ్జెట్ ఏకంగా 7 లక్షల కోట్లకు పైకే చేరుతుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఆమోదం పొందనుంది. ఏడు లక్షల కోట్ల బడ్జెట్ మొత్తాన్ని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఆయుధాల కొనుగోళ్లు, ఇతర అవసరమైన వస్తువుల కొనుగోలుకు వాడనున్నారు. 2014లో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రక్షణ శాఖపై ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరమే ఏకంగా రూ. 2.29 లక్షల కోట్లను కేటాయించారు. చైనా, పాకిస్థాన్ నుంచి భద్రతా సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణరంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం పెంచిన సంగతి తెలిసిందే. రూ.50వేల కోట్ల అనుబంధ బడ్జెట్‌లో నిధులను పరిశోధన, ఆయుధాలు, అవసరమైన పరికరాల కొనుగోలుకు ఉపయోగించే అవకాశాలున్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరానికి ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో డిఫెన్స్ కేటాయింపులు రూ.2.29 లక్షల కోట్లుగా ఉన్నాయి. మొత్తం వార్షిక పద్దులో 13 శాతం రక్షణకే కేటాయించారు.

# సింధూ నదీ జలాల వినియోగం

- భారీ రిజర్వాయర్ల నిర్మాణం
- తక్షణ ప్రణాళికలు సిద్ధంచేస్తోన్న ప్రభుత్వం

**న్యూఢిల్లీ,మే16( వెలుతురు):**

సింధు, జీలం, చీనాబ్ నదులపై కొత్తగా డ్యామ్‌లు, భారీ రిజర్వాయర్లు త్వరితగతిన నిర్మించాలని భారత్ భావిస్తోంది. అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతోంది. ఈ మేరకు శీఘ్ర ప్రణాళికలు సిద్ధంచేస్తోంది. పాక్‌కు ఇక్కడి నుంచిచుక్కనీరు కూడా వెళ్లకుండా ఉండేలా వీటిని అమలు చేయబోతున్నారు. ఏప్రిల్ 22 పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది అమాయక ప్రజల ప్రాణాలు కోల్పోయిన తర్వాత పాకిస్థాన్‌తో భారత్.. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సింధు నది, దాని ఉప నదులైన జీలం, చీనాబ్ జల వనరుల్ని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు ఆయా నదులపై కొత్త ప్రాజెక్టుల ప్రణాళిక, అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రణబీర్ కాలువను విస్తరించే ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నట్టు- సమాచారం. ఇది భారత్ చేపట్టాలని భావిస్తోన్న కీలక ప్రణాళికలలో ఒకటి. రణబీర్ కాలువ పొడవును 120 కి.మీ.కు రెట్టింపు చేయాలని, తద్వారా సెకనుకు 150 క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించడానికి వీలు కలుగుతుందని అంటు-న్నారు. ప్రస్తుతం దీని సామర్థం 40 క్యూబిక్ మీటర్లు. దీంతోపాటు-, సింధు, చీనాబ్, జీలం నదుల నుండి నీటిని మూడు ఉత్తర భారత రాష్ట్రాలలోని నదుల్లోకి తరలించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు- రాయిటర్స్ వార్తా సంస్థ చెబుతోంది. ప్రస్తుతం సింధు దాని ఉప నదులపై ఉన్న చిన్న జలవిద్యుత్ ప్రాజెక్టుల సామర్థ్యాన్ని ప్రస్తుతం ఉన్న 3,360 మెగావాట్ల నుండి 12,000 మెగావాట్లకు పెంచాలని భావిస్తున్నట్టు- చెబుతున్నారు. కొత్తగా భారత్ ఈ నదులపై కనీసం ఐదు నీటి నిల్వ ప్రాజెక్టులను గుర్తించిందని, వాటిలో నాలుగు చీనాబ్, జీలం ఉపనదులపై ఉన్నాయని తెలిపింది. కాగా, పాకిస్తాన్‌లోని దాదాపు 80 శాతంపొలాలకి, అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు కూడా సింధు నీటి ప్రవాహంపై ఆధారపడి ఉన్నాయి. పాకిస్తాన్ తో భారత్ సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న తర్వాత మే ప్రారంభంలో పాకిస్తాన్‌లోని కీలకమైన ప్రాజెక్టుల్లో నీరు 90శాతం వరకు తగ్గిందిని చెబుతున్నారు. సింధునది టిబెట్‌లోని మానసరోవర్ దగ్గర ఉద్భవించి, అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది భారత్ లోని ఉత్తర, పాకిస్తాన్ లోని తూర్పు, ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రవహిస్తుంది.



## ముగిసిన కాళేశ్వరం కమిషన్ విచారణ

- ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు కసరత్తు

**హైదరాబాద్,మే16( వెలుతురు):**

కాళేశ్వరంపై విచారణ చేస్తున్న కమిషన్ తన విచారణ ప్రక్రియను పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. నివేదికకు తుది మెరుగులు దిద్ది ఈనెల మూడో వారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించనుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గతేడాది నుంచి విచారణ చేస్తోంది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై కమిషన్ విచారణ జరిపింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను విచారించింది. వారి నుంచి అఫిడవిట్లు- తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలను కూడా కమిషన్ పరిశీలించింది. అన్ని అంశాలను కమిషన్ పరిగణనలోకి తీసుకొంది. గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ను కూడా విచారణకు పిలవాలని కమిషన్ మొదట భావించింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వారిని విచారణకు పిలవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి కమిషన్ వచ్చినట్టు- సమాచారం.

# సంపాదకీయం..

## అకాల వర్షాలతో కుదేలు !

ఏ ప్రభుత్వం వచ్చినా అన్నదాతలను ఆదుకోవడం లేదన్నది అర్థం అయ్యింది. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లడం లేదు. మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది. మంత్రులు ప్రకటనలకే పరిమితం అయ్యారు. ఇటీవల ధాన్యం అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగడం లేదు. గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి ప్రకటించలేదు. ఇప్పుడేమో ధర్నాలు, ఆందోళనలకు బిఆర్ఎస్ పిలుపునివ్వడం సిగ్గుచేటు. ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నాడుస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కొనేలా ప్రణాళికలు సిద్దం చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడం అన్నదాతలకు కష్టంగా మారింది. ఇప్పటికే ధరల హెచ్చు తగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా, పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వరి, వేరుశనగ, జొన్న,మక్క జొన్న ఇలా పంట ఏదైనా కొనుగోళ్లు సక్రమంగా లేవు. మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి కొనుగోలు చేయాలని కోరగా కొందరు నిరాకరించారు. ఓ వైపు మబ్బులు కమ్ముకొస్తున్న వేళ ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసి ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో చేసేదేమీ లేక జిల్లాల్లో వేరుశనగ రైతులు మళ్లీ బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. పంట పండించడం ఒక ఎత్తయితే పంట అమ్ముకోవడం మరో ఎత్తవుతున్నది. మార్కెట్‌లో వేరుశనగను ఎవరూ ఖరీదు చేయకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మిల్లుల వద్దకు వెళ్లి అడిగితే తక్కువ ధరకు కొంటామంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లే వచ్చింది. దిగుబడి తగ్గి నష్టపోగా, ధర లేకపోవడం, వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో సాగుచేయడం భారంగా మారుతోంది. పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వాలని కోరుతున్నారు. తామే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. మొలకలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాల్సి ఉంది. ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. జొన్నలను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చామని, తూకం వేసిన అనంతరం లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని రైతులు తెలిపారు. జొన్న బస్తాలను తరలించేందుకు ఒక్కో బస్తాకి రూ.10-రూ.20 తీసుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రం అంతటా ఇదే దుస్థితి నెలకొంది. వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టి రైతులకు ఊరట కల్పించాల్సి ఉంది. ఇకపోతే గత నాలుగేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతన్నలకు వాతావరణశాఖ శుభవార్త అందజేసింది. ఈ ఏడాది ముందుగానే నైరుతి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉంది. మే 27ననే నైరుతి రుతుపవనాలు రానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.. వాతావరణశాఖ అంచనాల ప్రకారం ఈ ఏడాది సాధారణం కన్నా ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలిపింది. రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని అంచనా వేసింది. ఆగస్టు- సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. గతేడాది నైరుతి రుతుపవనాలు రాక ఆలస్యం కావడంతోపాటు.. దేశంలోనూ వివిధ ప్రాంతాలకు ఆలస్యంగా విస్తరించడంతో తొలకరి జల్లుల కోసం రైతులు కళ్లు కాయలు కాసే వరకు ఎదురు చూశారు. పైగా నైరుతి రుతుపవనాల ప్రభావం కూడా తొలినాళ్లలో పెద్దగా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండుతున్న ఎండాకాలం ప్రజలందరికీ వాతావరణశాఖ చల్లటి కబురు పంపింది. నైరుతి రుతుపవనాలు ఇప్పటికే అండమాన్‌ను తాకాయి. ఇప్పటికే వర్షాలు లేక జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. రుతుపవనాలు రాకతో విస్తరంగా వర్షాలు కురవనున్నాయి. సరైన సమయంలో రుతుపవనాలు పలకరిస్తే.... సకాలంలో పంటలు వేయడం వల్ల ఆ తర్వాత వచ్చే తుపాన్‌లు, వరదల నుంచి పంటను కాపాడుకునే అవకాశం ఉంది. వాతావరణశాఖ తెలిపిన చల్లని కబురుతో రైతుల ముఖంలో వెలుగులు నిండాయి. ఇప్పటికే పంటపొలాలను సిద్ధం చేసుకుని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. మనదేశంలో నైరుతి రుతుపవనాల వల్లే విస్తరంగా వర్షాలు కురుస్తాయి. వర్షాధార పంటలకూ ఇవే ఆధారం. దేశంలో జూన్, జులై నెలలో పడే వర్షాలే అత్యంత కీలకం. సాధారణంగా నైరుతి రుతుపవనాలు కొంచెం అటు, ఇటుగా జూన్ తొలివారంలోనే దేశంలోకి ప్రవేశిస్తాయి. గతేడాది జూన్ 8న రాగా...ఈసారి వారం రోజులు ముందుగానే పలకరించనున్నాయి. ఒకసారి కేరళలోకి ప్రవేశించిన తర్వాత వారం పదిరోజుల్లోనే దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. తెలంగాణ ఏపీ భూభాగంపైకి విస్తరించి సమృద్ధిగా వర్షాలు కురిపిస్తాయి. వర్షాధార పంటలపైనే ఆధారపడే తెలుగు రాష్ట్రాల ప్రజలకు నైరుతి రుతుపవనాల రాక ఎంతో కీలకం. అనుకున్న సమయం కన్నా ఆలస్యం కావడం వల్ల తొలినాళ్లలో వర్షాలు లేక ఇబ్బందిపడిన రైతులు... ఆ తర్వాత పంటలు చేతికొచ్చే సమయంలో కుంభవృష్టితో మరోసారి నష్టపోయారు.ఈసారి సకాలంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ కబురుతో రైతుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి.

# పాక్‌తో దూరంగా తాలిబన్ ప్రభుత్వం

- జైశంకర్‌తో విదేశాంగ మంత్రి చర్చలు
- కలసివస్తున్న అంతర్జాతీయ పరిణామాలు

**న్యూఢిల్లీ,మే16 ( వెలుతురు):**

భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే. అయితే, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సంచలన ఆరోపణలు చేసింది. భారత్ ప్రయోగించిన ఓ క్షిపణి అఫ్గాన్ భూభాగంలో పడినట్లు తప్పుడు ప్రచారం చేసింది. దీన్ని కాబూల్ ఖండించింది. తమకు ఎలాంటి హాని జరగలేదని, అదంతా అవాస్తవమేనని తాలిబన్ రక్షణశాఖ ప్రతినిధి వెల్లడించారు. అటు న్యూదిల్లీ కూడా పాక్ ప్రచారాన్ని తిప్పికొట్టింది. ఈక్రమంలో తాజాగా అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వంలో తాత్కాలిక విదేశాంగ మంత్రిగా ఉన్న ఆమిర్‌ఖాన్ ముత్తాఖీతో.. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్. జైశంకర్ ఫోన్‌లో మాట్లాడారు. పహల్గాం ఉగ్రదాడిని తాలిబన్లు ఖండించడాన్ని జైశంకర్ స్వాగతించారు. ఈవిషయాన్ని కేంద్రమంత్రి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తాలిబన్ ప్రభుత్వంతో న్యూదిల్లీ మంత్రిత్వ స్థాయి చర్చలు జరపడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అఫ్గాన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి ఆమిర్ ఖాన్‌తో మంచి సంభాషణ జరిగింది. పహల్గాం ఉగ్రదాడిని ఆయన ఖండించడం హర్షణీయం. భారత్-అఫ్గానిస్థాన్ మధ్య విభేదాలు సృష్టించేందుకు ఇటీవల అవాస్తవ, నిరాధార ప్రచారం జరిగింది. దాన్ని ఆయన తోసిపుచ్చడాన్ని స్వాగతిస్తున్నా. అఫ్గాన్ ప్రజలతో మా స్నేహబంధాన్ని కొనసాగిస్తాం. వారి అభివృద్ధికి నిరంతర మద్దతు అందిస్తాం. ఇరు దేశాల మధ్య పరస్పర సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే అంశంపై మేం చర్చలు జరిపామని జైశంకర్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 2021 ఆగస్టులో అఫ్గాన్‌లో



తాలిబన్ పాలన ఏర్పడిన సంగతి తెలిసిందే. ఆ ప్రభుత్వాన్ని భారత్ అధికారికంగా గుర్తించనప్పటికీ దౌత్య సంబంధాలు మాత్రం కొనసాగిస్తోంది. ఈ ఏడాది జనవరిలో దుబాయ్ వేదికగా ఇరు దేశాల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. మరోవైపు, అఫ్గాన్‌లో అల్‌ఖైదా, ఐసిస్, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్ వంటి ఉగ్రముఠాల ఉనికిపై న్యూదిల్లీ ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలోనే తాజాగా తాలిబన్ మంత్రితో జైశంకర్ చర్చలు జరపడం తాజా పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. పాక్ ఒంటరి అయ్యిందనడానికి ఇది కూడా కీలక పరిణామంగా చూడాలి.

# కుటుంబ బంధాలకు విలువేదీ?

- పండగల వేళ మాత్రమే ఇది సరికాదు



**విజయవాడ,మే16( వెలుతురు):**

ఏ వ్యక్తికైనా బలం... బలగం... తన కుటుంబం. కుటుంబం అంటే పెద్ద బలగం అని, స్నేహితులు, బంధువుల సమూహం అని అర్థం. ఇటీవల వచ్చిన బలగం సినిమా... కుటుంబ ప్రాధాన్యతని, కుటుంబంలోని వ్యక్తులంతా కలిసివుంటే...అదే బలగం అని చెప్పింది. మనం ఎంతగా కుటుంబానికి కట్టుబడి ఉంటున్నామో ఆలోచించాలి. ఒకరోజు గడిచిపోయింది. ఎక్కడా బంధాలపై పెద్దగా భావనకానరావడం లేదు. కేవలం పండగల సందర్భంలో హడావిడి చేస్తున్నాం. దీనిని అధిగించేందుకు గ్రామాల్లో పునాఇ ఉండాలి. అప్పుడే మన సంసారాలు బాగుడతాయి. నా ఇంటి పేరు ప్రపంచం/ ప్రజలే నా కుటుంబం/ వెదజల్లుతా దిగ్దిగంతం/ అభ్యుదయ సుగంధం అప్పుడు నా జీవితమే ఒక ప్రబంధం' అంటారు సినారె. సంతోషం, బాధ, దుఃఖం, ప్రేమ, అనుబంధాలు, కలహాలు, ఆత్మీయతలు ఇవన్నీ ఒకేచోట కలిసుండేదే కుటుంబం. భిన్న రకాల మనస్తత్వాలు, అభిప్రాయాలున్న వ్యక్తులను ఒకేచోట అనుబంధంగా మార్చేస్తుంది కుటుంబం. మన భారతీయ కుటుంబం.. అంతులేని శక్తికి, బలానికి సూచికగా నిలుస్తోంది. పిల్లల ఆనందాన్ని తమ సంతోషంగా భావించే తల్లిదండ్రులు, కన్నవారి కలలను సైతం నెరవేర్చాలనే తపన పిల్లలది. ఇలా ఎల్లప్పుడూ ప్రేమ ఆత్మీయతలతో కలిసుండేది ఫ్యామిలీ. ఇక మన భారతీయ సంప్రదాయంలో ఉమ్మడి కుటుంబాలు ప్రత్యేకం. మే 15అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం. మరి ఈరోజును ఎందుకు జరుపుకుంటారు.. 1983లో ఐక్యరాజ్య సమితి చూపు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కుటుంబాల వైపు మళ్లింది. ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్, సోషల్ డెవలప్ మెంట్ కమిషన్ అప్పటి సెక్యూరిటీ జనరల్ కుటుంబాల సమస్యలు, వారి అవసరాల గురించి మరింత అవగాహన పెంచుకోవాలను కుంది. మే 29, 1985న ఆమోదించిన తీర్మానంలో కౌన్సిల్ సిఫారసు పై జనరల్ అసెంబ్లీ అభివృద్ధి పక్రియలో కుటుంబాలు అనే అంశాన్ని కూడా చేర్చారు. డిసెంబర్ 1989లో ప్రతి సంవత్సరం మే 15న జరుపుకునే అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రకటించింది. ఉమ్మడి కుటుంబాల్లో వలె కలిసి మెలిసి ఉండే మనసు కానీ, మనుషులు కానీ లేకుండా పోయారు. పెండ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకొని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫోన్ పట్టుకొని ఒంటరైపోతున్నారు. సలహాలిచ్చే పెద్దవారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, బాధలను పంచుకునే బంధువులు లేక ఒంటరిగా మారుతున్నారు. చిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇక్కడే ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యం తెలిసి వస్తున్నది. కుటుంబ వ్యవస్థతో మన సంస్కృతిని పిల్లలకు అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం చేయాలి. ఇదే మానవీయ సమాజ ఉన్నతికి మూలం...అందుకు ప్రతి ఒక్కరూప్రతిన పూనాలి.

# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదుల హతం

- ప్రకటించిన భారత బలగాలు

**శ్రీనగర్,మే16( వెలుతురు):**

జమ్మూ కశ్మీర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులను ఇండియన్ ఆర్మీ మట్టుబెట్టింది. నిఘా వర్గాల సమాచారంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టామని, 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదుల్ని మట్టుబెట్టినట్లు-ఫోర్స్ మేజర్ జనరల్ ధనంజయ్ జోషి తెలిపారు. గత మార్చిలో జరిగిన ఓ హత్యలో ఈ ఆరుగురు ఉగ్రవాదుల్లో ఒకరి ప్రమేయం ఉందని తెలిపారు. పుల్వామా పరిధి కేలార్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు-మే 12న ఇండియన్ ఆర్మీకి సమచారం అందింది. దీంతో వారిని మట్టుబెట్టేందుకు రంగంలోకి దిగింది. ఈ క్రమంలో మొదటగా అనుమానిత ప్రాంతంలోని ప్రజలందరినీ ఖాళీ చేయించారు. మరుసటి రోజు ఉదయం ఉగ్రవాదుల కదలికలను గమనించిన సైనికులు కాల్పులు జరిపారు. అయితే ఇందుకు ప్రతిగా ఉగ్రవాదులు (÷ుసుసుష) కూడా ఎదురు కాల్పులు చేశారు. అయినా ఇండియన్ ఆర్మీ మరింత దీటు-గా కాల్పులు చేసి, ముగ్గురు ఉగ్రవాదులనూ గుర్తించి మట్టుబెట్టారు. ఏప్రిల్ 22న జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంకు దగ్గర్లో ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతం బైసరన్ లోయలో ఉగ్రవాదులు మారణహోమానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను అతి సమీపం నుంచి కాల్చి చంపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దానికి ప్రతిగా పీఓకే, పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఆపరేషన్ సిందూర్ పేరిట భారత్ ధ్వంసం చేసింది. అది జీర్ణించుకోలేని పాక్ తర్వాత రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటంతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. అయితే భారత్ ధాటిని తట్టు-కోలేని పాక్ వెనక్కి తగ్గటంతో కాల్పులు విరమణ ఒప్పందం కుదిరింది.



# బిజెపి అన్ని విధాలుగా బలంగా ఉంది

- ఇండియా బ్లాక్ బలపడితేనే ఎదుర్కో గలం
- మాజీ మంత్రి చిదంబరం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,మే16( వెలుతురు):**

భారతీయ జనతాపార్టీ అన్ని విధాలుగా బలంగా ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కొనియాడారు. అదే సమయంలో విపక్ష ఇండియా బ్లాక్ భవిష్యత్తుపై అనుమానం వ్యక్తంచేశారు. కూటమిలో అనిశ్చితి నెలకొన్న విషయం వాస్తవమేనని అంగీకరించారు. అయితే ఇండియా బ్లాక్ బలంగా ఉంటనే బిజెపికి చెక్ పెట్టడం సాధ్యమని అన్నారు. ఓ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో చిదంబరం మాట్లాడుతూ.. ఇండియా బ్లాక్ చెక్కుచెదరకుండా ఉంటే చాలా సంతోషం. కానీ అది బలహీనంగా కనిపిస్తోంది. కానీ అది పుంజుకోవడానికి సమయం ఉంది. అదే భాజపా విషయానికొస్తే.. వ్యవస్థీకృతంగా బలంగా ఉందన్నారు. కాంగ్రెస్ కూటమి బలంగా ఉండాల్సిందేనంటూ..అందులోని పార్టీలో మరింత పారదర్శకంగా నిలబడాల్సి ఉందన్నారు. నా అనుభవం, చరిత్ర చూస్తే.. ప్రతి విభాగంలోనూ పటిష్టంగా ఉన్న భాజపా లాంటి పార్టీ మరొకటి లేదు. ప్రతి వ్యవస్థను నియంత్రించగల, స్వాధీనం చేసుకోగల శక్తి కలిగిఉంది. అలాగే దానిని సవాలు చేయాలంటే.. విపక్ష కూటమి అన్ని విభాగాలను మెరుగుపరచుకోవాలి. ఈ పరిస్థితుల్లో 2029 ఎన్నికలు అత్యంత కీలకమని చిదంబరం అభిప్రాయపడ్డారు. దీనిపై భాజపా స్పందించింది. వరుస ఓటములు కాంగ్రెస్‌ను బాధించాయని ఆ పార్టీ నేత అమిత్ మాలవీయ ఎద్దేవా చేశారు. చిదంబరం అంచనా ప్రకారం.. విపక్ష కూటమిలో అనిశ్చితి ఉంది. భాజపా బలమైన పార్టీ. కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదని రాహుల్ గాంధీ అత్యంత సన్నిహితులకు కూడా తెలుసని మరో నేత ప్రదీప్ బండారీ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కాంగ్రెస్ ఎప్పటికీ ఇక కోలుకోలేదన్నారు. అది నిఅబడడం అన్నది కల్ల అన్నారు.

# అవినీతి నేతలకు చిప్పకూడు తప్పదు

- జగన్ సహా పెద్దిరెడ్డి, రోజాలు జైలు కెళ్లాల్సిందే
- మంత్రి రాంప్రసాద్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



**చిత్తూరు,మే16( వెలుతురు):**

ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన వారంతా జైలుకు పోతారని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో ఉండే భూములు మొత్తం దోచుకున్నారని అన్నారు. త్వరలోనే వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా సహా అంతా జైలుకు వెళ్లవలసిన వారునని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తప్పులు చేసిన పంది కొక్కులన్నీ ఇప్పుడు బయటకు వస్తున్నాయని విమర్శించారు. పెద్దిరెడ్డి అడవిని ఆక్రమించుకొని గెస్ట్ హౌస్‌లు కట్టుకున్నారు, రోడ్లు వేసుకున్నారని మండిపడ్డారు. రోజా డైలాగులు సినిమాలో పనికి వస్తాయని, రాజకీయాల్లో కాదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. చిత్తూరులో మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... 'త్వరలోనే వైఎస్ జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా సహా అవినీతి చేసిన అందరూ జైలుకు పోతారని అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో ఉండే భూములు మొత్తం దోచుకున్నారని, గత ప్రభుత్వ హయాంలో తప్పులు చేసిన పంది కొక్కులన్నీ ఇప్పుడు బయటకు వస్తున్నాయి. పెద్దిరెడ్డి అడవిని ఆక్రమించుకొని గెస్ట్ హౌస్‌లు కట్టు-కున్నారు, రోడ్లు వేసుకున్నారు అటవీ భూఅక్రమ జరిగింది కాబట్టి అందరి మీద కేసులు నమోదు చేశాం. తప్పు చేసిన వారికి వయసుతో సంబంధం ఏం ఉంది?. 60 ఏళ్లు దాటాయి కాబట్టి.. తప్పు చేసినా, అవినీతి చేసినా వదిలేయాలా?. తప్పులు చేశారు కాబట్టే 10 గంటలు, 15 గంటలు కాదు.. ఎన్ని గంటలైనా విచారిస్తారు' అని అన్నారు. 75 ఏళ్ల చంద్రబాబు నాయుడుపై ఒక దొంగ కేసు పెట్టి 50 రోజులు జైల్లో పెట్టింది వైసీపీనే కదా?. మేము ఏమీ రోడ్డు మీద పోయో వారిని ఎవరినీ విచారించలేదు. ఆర్కే రోజా డైలాగులు సినిమాలో పనికి వస్తాయి, రాజకీయాల్లో అస్సలు పనికిరావు. సినిమా డైలాగులు చెప్పి చెప్పి రోజా నలబై వేల ఓట్లతో ఓడిపోయింది. మీరు చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సిందే' అని మంత్రి రాంప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వైసీపీ నేతలపై వరుస కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే.

# పంట మార్పిడి అవసరం

## తంగడపల్లి వార్డ్ ఆఫీసులో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు



**వెలుతురు న్యూస్, చౌటుప్పల్ మే 16 :**
పట్టణ పరిధి తంగడపల్లి గ్రామంలోని వార్డ్ ఆఫీస్ వద్ద మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు అధ్యక్షతన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమనికి ప్రొఫెసర్. జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం డైరెక్టరేట్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ బలరాం హాజరై మాట్లాడుతూ వరిలో పత్తి పంటలలో తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, రసాయన ఎరువులను కొనుగోలు చేసిన తర్వాత రసీదులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించడం జరిగింది. అలాగే రైతులకి మండల వ్యవసాయ అధికారుల యొక్క సలహాలను సూచనలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు Dr. కృష్ణ మాట్లాడుతూ వరిలో నూతన వంగడాలను వాడాలని అందులో KNM1638, RNR-15048, నాలుగు నెలల వంటకాలం కలిగిన రకాలను వాడాలని, వరికి యూరియాను మూడు దఫాలుగా వేయాలని, పత్తిలో నాలుగు దఫాలుగా వేయాలని సూచించారు. శాస్త్రవేత్త dr.స్పందన మాట్లాడుతూ వరిలో సాగునీటిని అవసరం మేరకే వాడాలని, పిలక దశ వరకు ఆరుతడిగా నీటిని ఇవ్వడం వల్ల ఎక్కువ పిలకలు వచ్చి దుబ్బు ఎక్కువగా వచ్చి దిగుబడి కూడా అధికంగా వస్తుందని, వీలైనంతగా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్తలు వ్యవసాయం0లో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జించే పద్ధతుల మరియు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుట అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం ఎరువులు పురుగు మందులు కొన్నపుడు వాటి రసీదులను పంట కాలం పూర్తి అయ్యేవరకు భద్రపరిచుకోవటం సాగునీటిని ఆదా చేసే మార్గాలను మరియు పంట మార్పిడి చెట్లను పెంచుట వరి పత్తి మరియు కంది పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ గురించి, మేలైన విత్తన వంగడాల గురించి పూర్తి సమాచారం వివరించడం జరిగింది సీజనకు ముందే మహోత్తరమైన మంచి కార్యక్రమాన్ని చేపట్టడం చాలా మంచి పరిణామం, శాస్త్రవేత్తలే రైతుల దగ్గరికి వచ్చి చేసే ఇటువంటి ప్రోగ్రాం రైతులకు బాగా ఉపయోగపడుతుంది. గతంలో తంగేడు, జిల్లేడు ఆకులను వేసి కలియదున్ని భూసారాన్ని కాపాడుకునేవారు. ఇప్పటి పరిస్థితులుకు అనుగుణంగా జీలుగా జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులని ముందే కలియదున్ని భూసారాన్ని కాపాడాలి అని సూచించారు, కలుపు మందులకు బదులుగా కలుపుతీస్తేనే రైతులకు బాగా ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, నాయకులు బాలగోని వెంకటేశం గౌడ్, కేతరాజు అచ్చయ్య, మాజీ కౌన్సిలర్ ఆలే నాగరాజు, అరిగే రమేష్, చీకూరి ప్రభాకర్ గౌడ్, గట్టు మొగలయ్య, సిలివేరు వెంకటేష్, జాల వెంకటేష్, అరిగే బీరయ్య, అంతటి యాదయ్య, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు .

## భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన వీర జవానులకు వందనాలు...

- 19న జరిగే తిరంగా యాత్రను విజయవంతం చేయండి...
- బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...




**కరీంనగర్ వెలుతురు మే 16:**
ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించిందని, ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ సోమవారం రోజున కరీంనగర్ లోని తెలంగాణచౌక్ చౌరస్తా నుండి టవర్ సర్కిల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొంటారని , ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.మే 19 సాయంత్రం 5 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి తిరంగా యాత్ర ప్రారంభమవుతుందనీ, బిజెపి శ్రేణులు అందరూ ఈ ప్రోగ్రాం లో పాల్గొని కార్యక్రమాన్ని సక్సెస్ చేయడానికి తగిన కృషి చేయాలన్నారు.మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతదేశం విశ్వగురు స్థాయికి ఎదిగిందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ధైర్యం భారతదేశానికి ఉందనే విషయం ప్రపంచానికి మొత్తం అర్థమైందన్నారు.ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం చేపట్టిన చర్యలకు దేశ ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలిపారని, . 26 నిమిషాల్లో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన ఘనత భారత సైన్యానికి దక్కుతుందన్నారు.పాకిస్థాన్ తుప్పు పట్టిన చైనా ఆయుధాలు, పనికిరాని టర్కీ డ్రోన్లతోఅల్లకల్లోలం సృష్టించాలనుకుందనీ, అయితే భారత సైన్యం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలతో అద్భుతమైన విజయం సాధించిందని తెలిపారు.చివరికి పాకిస్థాన్ అమెరికా ద్వారా శరణు వేడేలా భారత ప్రధానమంత్రి తో బ్రతిమిలాడుకునే స్థాయికి దిగజారిందన్నారు.భారత సైనికులు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్న క్షిపణి వ్యవస్థ, ఆయుధాలతో పాకిస్థాన్ కు నిద్రలేని కాలరాత్రులుగడిపేలాచేశారని,రానున్న కాలంలో పాకిస్థాన్ ఎటువంటి కవ్వింపు చర్యలకు, దురాగతాలకు పాల్పడినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత ప్రధాని ధీటుగా బదులిచ్చారన్నారు.ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పోరాడి అమరులైన వీర జవాన్లకు, వీరోచిత పోరాటం చేస్తున్న భారత సైనికులకు వందనాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా , మండల, అసెంబ్లీ కేంద్రాల్లో తిరంగా యాత్ర కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. ప్రజలందరూ తిరంగా యాత్రలో పాల్గొని, భారత సైనికులకు వందనాలు తెలియజేయాలని, మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, ఉగ్రవాద నిర్మూలనకు సంకల్పబద్ధంగా శపథం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## దోమలను నిర్మూలిద్దాం డెంగ్యూ ను అరికడుదాం!

### హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె వెంకట్



**హైదరాబాద్ వెలుతురు మే 16:**
దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన ప్రతి బంధకాలని, ఏడిష్ దోమ కుట్టడం వల్ల భయంకరమైన డెంగ్యూ వ్యాధి వ్యాపిస్తుందని, వ్యాధి బారిన పడిన రోగులు అనారోగ్యానికి గురై, మానసికంగా ,ఆర్థికంగా కృంగి నష్టపోతారని, ఈ వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యంతో నిర్మూలించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జె వెంకట్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై, వాటి నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలు వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురికి కాలువల లో చెత్తాచెదారం తొలగించి మురుగునీరు పారే విధంగా చూడాలని, పనికిరాని సీసాలు డబ్బాలు రబ్బరు టైర్లు వాటర్ కూలర్స్ మరే ఇతర పాత్రలైనా సరే మీరు నిలువ లేకుండా చూడాలని వాటిలో నీరు నిలిచిన వారం రోజులలో దోమలు గుడ్లు పెట్టి పెరిగే అవకాశం ఉందని, ఈ దోమ మంచినీటి వనరులలో అభివృద్ధి చెందుతుంది. కనీసం వారానికి ఒకసారి నీరు నిలువ ఉన్న పాత్రలను ఖాళీ చేసి ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పాల్గొనిన సిబ్బందికి విద్యార్థులకు అవగాహన కల్పించినారు. ప్రతి సంవత్సరం మే 16 రోజున జాతీయ డెంగ్యూ దినంగా పాటిస్తూ, దోమల ద్వారా వచ్చే డెంగ్యూ పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హైదరాబాద్ జిల్లాలోని మురికివాడలో ప్రత్యేక శ్రద్ధ వహించి ముందస్తు ప్రణాళిక తయారుచేసి దోమల ద్వారా వచ్చే వ్యాధులను నిర్మూలించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే వర్షాకాలాంలో దోమలు వ్యాపించకుండా, వ్యాధులు రాకుండా సిబ్బందిని ఇప్పటినుండే అప్రమత్తం చేసినట్లు తెలిపినారు. ఇప్పటికే డెంగ్యూ వ్యాధిని తగ్గించుటలో గణనీయమైన ఫలితాలు సాధించినట్లు, దోమల ద్వారా వచ్చే వ్యాధుల నిర్మూలనకు నిరంతర కృషి జరుపుతున్నట్లు తెలిపినారు. ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు సూచించారు. గత సంవత్సరం నుంచి హైదరాబాద్ జిల్లాలో డెంగ్యూ వ్యాధి గ్రస్తుల బాధితుల సంఖ్య గన నీయంగా తగ్గిందని, దీనికి కారణం మే నెల నుండి ప్రత్యేక ప్రణాళికతో ముందు జాగ్రత్త చర్యలు , ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వల్ల జరిగిందని తెలియజేశారు. తదుపరీ ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, విద్యార్థులచే నిర్వహించిన ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా అధికారి డా : లక్ష్మణ్ సింగ్ , మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఒక్కరు ఇప్పటినుండే డెంగ్యూ వ్యాధి రాకుండా నివారణ చర్యల పై అవగాహన కార్యక్రమాలు ప్రత్యేకంగా చేపట్టాలని ఈ ర్యాలీని ఉద్దేశించి చెప్పారు.జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, ఇంచార్జ్ మలేరియా అధికారి డాక్టర్ శ్రీకల , అసిస్టెంట్ డైరెక్టర్ మలేరియా శ్రీ విజయ్ కుమార్ ,జిల్లా మీడియా అధికారి శ్రీ జక్కుల రాములు, డిప్యూటీ మీడియా అధికారి శ్రీ ఏ అంజయ్య గౌడ్ ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీ ఆంజనేయులు,మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్స్ , సిబ్బంది,కార్యాలయ సిబ్బంది విద్యార్థులు పాల్గొనినారు.








---

## నేడు, రేపు గునుకుల కొండాపూర్ లో నల్ల పోచమ్మ తల్లి నాటక ప్రదర్శన



**గన్నేరువరం వెలుతురు మే 16:**
గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ లో నేడు17 న శనివారం రేపు 18న ఆదివారం రోజున నల్ల పోచమ్మ తల్లి నాటక ప్రదర్శన కార్యక్రమం ఉందని నల్ల పోచమ్మ కమిటీ అధ్యక్షులు జాగిరి శ్రీనివాస్ గౌడ్ ఆహ్వాన కమిటీ చైర్మన్ లింగంపల్లి తిరుపతి ప్రధాన కార్యదర్శి న్యాలపట్ల శంకర్ గౌడ్ లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 41 రోజు దీక్షతో నాటక ప్రదర్శన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. నల్ల పోచమ్మ తల్లి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నల్ల పోచమ్మ నాటక ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని అన్నారు. సోమవారం 19 న రోజున నల్ల పోచమ్మ తల్లికి ఒడి బియ్యం కార్యక్రమం ఉంటుందని అన్నారు. కనుమరుగవుతున్న కలలను తిరిగి పునరుద్ధరించడం కోసం ఇలాంటి దైనందిన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య సలహాదారులు కొరివి కొమురయ్య లింగంపల్లి అనిల్ నల్లపోచమ్మ భక్తులు గొల్లపల్లి బాలయ్యతాళ్లపల్లి రమేష్ వీరేశం సృజన్ తదితరులు పాల్గొన్నారు.

## గుణగంటి బుచ్చయ్య గౌడ్ కుటుంబానికి నాయకుల పరామర్శ



**నరసింహుల పేట వెలుతురు మే 16:**
నరసింహుల పేట మండలం గుండంరాజు పల్లి గ్రామానికి చెందినదగుణగంటి రాజన్న గౌడ్, మోహన్ గౌడ్,జగన్ గౌడ్,కమలాకర్ గౌడ్ ల తండ్రి గుణగంటి బుచ్చయ్య గౌడ్ మరణించగా వారి ఇంటికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలవేసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ శ్రద్ధాంజలి ఘటించి నివాళు లర్పించారు కేసముద్రం మండల, జిల్లా నాయకులయిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు,చాగంటి కిషన్ సిపిఎం మండల కమిటీ సభ్యులు,మోడం వెంకటేశ్వర్లు మండల కమిటీ సభ్యులు అదేవిధంగా మహబూబాబాద్ గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్.అనంతరం వారి కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలిపి వారికి మనో ధైర్యాన్ని కల్పించారు.ఈ కార్యక్రమంలో వీరి వెంట కొండేటి కళాధర్ తదితరులు ఉన్నారు.

## గజ్వేల్ లో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీలు రోహింగ్యలను గుర్తించి చర్యలు తీసుకోగలరు

- డిప్యూటీ తహసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చిన బిజెపి గజ్వేల్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్



**గజ్వేల్ వెలుతురు మే 16:**
ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జమ్మూ కాశ్మీర్ పర్యాటక కేంద్రమైన పహల్గన్ లో ఉగ్రవాదుల దాడి లో 26మంది భారతీయులు మరణించిన అనంతరం భారత కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లో భాగంగా భారతదేశంలో ఉన్న పాకిస్తాన్ రోహింగ్యలు మన దేశం నుండి వెళ్లిపోవాలని కేంద్రం ఆదేశించడం జరిగింది ఆ యొక్క ఉత్తర్వులను ఖచ్చితంగా పాటించాలని అదేవిధంగా గజ్వేల్ మండలం పరిధిలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీలు రోహింగ్యలను గుర్తించి చర్యలు తీసుకోగలరని మండల డిప్యూటీ తహసిల్దార్ భార్గవ్ గారికీ రెఫరెండం అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు ఇప్ప స్వామి,రామకంత్, ప్రభాకర్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్, అరవింద్,రాజు, స్వామి, గణేష్, శ్రావణ్,రాజు, రామస్వామి, గణేష్, నర్సింలు, మదుసుధన్,తదితరులు పాల్గొన్నారు.

## ముధోల్ లో బుద్ధుని విగ్రహాన్ని కూల్చడమంటే తన మీద తాను ఉమ్ము వేసుకున్నట్టే

### - జాజుల లింగంగౌడ్


**హైదరాబాద్ వెలుతురు మే 16:**



ప్రపంచానికి జ్ఞానం నేర్పిన బుద్ధుని విగ్రహాన్ని కూల్చడం అంటే తన మీద తాను ఉమ్ము వేసుకున్నట్టేనని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 45 ఏళ్ల పాటు అనేక ప్రాంతాల్లో తన సత్యమార్గాన్ని, సిద్ధాంతాలను బోధించాడని. సామాన్యులకు సులువుగా అర్థమయ్యేలా పాళీ భాషలో ఆయన బోధనలు చేశారని ఆయన విగ్రహాన్ని కూల్చడం మూరు?ల పనేనని అన్నారు.విగ్రహాన్ని కూల్చిన వారిని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు

# ఉగ్రదాడి పై కవుల గళం

**హైదరాబాద్ వెలుతురు మే 16:**
ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని వినిపించిన సామూహిక స్వరమే పహల్గాం సంకలనమని, శాంతి కోసం ఆకాంక్షించే హృదయ స్పందనల ప్రతిరూపమే ఈ సంకలనమని హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు అన్నారు.వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన పహల్గాం ఉగ్రదాడి పై శతాధిక కవుల గళం మరియు హాస్య వల్లరి తో పాటు బాల సాహితీవేత్త గద్వాల సోమన్న రచించిన సప్తతి పుస్తకాలను హైదరాబాద్ లోని రవీంద్రభారతి మొదటి అంతస్థులోని సమావేశ మందిరంలో మే 16, శుక్రవారం రోజున తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ,భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ సంయుక్త





ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తిని ప్రతిధ్వనించే భారతీయుల ఆకాంక్షల ప్రతిఫలనంగా పహల్గాం కవితా సంకలనం రూపొందినదని, భారతీయులందరూ ఉగ్రవాదాన్ని ఖండించాలని అన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన చౌదూరి నరసింహారావు హాస్యవల్లరిని సమీక్షించగా తెలుగు విశ్వవిద్యాలయం విజిటింగ్ ప్రొఫెసర్ ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు పహల్గాం పుస్తకాన్ని పరిచయం చేస్తూ ఉగ్రదాడి పై శతాధిక కవుల గళాన్ని గ్రంథస్తం చేసిన ప్రభాకర్ ని అభినందించారు.కవుల ప్రతిస్పందనలను ప్రశంసించారు. కార్యక్రమంలో చిరంజీవి పొర్ల అవంతిక,వంగరి అపూర్వలు చక్కని నృత్యాన్ని ప్రదర్శించారు. గంప ఉమాపతి ఆహ్వానించిన కార్యక్రమంలో విశ్వంభర పత్రికా సంపాదకులు మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని అన్నారు.కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రధాన కార్యదర్శి డా.నామోజు బాలాచారి,గద్వాల సోమన్న, రామకృష్ణ చంద్రమౌళి,గజవెల్లి సత్యనారాయణ స్వామి, వెల్మల జయపాల్ రెడ్డి, ఇరు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎనభైమంది కవులు పాల్గొన్నారు.

# మే 20న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొని రాజ్యాంగ హక్కులను రక్షించుకుందాం

- **డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్.**

**హైదరాబాద్ వెలుతురు మే 16:**
మే 20 నాడు జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో దళిత, సామాజిక వర్గలు పాల్గొనాలని, మనువాద కార్పొరేట్ విధానాలను అమలు చేస్తున్న ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బిజెపి విధానాలపై ఐక్యంగా ఉద్యమించి భారత రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకుందామని దళిత హక్కుల పోరాట సమితి ( డి హెచ్ పి ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున రాజ్ బహదూర్ గౌర్, హిమత్ నగర్ లో డి హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, రాష్ట్ర కోశాధికారి ఆరుట్ల రాజ్ కుమార్, రాష్ట్ర సమితి సభ్యులు చెట్టుకింద శ్రీనివాస్ తో కలిసి విలేకర్ల సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులను కూడా రక్షణ కరువైందన్నారు.11 ఏళ్ల మనువాద బిజెపి విధానాలు అట్టడుగు పేదల జీవితాలను మరింతగా దుర్భరం చేశాయన్నారు .దేశంలో 200 మంది కోటీశ్వరులు ఆస్తులు దేశంలో 40 శాతం మంది ప్రజల ఆస్థితో సమానమైందన్నారు మరో వైపున 40కోట్ల మంది మన భారతీయులు దారిద్ర్యరేఖకు దిగువన వున్నారని చెప్పారు. బిజెపి విధానాలు కార్పొరేట్ దిగ్గజాలకు వరాలు కురిపిస్తూ కష్టజీవులపై భారాలు వేస్తుందన్నారు స్వాతంత్రం కంటే ముందు నుండి కార్మిక



వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను బీజేపీ సర్కార్ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చిందన్నారు. రాజ్యాంగబద్ధంగా ఆర్టికల్19 ప్రకారం సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె చేసే హక్కు ,కనీస వేతనం పొందే హక్కులనుండి కార్మికులను దూరం చేస్తుందన్నారు తన మతోన్మాద కార్పొరేట్ విధానాలతో రాజ్యాంగ విరుద్ధంగా కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికుల శ్రమను దోచి కార్పొరేట్ దిగ్గజాలకు దాచిపెడుతుందన్నారు అంబానీ ఆదాని లాంటి అపర కుబేరుల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలుగా చూస్తుందన్నారు నూటికి 80శాతం మంది దళితులు గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో జాబు కార్డులు కలిగి ఉండి ఉపాధి కోసం రోజువారి పనికి వెళ్తున్నారని,దళితులకు ఆ ఉపాధికూడా లేకుండా చేయటానికి కేంద్ర బిజెపి సర్కార్ చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు 80 కోట్ల మంది ప్రజలకు ఉపాధి నిచ్చే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ లో కేవలం 86వేలకోట్ల రూపాయలు మాత్రమే కేటాయించిందన్నారు.పని దినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బిజెపి సర్కార్ 11 ఏళ్ల కాలంలో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా, ఉన్న ఉద్యోగాలను తొలగించిందన్నారు. మే20 న జరిగే సార్వత్రిక సమ్మెలో అశేష శ్రామిక ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## అరిస్టాటిల్ పీజీ కళాశాల నిర్వహణలో సుస్థిర ప్రపంచం కోసం

# ఔత్సాహికత మరియు ఆవిష్కరణ అంతర్జాతీయ సదస్సు



**హైదరాబాద్ వెలుతురు మే 16:**
అరిస్టాటిల్ పీజీ కళాశాల విజయవంతంగా సుస్థిర ప్రపంచం కోసం ఔత్సాహికత మరియు ఆవిష్కరణ అంతర్జాతీయ సదస్సు ను నిర్వహించింది. ఈ సదస్సులో ప్రపంచం నలుమూలల నుండి అకాడెమీయన్లు, పరిశోధకులు, పరిశ్రమ నేతలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఔత్సాహికత, ఆవిష్కరణ మరియు సుస్థిర అభివృద్ధి కలయికపై దృష్టి పెట్టిన ఈ సమావేశం, ఆలోచన నాయకుల మధ్య సంభాషణలకు, సహకారానికి వేదికగా నిలిచింది. మే 16వ తేదీ ఉదయం నిర్వహించిన ఆరంభ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎల్. శ్రీనివాస్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. తన ప్రసంగంలో, ఈ సదస్సుకు వచ్చిన 296 పూర్తి పేపర్ సమర్పణలు గల విశ్వవ్యాప్తిని ప్రస్తావించారు. కళాశాలలో చేపట్టిన సుస్థిరత మరియు ఆవిష్కరణ కార్యక్రమాల వివరాలను అందజేశారు. భవిష్యత్‌కి సిద్ధంగా ఉండే విద్యా వాతావరణాన్ని నిర్మించడంలో కళాశాల కట్టుబాటును ఆయన హైలైట్ చేశారు. ఒస్మానియా విశ్వవిద్యాలయం డీన్ సీనియర్ ప్రొఫెసర్ రాములు, గెస్ట్ ఆఫ్ హానర్ హాజరయ్యారు. అంతర్జాతీయ స్థాయిలో సుస్థిర ఆవిష్కరణపై సదస్సును నిర్వహించిన కళాశాల ప్రయత్నాలను ప్రశంసించారు. ఒస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలల్లో ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన సదస్సును నిర్వహించిన అరుదైన సంస్థగా అరిస్టాటిల్ పీజీ కళాశాల నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ బాలకిష్ట రెడ్డి, చీఫ్ గెస్ట్ గా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఉన్నత విద్యా సంస్కరణల గురించి ఆయన వివరంగా తెలియజేశారు. భారత యువతలో ఔత్సాహిక ఆలోచనా ధోరణిని పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. Applied Social Responsibility (ASR) ను మేనేజ్‌మెంట్ విద్యలో భాగంగా చేర్చాలని సూచించారు, తద్వారా సమాజంపై సానుకూల ప్రభావాన్ని కలిగించవచ్చని అభిప్రాయపడ్డారు. స్కైలైన్ యూనివర్సిటీ, UAE నుండి మహేశ్ అగ్నిహోత్రి, కీ నోట్ స్పీచర్ గా కీలక ప్రసంగం అందించారు. పర్యావరణ సమస్యలు మరియు డికార్బనైజేషన్ అవసరాన్ని విశ్లేషిస్తూ, పర్యావరణ అనుకూల పరిశ్రమల వైపు యువత నాయకత్వాన్ని తీసుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సౌవెనీర్‌ను ముఖ్య అతిథి చేతుల మీదుగా ఆవిష్కరించారు, ఇది శాస్త్రీయ రచనలు, చర్చల సమాహారంగా నిలిచింది. అధికంగా నమోదైన అభ్యర్థుల సంఖ్య సుస్థిర ఔత్సాహికతపై పెరుగుతున్న ఆసక్తిని స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా, అరిస్టాటిల్ PG కళాశాలకి ఇది ఒక మైలురాయి. ఇది గ్లోబల్ అకాడెమిక్ సహకారం మరియు ఆవిష్కరణ ఆధారిత విద్యను ప్రోత్సహించే దిశగా కళాశాల నడుస్తున్న నాయకత్వాన్ని నిరూపిస్తుంది.



## జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ ర్యాలీ నిర్వహించిన కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్

**హైదరాబాద్ వెలుతురు మే 16:**
శుక్రవారం రోజున జాతీయ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా హిమాయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్




గౌడ్ డివిజన్ లోని నజీర్ బాగ్ శంషీర్బాగ్ మరియు రామారావు బస్తీలో ర్యాలీని నిర్వహించారు ఈ సందర్భంగా వారు అక్కడ ఉంటున్నవారు డెంగు తో ఎట్లా మనల్ని మనం కాపాడుకోవాలని విషయంపై అవగాహన చేశారు ఈ కార్యక్రమంలో పెంటమాలజీ డిపార్ట్మెంట్ నరేందర్ రెడ్డి మరియు వార సభ్యులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# బూట్లు కొనివ్వలేని పాకిస్తాన్ ఆర్మీ



**న్యూఢిల్లీ, మే 16, ( వెలుతురు)**
దుర్భేద్యమైన ఆయుధ సంపత్తి ఉన్న భారత్‌ను చూసి.. సైన్యానికి కనీసం బూట్లు కొనివ్వలేని పాక్ వాతలు పెట్టుకోవడం హాస్యాస్పదంగా మారింది. భారత్ ప్రధానిని.. పాక్ ప్రధాని కాపీ కొట్టిన విధానం కామెడీగా తాయారైంది. పాక్ పైరసీ వ్యవహారం మరోమారు ప్రపంచదేశాలకు తెలిసిపోయింది..!ప్రపంచదేశాలు సైతం భారత్‌ను టచ్ చేయాలంటే వణికిపోయేలా మోదీ చుట్టూ అలంకరణలా మిగ్-29 యుద్ధవిమానాలతో పాటు శత్రువుల మిసైళ్లను క్షణాల్లోనే గాల్లో ధ్వంసం చేసే S-400. ఇక మోదీ ఆరేంజ్ సీన్లు, స్పీచ్‌లు చూసి నిద్రపట్టని పాకిస్తాన్ ప్రధానమంత్రి.. పైరసీ కాపీలా మారిపోయారు. మోదీ సైనికులను కలిసి ఉత్సాహాన్ని నింపినట్లే.. ఈయన కూడా పాక్ సైన్యాన్ని కలిశారు. అదంపూర్‌లో మోదీ ఏం చేశారో.. షహబాజ్ షరీఫ్ అదే రిపీట్ చేయబోయి కాపీ మాస్టర్‌లా తయారయ్యారు.ఎయిర్‌బేస్‌లో మోదీ ల్యాండైతద.. షరీఫ్ మాత్రం చుట్టూ ఎడారిలా ఉన్న ప్రాంతంలో హడావుడి చేశారు. ఓవైపు మిగ్-29, మరోవైపు S-400తో మోదీ కనిపిస్తే.. పాక్ ప్రధాని మాత్రం కూలిపోయిన శకలాలు, పిల్లల ఎగ్జిబిషన్‌కి పెట్టిన డమ్మీ ఆయుధాల్లాంటి వాటితో ఓవరాక్షన్ చేశారు. మోదీ సైనికుల్లో ఒకడిలా కలిపోయిన షేక్ హ్యాండిస్తే, షరీఫ్ సైతం ఈ సీన్‌ని కూడా కాపీ కొట్టి కామెడీ పండించారు. సెల్యూట్ సైనికా.. మీ సేవలను దేశం ఎన్నటికీ మరవదికా.. అంటూ మోదీ అదిరిపోయే స్పీచ్ ఇచ్చారు. వందేమాతరం, వందేమాతరం అంటూ సైనికుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఇక్కడ షరీఫ్ సైతం ఏదో మాట్లాడుతూ.. పాక్ సైన్యంతో నినాదాలు చేయించడం హాస్యాస్పదంగా మారింది.మొత్తంగా.. పైన చెప్పుకున్నట్లు పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుగా తయారైంది పాక్ ప్రధాని పరిస్థితి. భారత్ జోలికొస్తే ఊచకోతే.. ఇక బోర్డర్‌లో ఉన్న సామాన్యుడిని సైతం టచ్ చేయలేరంటూ ప్రపంచదేశాలకు తెలిసేలా మోదీ వ్యహరిస్తే.. సిల్లీగా ఆయనను కాపీ కొట్టి అట్టర్ ఫ్లాఫ్ అయ్యారు పాక్ ప్రధాని. మోదీ టూర్‌లో దేశభక్తి ఉట్టిపడితే.. షరీఫ్ పర్యటనలో మాత్రం ఏం లేకపోయినా హడావుడి చేసినట్లుగా కనిపించింది. టచ్ చేసి చూడు అనేలా మోదీ బ్యాక్‌గ్రౌండ్‌లో మిస్సైల్స్ ఉంటే.. పాక్ ప్రధాని ఆకులు చుట్టిన ఫిరంగి ముందు హల్‌చల్ చేయడం కామెడీగా తయారైంది. ఓవరాల్‌గా ప్రపంచదేశాల ముందు పాక్ మరోసారి నవ్వులపాలైంది.

# మాటల్లో సరే... చేతలేవి...



**నెల్లూరు, మే 16, ( వెలుతురు)**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఈసారైనా నాయకులకు గుర్తింపు, గౌరవం ఇస్తారా? అదే ఇప్పుడు పార్టీలో చర్చ జరుగుతుంది. గత ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు జగన్ నాయకులకు ప్రజల్లో గౌరవం లేకుండా చేసిపారేశారు. వాలంటీర్లను తెచ్చి పెట్టి ఎమ్మెల్యేలను ఉత్సవ విగ్రహాలుగా నిలబెట్టారు. ఏ పని కావాలన్నా వాలంటీర్లే ఉండటంతో ఎమ్మెల్యేలతో పని లేకుండా పోయింది. తానే తాడేపల్లి ప్యాలెస్ నుంచి బటన్ నొక్కి లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తుండటంతో ప్రజలకు, నేతలకు మధ్య కనెక్షన్ కట్ అయింది. జగన్ తనను చూసి జనం ఓటేయాలన్న అత్యాశతో ఎమ్మెల్యేలను గత ఐదేళ్ల పాటు నొక్కి పెట్టారు. అదే ఆయన ఓటమికి కారణమయింది.మొన్నటి ఎన్నికల్లో జనం వద్దకు వెళ్లి తమకు ఓట్లు వేయాలని అడిగేందుకు కూడా ఎమ్మెల్యేలకు అవకాశం లేకుండా పోయింది. జగన్ ను చూసి ఓటేయాలని అనుకున్నప్పటికీ అంతకు మించి చంద్రబాబు ఎన్నికల హామీలు ఇవ్వడంతో జనం అటువైపు చూశారు. అయినా నలభై శాతం ఓటు బ్యాంకు వైసీపీకి వచ్చింది. ఇదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు తమ సొంత బలంతో ఒక్క చోట కూడా గెలవలేకపోయారు. ఎమ్మెల్యేల ప్రమేయం ఉండి ఉన్నా, కార్యకర్తలతో సంబంధాలు న్నా ఇంత పార్టీకి డ్యామేజీ జరిగి ఉండేది కాదన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. జగన్ ఓటమి పాలయిన తర్వాత కూడా తన పద్ధతిని మార్చుకోలేకపోతున్నారంటున్నారు.అధికారంలో లేకపోయినా వైసీపీ స్థానిక నాయకత్వానికి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడంతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థులను ముందుగానే ఎంపిక చేసి జనంలోకి పంపితే బాగుంటుందన్న సూచనలు వెలువడుతున్నాయి. అలా జరగకుండా తాను పాదయాత్రతో మళ్లీ వైసీపీని అధికారంలోకి తేవాలని భావిస్తే మాత్రం మరోసారి భంగపాటు తప్పదన్న కామెంట్స్ వినపడుతున్నాయి. నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జుల నియామకానికి కూడా జగన్ ఆసక్తి చూపడం లేదంటే ఆయన ఇంకా తన ఫొటోను నమ్ముకుని ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నట్లుంది. అదే జరిగితే ఈసారి ఎన్నికల్లోనూ అరకొర సీట్లు వస్తాయని చెబుతున్నారు. జగన్ తాను మారారని చెబుతున్నప్పటికీ చేతల్లో మాత్రం కనిపించడం లేదన్నది వైసీపీ నేతల నుంచి వినిపిస్తున్న టాక్. మరి జగన్ ఇకనైనా మారి నాయకులకు గౌరవం కల్పిస్తేనే అధికారం అందుకునే అవకాశాలుంటయంటున్నారు.

# నకిలీ సర్టిఫికెట్ల దందా

- ఆరుగురి ముఠా అరెస్ట్

**హైదరాబాద్,మే16( వెలుతురు):**
గత తొమ్మిదేళ్లుగా నకిలీ సర్టిఫికెట్ల దందాను కొనసాగిస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. కొంతకాలంగా ధనార్జనే ధ్యేయంగా దందా సాగుతున్నట్లు గుర్తించామన్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఒక్కో నకిలీ డాక్యుమెంట్‌ను రూ.5వేల నుంచి రూ.20వేల వరకు విక్రయిస్తున్నారని వివరించారు. నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ ఎల్బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురిని అరెస్టు చేయగా.. మరో ఏడుగురు పరారీలో ఉన్నారని తెలిపారు. భానుప్రకాశ్, సాగరిక దంపతులు సరూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సాత్విక్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో నోటరీ షాపు నిర్వహిస్తున్నారు. అధిక డబ్బుల కోసం ఆశపడి నకిలీ బర్త్, ఇన్‌కమ్, క్యాస్ట్ సహా భూమి క్రయవిక్రయాలకు సంబంధించిన ఫేక్ డాక్యుమెంట్లు-, ఫోర్జరీ పత్రాలు సృష్టించే వారని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. ఇందుకోసం నిందితులు కొందరు వ్యక్తులతో చేతులు కలిపి ఓ వ్యవస్థనే ఏర్పాటు చేశారని వెల్లడించారు.

# కల్వకుంట్ల కుటుంబలో విభేదాలు

- బిఆర్ఎస్‌లో ముసలం తప్పదన్న విప్

**హైదరాబాద్,మే16 ( వెలుతురు):**
కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయని, బిఆర్ఎస్‌లో ముసలం మొదలైందని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ ఆరోపించారు. శుక్రవారం సీఎల్పీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ప్లీనరీలో హరీష్‌రావుకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఎప్పుడూ లేని విధంగా హరీష్ రావు ఇంటికి కెటిఆర్ వెళ్లి రెండు గంటలు చర్చలు జరపడం పలు అనుమానాలకు తావు ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. హరీష్ రావు ఇంట్లో జరిగిన వేడుకలకు గతంలో కెటిఆర్ కుటుంబం దూరంగా ఉందన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా హరీష్ రావుపై కెటిఆర్‌కు ఎందుకు ప్రేమ వచ్చిందని ఆయన ప్రశ్నించారు. హరీష్ రావు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తొన్నట్లు విస్తృత ప్రచారం జరుగుతుందని ఆయన ఆరోపించారు. కల్వకుంట్ల కుటుంబసభ్యుల మధ్య ఆధిపత్యపోరు జరుగుతోందని, రాజకీయ ఆధిపత్యం కోసం కొట్లాడుకుంటు-న్నారని ఆయన వెల్లడించారు. హరీష్‌రావుతో చర్చల మతలబు ఏమిటో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# హరీష్ రావు నివాసానికి కెటిఆర్

- అమెరికాకు కవిత ప్రయాణం



**హైదరాబాద్,మే16( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా, మాజీ మంత్రి, సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు- హరీష్ రావుతో సమావేశం అయినట్లు తెలుస్తుంది. తాజా రాజకీయలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు హరీష్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని కూడా కేటీఆర్ అడిగి తెలుసుకున్నట్లు- తెలుస్తుంది. అయితే, మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు ప్రయాణమై వెళ్ళనున్నారు. తన కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమం కోసం ఆమె అమెరికాకు వెళ్తున్నారు. ఇప్పటికే యూఎస్ లో కవిత భర్త అనిల్ ఉన్నారు. ఈ నెల 23వ తేదీన తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఇటువంటి సమయంలో కేటీఆర్, హరీశ్ రావు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది. కాగా శుక్రవారం ఉదయం మాజీ మంత్రి హరీష్‌రావు నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు.

# అంతర్జాతీయ యోగా డే

- నెలరోజుల పాటు యోగా మంత్
- మే 21నుంచి జూన్ 21 వరకు కార్యక్రమాలు
- జూన్ 21న యోగడేకు ప్రధాని రాక
- అధికారులతో సమీక్షించిన సిఎం చంద్రబాబు



**అమరావతి,మే16( వెలుతురు):**
రికార్డు సృష్టించేలా విశాఖలో అంతర్జాతీయ యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశర చేశారు. మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలన్నారు. జూన్ 21న విశాఖలో ప్రధాని మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా డే కార్యక్రమం నిర్వహణపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నెల రోజుల పాటు- యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. విశాఖలో లక్షల మందితో కలిసి ప్రధాని మోదీ యోగాసనాలు వేస్తారని, ఆర్‌కే బీచ్ నుంచి సముద్రతీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహించనున్నట్టు- వెల్లడించారు. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలని సీఎం అన్నారు. ప్రతి గ్రామంలో యోగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జూన్ 21వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ యోగా డే చరిత్రలో నిలిచి పోవాలని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం పర్యటనను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రికార్డు సృష్టించేలా విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగాడేకు సిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ఏపీవ్యాప్తంగా ప్రతి గ్రామం, వార్డులో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నెలరోజుల పాటు- యోగా ప్రాక్టీస్ చేసిన వారికి సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. విశాఖపట్నంలో లక్షల మందితో ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగాసనాలు చేస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్కే బీచ్ నుంచి సముద్రతీరం పొడవునా లక్షల మందితో యోగా డే నిర్వహిస్తున్నట్లు- ప్రకటించారు. యోగా డే అనంతరం కూడా ఏపీలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలని సూచించారు. జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగాడే కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షించారు.

# గులాబీలతో ఆహ్వానిస్తున్న ఆర్టీసీ సిబ్బంది

**హైదరాబాద్, మే16( వెలుతురు):**
ప్రజారవాణాను ప్రోత్సహించేందుకు టీజీఎస్‌ఆర్టీసీ వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికులను ఆకట్టుకోవడంతో పాటు, వారిని మర్యాదగా పలకరిస్తూ...గులాబీ పూలు ఇస్తూ ఆహ్వానిస్తున్నారు. అంతేగాకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రైవేటు వాహనాల్లో వెళుతూ ప్రమాదాల బారిన పడొద్దన్న కండక్టర్లు.. సురక్షితమైన, సౌకర్యవంతమైన ఆర్టీసీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు హైదరాబాద్ వనస్థలిపురంలో బస్సెక్కిన ప్రయాణికులకు కండక్టర్లు గులాబీ పూలు అందించారు. కండక్టర్ల అభ్యర్థనపై కొంత మంది హర్షం, మరికొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు

# మద్యం కుంభకోణంలో కీలక పరిణామం

- లిక్కర్ స్కామ్‌లో ఇద్దరు పెద్దల అరెస్ట్

**విజయవాడ, మే16( వెలుతురు):**
రాష్ట్రంలో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్‌లు కొనసాగుతోన్నాయి. తాజాగా ఈ కేసులో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డితోపాటు- మాజీ సీఎం వైఎస్ జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డిని సిట్ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వీరిద్దరిని అరెస్ట్ చేసినట్లు సిట్ అధికారులు అధికారింగా ప్రకటించారు. వరుసగా మూడు రోజుల పాటు వీరిని సిట్ అధికారులు విచారించి... అనంతరం అరెస్ట్ చేశారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. వీరి పిటిషను సుప్రీంకోర్టు డిస్మిస్ చేయడంతో.. వీరి అరెస్ట్ అనివార్యమైంది. ఈ క్రమంలో వైకాపా హయాం నాటి మద్యం కుంభకోణం కేసులో ఒకేసారి రెండు పెద్ద వికెట్లు- పడ్డాయి. సుదీర్ఘ విచారణ తర్వాత నాటి సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. 3 రోజుల పాటు- ప్రశ్నించిన సిట్ బృందం మద్యం కేసులో వీరి పాత్రపై స్పష్టత తీసుకున్న తర్వాత ఇద్దరినీ అరెస్టు చేసినట్టు సాయంత్రం ప్రకటించింది. ఉదయం నుంచి 9గంటల పాటు- ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ విచారించింది. వీరిద్దరూ ఏ31, ఏ32 నిందితులుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని ఇటీవల సుప్రీంకోర్టు



ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణకు హాజరుకావాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని విజయవాడలోని సిట్ కార్యాలయంలో అధికారులు 3 రోజులుగా విచారించారు. వైకాపా హయాంలో జరిగిన వేల కోట్ల మద్యం కుంభకోణంలో.. నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఈ కేసులో ఏ 33 నిందితుడుగా ఉన్న గోవిందప్ప మంగళవారం అరెస్టయిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి సుప్రీం ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని పేర్కొంది. వీరికి గతంలో ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ తీర్పును ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. ముందస్తు బెయిల్ ఇస్తే విచారణాధికారి చేతులు కట్టేసినట్లు- అవుతుందని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. రెగ్యులర్ బెయిల్‌కు అ÷-లపై చేస్తే నిబంధనలు, మెరిట్స్ ప్రకారం హైకోర్టు, ట్రయల్ కోర్టులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

# కేంద్ర సంస్థల పనులు ఎప్పుడు...

### 41 సంస్థలు....300 ఎకరాలు

**గుంటూరు, మే16( వెలుతురు):**
రాజధాని అమరావతిలో కేంద్ర ప్రభుత్వ సంస్థల కార్యాలయాల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అమరావతి రాజధాని ప్రాంతంలో నలభై ఒక్క సంస్థలకు 300 ఎకరాలు పైగా కేటాయించినా పనులు ముందుకు సాగలేదు. గత ప్రభుత్వం అమరావతి రాజధాని పనులను పక్కన పెట్టడంతో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఏర్పాటుకు ముందుకు రాలేదు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది గడుస్తున్నా, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి రాజధాని పనులకు శంకుస్థాపనచేసినప్పటికీ ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు వాటి నిర్మాణ పనులు చేపట్టకపోవడంపై మరోసారి లేఖ రాయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. నేరుగా ఆ యా సంస్థలకు లేఖ రాయాలని భావిస్తుంది.ప్రధాని నరేంద్ర మోదీకి కూడా ఈ విషయాన్ని తెలియజేయాలని భావిస్తుంది. సత్వరమే కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం పనులు ప్రారంభించకపోతే తప్పుడు సంకేతాలు ప్రజల్లోకి వెళ్లే అవకాశముందని కూడా రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని నిర్ణయించినట్లు తెలిసింది. అయితే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇక్కడ నిర్మాణాలు ప్రారంభించాలంటే వాటికి పరిపాలన సంబంధమైన అనుమతులు ఇవ్వాలి. నిధులు కూడా కేటాయించాలి. అందుకే జాప్యం జరుగుతుందని కూడా కొందరు సమాచారం అందిస్తున్నారు. ఇప్పటికే ఢిల్లీలోని కూటమి పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులతో పాటు కేంద్ర మంత్రులు కూడా ఆయాకేంద్ర ప్రభుత్వ సంస్థలకు వెళ్లి పనుల పురోగతిని గురించి ప్రశ్నిస్తున్నారని తెలిసింది.రాజధాని అమరావతిలోని తుళ్లూరు, రాయపూడి తదితర ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కార్యాలయాలకు ప్రభుత్వం స్థలాలను



కేటాయించింది.కొన్ని స్థ నిర్మాణాలు నిలిచిపోయినవి కూడా ఉన్నాయి. రాయపూడి పరిధిలోని జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థకు కేటాయించిన రెండు ఎకరాలు స్థలం, ప్రహరీ గోడల వరకే పరిమితమైంది. ఇందిరా గాంధీ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ కార్యాలయం భవన నిర్మాణ పనులు కూడా అరకొరగా సాగుతున్నాయి. రాజధాని ప్రాంతంలో మొత్తం 114 ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలకు ప్రభుత్వం 1,277 ఎకరాలను కేటాయించింది. అందులో 41 కేంద్ర ప్రభుత్వ సంస్థలు, శాఖలు, కార్యాలయాలకు 300 ఎకరాలు కేటాయించింది. స్థలాలు కేటాయించి తొమ్మిదేళ్లు పైగానే అయినా ఇంత వరకూపనులు ప్రారంభించకపోవడంపై విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అమరావతి నిర్మాణాలతో పాటు వీటి పనులను కూడా వీలయినంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలుకోరుతున్నారు. రిజర్వ్ బ్యాంక్, సిఏజి, సిబిఐ, నేవీ, ఆర్మీ, పోస్టల్ , ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసి, ఆయిల్ సంస్థలు, హడ్కో, ఫ్యాషన్ టెక్నాలజీ, కేంద్రీయ విద్యాలయాలు, పలు సాంకేతిక సంస్థలకు స్థలాలు కేటాయించినా నిర్మాణాలు చేపట్టకపోవడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

# చరిత్ర సృష్టించే విధంగా తెలుగు పండుగ

**కడప, మే16( వెలుతురు):**
చరిత్రలో నిలిచిపోయేలా కడప మహానాడు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు. తొలిసారి కడపలో నిర్వహిస్తున్న మహానాడుతో రాయల సీమలో నూతన %×%త్సాహం వస్తుందన్నారు.

సీమకు సాగు నీళ్లిచ్చి, ఫ్యాక్షన్ ను అంతం చేశామని, పెట్టుబడులు, భారీ పరిశ్రమలు, హార్టికల్చర్ సాగుతో సీమ రూపు మారిందని వివరించారు.మే 27, 28, 29వ తేదీల్లో జరుగుతున్న మహానాడు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జరుగుతున్న తొలి మహానాడు అని చంద్రబాబు వివరించారు. గతంలో రాయలసీమలో తిరుపతి వంటి చోట్ల మహానాడు నిర్వహించినా....కడపలో తొలిసారి నిర్వహిస్తున్నామని చెప్పారు.అనేక సవాళ్లు, సంక్షోభాలను ఎదుర్కొని 2024లో అధికారంలోకి వచ్చామని, ఏడాది కాలంలో అనుకున్న దానికంటే మెరుగైన పాలన అందించామని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ సమయంలో జరుగుతున్న మహానాడు కార్యక్రమంలో పార్టీ వ్యవహారాలు, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలపై సమగ్ర చర్చ జరగాలన్నారు.రాయలసీమ ప్రజల గుండెల్లో పార్టీ బలంగా ఉందని...దీనికి కారణం తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఆ ప్రాంతంలో వచ్చిన మార్పులే అని అన్నారు. రాయలసీయను పీడిస్తున్న ఫ్యాక్షన్ భూతాన్ని సమూలంగా అంతం చేసిన చరిత్ర తెలుగుదేశం పార్టీదని...ఫ్యాక్ష న్ పై అత్యంత కఠినంగా వ్యవహరించాం కాబట్టే నేడు సీమ నుంచి ఫ్యాక్షన్ ను పూర్తిగా తరిమేశాం అని సిఎం అన్నారు.టీడీపీ చేపట్టిన చారిత్రాత్మక చర్యలు ప్రజల గుండెల్లో ఉన్నాయని గుర్తు చేశారు. సీమకు సాగునీరు ఇవ్వడం ద్వారా అక్కడి స్థితిగతులు మార్చాలని మొదట ఎన్టీఆర్ సంకల్పం చేశారన్నారు.

హంద్రీనీవా, గాలేరు – నగరి, తెలుగుగంగ, ముచ్చుమర్రి లిఫ్ట్ వంటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలో చేపట్టినవే అని సిఎం గుర్తు చేశారు.ఎడారిగా మారుతున్న అనంతపురం జిల్లాకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి తాగు, సాగు నీరిచ్చిన ఘనత టీడీపీదని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సీమలో కరువుకు సమాధానం చెప్పామని....నేడు డ్రిప్ లేని ప్రాంతాన్ని రాయల సీమలో మనం చూడగలమా అని అన్నారు.2014 తర్వాత టీడీపీ పాలనలో రూ.12 వేల కోట్లకు పైగా నిధులను రాయలసీమలోనే సాగునీటి ప్రాజెక్టులపై ఖర్చు పెట్టి గొప్ప ఫలితాలు సాధించామని అన్నారు. ఒకవైపు కరువు సీమను సస్యశ్యామలం చేస్తూ మరోవైపు పారిశ్రామికీకరణకు పెద్దపీట వేస్తున్నామన్నారు.కడప జిల్లా కొప్పర్తిలో పారిశ్రామిక హబ్, నెల్లూరు జిల్లా రామాయపట్నంలో బీపీసీఎల్, కర్నూలులో ఓర్వకల్ హబ్, అనంతపురం జిల్లాలో కియా, విండ్ పవర్, సోలార్ ద్వారా సీమలో ప్రగతిని వేగవంతం చేశామన్నారు.

తిరుమల, తిరుపతి అభివృద్ధి జరిగిందంటే టీడీపీ హయాంలోనే అన్న విషయం అందరికీ తెలుసని సిఎం అన్నారు. కడప, కర్నూలు ఎయిర్ పోర్టు నిర్మించింది కూడా తెలుగుదేశం ప్రభుత్వమే అని గుర్తుచేశారు.టీడీపీ క్యాడర్ మంచి ఉత్సాహంతో పనిచేస్తున్నారని, ఈ సభ ద్వారా రాయలసీమలో నూతన ఉత్సాహం వస్తుందని చంద్రబాబు అన్నారు. రాయలసీమలో హార్టికల్చర్, పరిశ్రమలు, డెయిరీలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హార్టికల్చర్ ద్వారా వచ్చే మార్పులతో రాయల సీమ ప్రజలు కోనసీమ రైతులను అధిగమిస్తారని...ఈ ఫలితాలు రానున్న 4 ఏళ్లలో చూస్తామని అన్నారు. పార్టీ నేతలు ఈ అంశాలు అన్నీ ప్రజల్లో చర్చించాలని అన్నారు.మహానాడుకు హాజరయ్యే ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు వసతి, రవాణాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని చంద్రబాబు సూచించారు. పార్టీ సిద్ధాంతాలు, నాలుగు దశాబ్దాల ప్రయాణంలో సాధించిన విజయాలు, నేడు ప్రభుత్వ విజయాలు మహానాడులో విస్తృతంగా చర్చించాలని సిఎం సూచించారు.

మొదటి రోజు పార్టీ పరమైన అంశాలపై, రెండోరోజు ప్రభుత్వ పరంగా అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి చర్చించాలన్నారు. మూడో రోజు లక్షలాదిమందితో భారీ బహిరంగ సభ ఉంటుందని, ఎక్కడ ఎవరికీ ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారుకూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి అందరికీ అవగాహన కలిగించేలా తీర్మానాలు ఉండాలని చంద్రబాబు తెలిపారు. మినీ మహానాడును ఈ నెల 18, 19, 20వ తేదీల్లో అన్ని నియోజకవర్గాల్లో, 22, 23 వ తేదీల్లో పార్లమెంట్ల వారీగా నిర్వహించాలని చంద్రబాబు పార్టీ నేతలకు సూచించారు.

# యజమాని భార్యతో అక్రమ సంబంధం

- కోటి రూపాయల డిమాండ్‌తో పోలీసులకు ఫిర్యాదు

**హైదరాబాద్, మే16( వెలుతురు):**
హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో ఓ కారు డ్రైవర్ దాష్టీకం బయట పడింది. యజమాని భార్యతో కారు డ్రైవర్ వివాహేతర సంబంధం పెట్టుకోవడమే గాకుండా బ్లాక్‌మెయిల్‌కు తెగించాడు. యజమానిని బెదరించి భారీగా నగదు డిమాండ్ చేశాడు. అంతేకాకుండా.. అందుకు సంబంధించిన వీడియోలు సైతం బయట పెడతానంటూ యజమానిని బ్లాక్ మెయిల్ చేస్తున్నాడు. అలా చేయకుండా ఉండాలంటే.. తనకు రూ. కోటి నగదు ఇవ్వాలని డిమాండ్ చేసాడు. అలాగే భార్యకు సైతం విడాకులు ఇవ్వాలంటూ యజమానిని బెదిరించాడు. దీంతో సదరు యజమాని శుక్రవారం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే విషయంపై కొన్ని రోజులుగా యజమానిని డ్రైవర్ ఇఫ్తికార్ ఆహ్మద్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అతడి భార్యతో కలిసి ఉన్న ఫొటోలు, వీడియోలు.. యజమాని సెల్ ఫోన్‌కు పంపాడు. వీటిని అతడి భార్యకు చూపించేందుకు యజమాని ప్రయత్నించాడు. అంతలోనే ఈ ఫొటోలు, వీడియోలను డ్రైవర్ డిలీట్ చేశాడు. దీంతో యజమాని మధ్యవర్తుల ద్వారా ఈ కేసు సెటిల్ చేసుకోవాలని భావించాడు. మధ్యవర్తుల వద్ద తనకు రూ. కోటి చెల్లించడంతోపాటు- అతడి భార్యకు సైతం విడాకులు ఇవ్వాలంటూ డ్రైవర్ డిమాండ్ చేశాడు. ఈ నేపథ్యంలో సదరు యజమాని విసిగిపోయి.. బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో డ్రైవర్ ఇఫ్తికార్ ఆహ్మద్‌పై పోలీసులకు యజమాని ఫిర్యాదు చేశాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నట్లు సమాచారం.

# దివ్యాంగులకు కేంద్ర గుర్తింపు కార్డులు

- అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశం

**అమరావతి,మే16( వెలుతురు):**
దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగా రాష్ట్రంలో దివ్యాంగులకు గుర్తింపు కార్డుల జారీకి అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సదరం సర్టిఫికెట్లు, వయోవృద్ధుల హెల్త్ స్కీమ్ పై చర్చించారు. గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలతో పాటు- మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం స్లాట్ బుకింగ్‌కి చర్యలు చేపట్టాలన్నారు. ఇక, స్లాట్ బుకింగ్ చేసుకున్న రోజు నుంచి నెల రోజుల లోపు సదరం సర్టిఫికెట్లు- ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. సుదూర ప్రాంతాలు, గిరిజన తండాల నుంచి వచ్చే దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలని.. దివ్యాంగులకు గుర్తింపు కార్డులు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.. ఈ గుర్తింపు కార్డులో అంగవైకల్య శాతం, దివ్యాంగుల వివరాలు ఉంటాయి. గుర్తింపు కార్డులు తయారీ, జారీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఃఓఆ÷ వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల ఉచిత వైద్యం అందిస్తామని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు.


### అస్సాం సినీ పరిశ్రమలో

# తీవ్ర విషాదం

- సింగర్ గాయత్రి హజారికా కన్నుమూత

**గౌహతి, మే16( వెలుతురు):**
అస్సాం సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ అస్సామీ సింగర్ గాయత్రి హజారికా (44) కన్నుమూశారు. గత కొంత కాలంగా పెద్దప్రేగు క్యాన్సర్‌తో బాధపడుతోన్న ఆమె గువహతిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. సరా పాటే పాటే ఫాగున్ నామే పాట ద్వారా సింగర్‌గా మంచి గుర్తింపు పొందిన గాయత్రి 44 ఏళ్ల వయస్సులోనే మరణించడంతో అస్సామీ సంగీత పరిశ్రమ తీవ్ర దుఃఖంలో మునిగిపోయింది. తుమి కున్ బిరోహి అనన్య, జంక్ నాసిల్ బోనోట్, క్బుజీ జోపోన్ వంటి అద్భుతమైన పాటలతో ద్వారా గాయత్రి ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. గాయత్రి మరణవార్త తెలుసుకుని పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, ఆమె అభిమానులు సంతాపం వ్యక్తం చేశారు. సింగర్ గాయత్రి హజారికా మరణం పట్ల అస్సాం సీఎం హిమంత బిస్వా శర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గాయత్రి అద్భుతమైన స్వరం, అస్సామీ సంగీతానికి ఆమె చేసిన శాశ్వత కృషి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ గాయత్రి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అసోం గణ పరిషత్ అధ్యక్షుడు అతుల్ బోరా కూడా ఎక్స్ వేదికగా గాయత్రి హజారికా మృతి పట్ల సంతాపం తెలిపారు. ఆమె ఆత్మీయ స్వరం అస్సామీ సంగీతాన్ని సుసంపన్నం చేసిందని.. లెక్కలేనన్ని హృదయాలను తాకిందని పేర్కొన్నారు. ఆమె చిన్న వయస్సులో మృతి చెందటం చాలా బాధాకరమన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## అమల్లోకి రానున్న
# ఇందిరా జలసిరి పథకం




**మహబూబ్ నగర్ మే 16, ( వెలుతురు)**

రైతు భరోసాపై ఇటీవల శుభవార్త చెప్పిన తెలంగాణ ప్రభుత్వం తాజాగా పోడు రైతులకు తీపి కబురు చెప్పింది. తెలంగాణ వ్యాప్తంగా పోడు పట్టాలు పొందిన 2.10 లక్షల మంది రైతులకు 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తద్వారా 6 లక్షల ఎకరాల మేర పోడు రైతులకు ప్రయోజనం చేకూరనుంది. అందించనున్నారు. ఈ నెల 18న అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మాచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. ఇందిర సౌర గిరి జల వికాసం పథకం కోసం వచ్చే ఐదేళ్లలో (ఈ ఆర్థిక ఏడాది నుంచి 2029-30 వరకు) దాదాపు రూ.12,600 కోట్లను ఖర్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత సంవత్సరంలో సర్కార్ రూ.600 కోట్ల ను ఖర్చు చేయనుండగా, వచ్చే ఏడాది నుంచి నాలుగేళ్ల పాటు రూ.3వేల కోట్ల చొప్పున పోడు పట్టాలు పొందిన రైతుల కోసం ఖర్చు చేయనున్నారు. ఇందిర సౌర గిరి జల వికాసం అమలుకు ఎస్టీ ఎస్డీఎఫ్ నిధులను ప్రభుత్వం వినియోగించనుందని సమాచారం. రాష్ట్రంలోని పోడు పట్టాల రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ స్కీమ్ అమలు చేయాలని భావిస్తోంది. పోడు పట్టాలు పొందిన రైతులకు ఇందిర సౌర గిరి జల వికాసం పథకం అమలుకు అనుమతులు మంజూరు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు సైతం జారీ చేసింది. ఈ స్కీమ్ ద్వారా పోడు పట్టాలు పొందిన రైతుల భూముల్లో బోర్లు వేయడం, వాటికి సోలార్ పంపు సెట్లు అందించడం లాంటి మరెన్నో మౌలిక సౌకర్యాలను ప్రభుత్వం కల్పించనుంది. పోడు రైతులకు ఎలాంటి ఖర్చులు లేకుండా, ప్రభుత్వమే ఆ ఖర్చులను భరించనుంది. గిరిజనులపై ఎలాంటి బారాన్ని మోపడం లేదని అధికారులు తెలిపారు. మండలాల వారీగా మే 25వ తేదీ వరకు అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించాలి. జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు భూగర్భ జలాల సర్వే, ఇతర అంచనాలు సిద్ధం చేయాలి. జిల్లాస్థాయిలో మే 30 నాటికి సర్వే, ఇతర పనులకు టెండర్లు సైతం ఖరారు చేయాలి. జూన్ 25 నాటికి ఎంపిక చేసిన ప్రాంతాల్లో పనులు అప్పగించాలి. జూన్ 26 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు పోడు భూముల అభివృద్ధి, బోరుబావుల ఏర్పాటు, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు, లాంటి మౌలిక సదుపాయాలు కల్పించి.. ఉద్యాన పంటల పనులు చేసి, యూనిట్ల వినియోగపత్రాలను సమర్పించాలని ప్లాన్ చేశారు.

# ఇక సిటీలో ట్రాఫిక్ కష్టాలు నిల్



**హైదరాబాద్, మే 16, ( వెలుతురు)**

హైదరాబాద్ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండీఏ భారీ ప్రణాళికలు రచిస్తోంది. 20 వేల కోట్ల రూపాయల నిధులను సమీకరించేందుకు బాండ్లు, రుణాల మార్గాన్ని ఎంచుకుంది. కొత్త రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో నగర రూపురేఖలు మారనున్నాయి. రాబడి మార్గాలను అన్వేషిస్తూ, గత అమ్మకాల అనుభవంతో మరిన్ని నిధులు సేకరించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమవుతోంది. ఈ ప్రయత్నాలు నగర భవిష్యత్తును ఎలా మారుస్తాయో చూడాలి. హైదరాబాద్ నగర అభివృద్ధికి నిధుల వేట ప్రారంభించిన హెచ్ఎండీఏ రూ.20,000 కోట్లను బాండ్లు, రుణాల రూపంలో సేకరించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నిధులను ప్రధానంగా ఎలివేటెడ్ కారిడార్లు, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణానికి వినియోగించనుంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ఆర్ఆర్ఆర్ వరకు కొత్త రహదారుల ప్రాజెక్టులు ఇప్పటికే ప్రణాళికలో ఉన్నాయి. ఈ లక్ష్య సాధన కోసం 'ట్రస్టు కాపిటల్' అనే మర్చంట్ బ్యాంకును సలహాదారుగా నియమించారు. హెచ్ఎండీఏ ప్రధాన ఆదాయ మూలాలుగా ప్లానింగ్ విభాగం నుంచి వచ్చే రెవెన్యూ, లేఅవుట్ల అమ్మకాలు, టోల్ చార్జీలు ఉన్నాయి. ప్లానింగ్ విభాగం నుంచి సుమారు రూ.1,500 కోట్లు వస్తుండగా.. ఇది త్వరలో రూ.2,000 కోట్లను అధిగమించే అవకాశముంది. ప్రత్యేక ఎస్క్రో ఖాతాలో రూ.500 కోట్లు చూపించగలిగితే.. అదనంగా రూ.5,000 కోట్ల రుణం తీసుకునే అవకాశం ఉంది. అంతేకాదు.. గతంలో కోకాపేట, బుద్వేల్, మోకిల్లా తదితర ప్రాంతాల్లో జరిగిన లేఅవుట్ల అమ్మకాల ద్వారా రూ.13,000 కోట్లకు పైగా ఆదాయం వచ్చిన అనుభవంతో, ఇప్పుడు మరోసారి ఆ స్థాయిలో రికార్డు ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఓఆర్ఆర్ టోల్ వసూళ్లతో పాటు సికింద్రాబాద్-శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్, ఫ్యూచర్ సిటీ-ఆమన్‌గల్ రోడ్డుపై టోల్ వసూలు చేయాలని ప్రణాళిక వేస్తోంది. ఈ ఆదాయాల ఆధారంగా భవిష్యత్ బాండ్లు విడుదల చేయాలని హెచ్ఎండీఏ భావిస్తోంది. ఓఆర్ఆర్ చుట్టూ ఎంఎంటీఎస్ ట్రైన్లుతెలంగాణలో రహదారుల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. కొత్త రహదారుల ప్రతిపాదనలు సిద్ధం చేయడంతో పాటు, ప్రస్తుతం ఉన్న రహదారులను కూడా విస్తరిస్తున్నారు. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు (RRR) ప్రాజెక్టు తెలంగాణకు ఒక గేమ్-ఛేంజర్‌గా భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఔటర్ రింగ్ రోడ్డుకు సుమారు 40 కి.మీ దూరంలో ఈ రీజినల్ రింగ్ రోడ్డును ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మిస్తున్నారు. మొత్తం 5 ప్యాకేజీలలో దాదాపు 7 వేల కోట్ల రూపాయల వ్యయంతో ఉత్తర భాగాన్ని పూర్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది.

# బస్సు, లారీ ఢీ..ముగ్గురికి గాయాలు

**ఖమ్మం మే 16, ( వెలుతురు)**

ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం సింగరేణి ఓసీ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్ బస్సు ను లారీ ఢీ కొట్టింది. ఘటనలో బస్సు డ్రైవర్ తీవ్ర గాయాలతో క్యాబిన్ లో ఇరుక్కున్నాడు. బస్సులో ప్రయాణిస్తున్న 20 మంది లో ఇద్దరికి స్వల్ప గాయాలు అయ్యాయి. పెను ప్రమాదం తృటిలో తప్పింది. క్షతగాత్రులను సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.

# ఆరోగ్య సంరక్షణలో తెలంగాణ టాప్

## కేసీఆర్ ప్రభుత్వానికి కేంద్రం కితాబు





**హైదరాబాద్, మే 16, ( వెలుతురు)**

తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పాలనలో మాతా-శిశు ఆరోగ్య సంరక్షణలో గణనీయమైన పురోగతి సాధించి, దక్షిణ భారతదేశంలో కేరళ తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 2019-2021 నమూనా నమోదు వ్యవస్థ (ఎస్ఆర్ఎస్) గణాంక నివేదిక ప్రకారం, తల్లి మరణాల రేటు (ఎంఎంఆర్), శిశు మరణాల రేటు (ఐఎంఆర్) తగ్గించడంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించి అద్భుత పనితీరు కనబరిచింది. ఈ విజయం రాష్ట్రంలో అమలైన ఆరోగ్య కార్యక్రమాలకు, ముఖ్యంగా గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు నిదర్శనంగా నిలుస్తుంది. ఎస్ఆర్ఎస్ నివేదిక ప్రకారం, తల్లి మరణాల రేటు (ఎంఎంఆర్)లో తెలంగాణ 45తో దక్షిణ భారతదేశంలో కేరళ(20) తర్వాత రెండో స్థానంలో ఉంది. దేశ సగటు ఎంఎంఆర్ 93గా ఉండగా, దక్షిణ భారత సగటు 47గా నమోదైంది. ఇతర దక్షిణ రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (46), తమిళనాడు (49), కర్ణాటక (63)తో పోలిస్తే తెలంగాణ గణనీయంగా మెరుగైన స్థితిలో ఉంది. ఉత్తర రాష్ట్రాలైన మధ్యప్రదేశ్ (175), ఛత్తీస్‌గఢ్ (132), ఉత్తరప్రదేశ్ (151)లతో పోల్చినప్పుడు తెలంగాణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ శ్లాఘనీయమైన పనితీరును కనబరిచింది.

శిశు మరణాల రేటులో గణనీయమైన తగ్గుదల

శిశు మరణాల రేటు (ఐఎంఆర్) విషయంలోనూ తెలంగాణ రాష్ట్రం దేశ సగటు (27) కంటే మెరుగైన పనితీరును చూపింది. తెలంగాణలో ఐఎంఆర్ 20గా నమోదైంది, ఇది కేరళ(6), తమిళనాడు(12), కర్ణాటక(17), ఆంధ్రప్రదేశ్(22)తో పోలిస్తే గణనీయమైన పురోగతిని సూచిస్తుంది. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు ఐఎంఆర్ 39గా ఉండగా, 2021 నాటికి ఇది 20కి తగ్గడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో ఐఎంఆర్ 23, పట్టణ ప్రాంతాల్లో 16గా నమోదైంది, ఇది రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ సేవల సమర్థతను తెలియజేస్తుంది. ఐదేళ్లలోపు చిన్నారుల మరణాల రేటు(అండర్-5 మోర్టాలిటీ రేట్)లో కూడా తెలంగాణ గణనీయమైన పురోగతిని సాధించింది. 2014%-%15లో ఈ రేటు 41గా ఉండగా, 2021 నాటికి 22కి తగ్గింది, ఇది దేశ సగటు(31) కంటే మెరుగైన స్థితిని సూచిస్తుంది. దక్షిణ రాష్ట్రాల్లో కేరళ(8), తమిళనాడు (14) తర్వాత తెలంగాణ ఈ విషయంలో మూడో స్థానంలో నిలిచింది. మాతా-శిశు ఆరోగ్య సంరక్షణలో సాధించిన ఈ విజయం బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వివిధ ఆరోగ్య కార్యక్రమాల ఫలితంగా చెప్పవచ్చు. కేసీఆర్ కిట్ పథకం, ఆరోగ్యశ్రీ, గర్భిణీ సంరక్షణ కేంద్రాల బలోపేతం, గ్రామీణ ఆరోగ్య సౌకర్యాల మెరుగుదల, పోషకాహార కార్యక్రమాలు వంటి చర్యలు ఈ విజయంలో కీలక పాత్ర పోషించాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందించిన పోషకాహారం, టీకాల కార్యక్రమాలు, ఆసుపత్రుల్లో సమర్థవంతమైన సేవలు ఈ రేట్ల తగ్గింపునకు దోహదపడ్డాయి.

తెలంగాణ ఆరోగ్య సంరక్షణ విజయాలు దక్షిణ భారత రాష్ట్రాలతో పోల్చినప్పుడు మరింత స్పష్టమవుతాయి.

తల్లి మరణాల రేటు (ఎంఎంఆర్): కేరళ (20), తెలంగాణ (45), ఆంధ్రప్రదేశ్ (46), తమిళనాడు (49), కర్ణాటక (63).

శిశు మరణాల రేటు (ఐఎంఆర్): కేరళ (6), తమిళనాడు (12), కర్ణాటక (17), తెలంగాణ (20), ఆంధ్రప్రదేశ్ (22).

ఐదేళ్లలోపు మరణాల రేటు: కేరళ (8), తమిళనాడు (14), తెలంగాణ (22).

ఇంకా మెరుగుపరిచే అవకాశాలు..

ఈ గణాంకాలు తెలంగాణ రాష్ట్రం ఆరోగ్య రంగంలో సాధించిన స్థిరమైన పురోగతిని సూచిస్తాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమతుల్య ఆరోగ్య సేవలను అందించడంలో రాష్ట్రం విజయవంతమైంది.

తెలంగాణ రాష్ట్రం ఈ విజయాలను కొనసాగించడానికి, మరింత మెరుగైన ఆరోగ్య సేవలను అందించడానికి కొన్ని అదనపు చర్యలు చేపట్టవచ్చు.

గ్రామీణ ఆరోగ్య సౌకర్యాల విస్తరణ: గ్రామీణ ప్రాంతాల్లో ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సంఖ్యను మరింత పెంచడం.

వైద్య సిబ్బంది శిక్షణ: డాక్టర్లు, నర్సులు, ఆశా కార్యకర్తలకు అధునాతన శిక్షణ అందించడం.

జనసామాన్యంలో అవగాహన: గర్భిణి సంరక్షణ, శిశు ఆరోగ్యం గురించి ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలను ముమ్మరం చేయడం.

తెలంగాణ రాష్ట్రం బీఆర్ఎస్ పాలనలో మాతా%-%శిశు ఆరోగ్య సంరక్షణలో సాధించిన విజయాలు దేశవ్యాప్తంగా ఆదర్శనీయంగా నిలుస్తున్నాయి. కేంద్రం విడుదల చేసిన ఎస్ఆర్ఎస్ నివేదిక ఈ పురోగతిని ధ్రువీకరిస్తూ, తెలంగాణ ఆరోగ్య రంగంలో సాధించిన స్థిరమైన అభివృద్ధిని హైలైట్ చేస్తోంది. ఈ విజయం రాష్ట్ర ప్రభుత్వం, ఆరోగ్య శాఖ, స్థానిక సంస్థలు, ప్రజల సమిష్టి కృషి ఫలితమని చెప్పవచ్చు.

# పాత వాహనాలకు చెక్...

**హైదరాబాద్, మే 16, ( వెలుతురు)**



జీవితాంతం కష్టపడి డబ్బులు కూడా పెట్టుకుని.. లక్షలు పెట్టి వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఈ వాహనాల్లో కొన్ని దొంగల పాలవుతున్నాయి. ఒకసారి ఏదైనా వాహనం దొంగిలించబడిందంటే తిరిగి దక్కించుకోవడం కష్టతరంగా మారింది. చాలామంది చోరులు వాహనాలను కొనుగోలు చేసిన తర్వాత వెంటనే నెంబర్ ప్లేట్లను మార్చేసి.. ముఖ్యమైన పార్కులను కూడా తీసేస్తున్నారు. అలా చేసి ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. అయితే ఈ సమస్యను పరిష్కరించడానికి గతంలో కొందరు సుప్రీంకోర్టులో పిటీషన్ వేయగా కొన్ని ఆదేశాలను జారీ చేసింది. ఆ ఆదేశాలను ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అమలు చేయబోవుంది. 2025 సెప్టెంబర్ నుంచి ప్రతి వాహనానికి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఉండాలని నిర్ణయించింది. అయితే ఈ నెంబర్ ప్లేట్ను ఇంటికే తెచ్చుకునే అవకాశం ఉందా? అంటే కచ్చితంగా ఉంది. ఇందుకోసం ఆన్లైన్లో అప్లై చేయాల్సి ఉంటుంది. అది ఎలాగంటే?సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2019 కంటే ముందు వాహనాలు కొనుగోలు చేసుకున్న వారు ను తప్పనిసరిగా ఉంచుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సెప్టెంబర్ 30 2025 గడువుగా నిర్ణయించింది. ఈ లోగా వాహనాలు ఉన్నవారు సెక్యూరిటీ ప్లేట్లు తప్పనిసరిగా మార్చుకోవాలని పేర్కొంది. హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ వల్ల దొంగతనాలను అరికట్టవచ్చని, అలాగే రహదారి భద్రత ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపింది. అయితే సాధారణంగా హాయ్ సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ను మార్చుకోవాలంటే రేడియం సెంటర్ లోకి వెళ్లి చేంజ్ చేయాల్సి ఉంటుంది. ఇలా మార్చుకుంటే కనీసం రూ. 320 నుంచి రూ. 400 వరకు చార్జ్ అవుతుంది. అయితే కొందరు వీటిని నాణ్యమైనవిగా ఇవ్వడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో నేరుగా రిజిస్ట్రేషన్ శాఖ నుంచే ఐ సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు ఇంటికి తీసుకువచ్చే అవకాశం ఉంది. ఆన్లైన్లో అప్లై చేసుకోవడం ద్వారా పై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ ఇంటికే వస్తుంది. అదెలా చేయాలంటే? ముందుగా గూగుల్ లోకి వెళ్లి www.book-my hsrp.com లోకి వెళ్ళాలి. ఈ వెబ్సైట్ ఓపెన్ చేయగానే హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ అనే ఆప్షన్ కనిపిస్తుంది. దీనిపై క్లిక్ చేయగానే దానికి సంబంధించిన పేజీ ఓపెన్ అవుతుంది. ఇందులో వాహనదారుల సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో కారు, ద్విచక్ర వాహనం, ఆటో, లారీ ఇలా ఏ వాహనమైన ఇందులో ఐ సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ కోసం బుకింగ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత డెలివరీ అడ్రస్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పుడు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చెల్లించిన తర్వాత ఇంటి అడ్రస్ కు హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ వస్తుంది. 2019 సెప్టెంబర్ 30 తర్వాత ఈ నెంబర్ ప్లేట్ వాహనాలకు లేకపోతే పోలీసులు జరిమానా వేసే అవకాశముంది. ఈ జరిమానా భారీగా ఉండనుంది. అందువల్ల తెలంగాణలోని వాహనాలు ఉన్నవారు ఐ సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు తప్పనిసరిగా మార్చుకోవాల్సి ఉంటుంది.

# తమిళనాడు జీడీపీ అంత లేదు.. పాకిస్తాన్ జీడీపీ

**న్యూఢిల్లీ, మే 16, ( వెలుతురు)**




ఇవన్నీ కూడా దాయాది దేశానికి అచ్చంగా సరిపోతాయి. ఎందుకంటే అక్కడ రోడ్లు లేవు. జనాలకు సురక్షితమైన నీరు అందదు. మూడు పూటల భోజనం దొరకదు. ఇవన్నీ జరగాలంటే ఏదో ఒక దేశం అప్పు ఇవ్వాలి. నమ్మి అక్కడ పెట్టుబడి పెట్టాలి. అవన్నీ జరగాలంటే ముందు అక్కడ ఉగ్రవాదం లేకుండా పోవాలి. అక్కడ ఉగ్రవాదం పోయే పరిస్థితి లేదు. ఉగ్రవాదులు ఆదేశాన్ని విడిచి వెళ్లే అవకాశం లేదు. పొరపాటున అక్కడ ప్రభుత్వం ఆర్మీకి వ్యతిరేకంగా ఏదైనా నిర్ణయం తీసుకుంటే ఇక అంతే సంగతులు. ఆ దేశ అధ్యక్షుడు జైలుకు వెళ్తాడు. కర్మ బాగా లేకపోతే కాటికి వెళ్తాడు. ఇక ప్రధానమంత్రి .. మంత్రులు కూడా అదే సత్కారాన్ని పొందుతుంటారు. గతంలో జరిగిన పరిణామాలు ఉగ్రవాద దేశ ఆర్మీ ఎంత దారుణంగా ఉంటుందో నిరూపించాయి. ప్రస్తుత పరిణామాలు కూడా దానినే నిరూపిస్తున్నాయి. అయినప్పటికీ ఆ దేశం మారదు. మారే అవకాశం లేదు. ఒకవేళ మారినప్పటికీ అక్కడి ఉగ్రవాదులు మత చాందసవాదంతో ఆ దేశాన్ని ప్రపంచ పటంలోనే లేకుండా చేస్తారు. ప్రత్యర్థి దేశంతో యుద్ధం చేయాలంటే సత్తా ఉండాలి. అన్నింటికీ మించి ఆర్థికంగా బలం ఉండాలి. ఆయుధ సామాగ్రి దండిగా ఉండాలి. ఇవన్నీ జరగాలంటే ఆదేశంలో పరిపాలన సక్రమంగా సాగుతూ ఉండాలి. పాకిస్తాన్ ఆ విషయాన్ని ఎప్పుడో మర్చిపోయింది. ఉగ్రవాదానికి భూతల స్వర్గం లాగా మారిపోయింది.. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తూ నరకం చూపిస్తోంది. పోనీ వాటిని సక్రమంగా ఖర్చు చేస్తోందా? అంటే లేదు. అక్కడ వసూలు చేసిన పన్నులు మొత్తం ఆర్మీ చేతిలోకి వెళ్తాయి. అవి కాస్త ఉగ్రవాదులకు చేరిపోతాయి. అంతిమంగా పన్నులు చెల్లించిన ప్రజలు మొత్తం సౌకర్యాలు లేక.. నరకం చూస్తారు. వాస్తవానికి పాకిస్తాన్ ఆదాయం ఇటీవల కాలంలో మరింత దారుణంగా పడిపోయింది. ఆ దేశ జిడిపి 397.5 బిలియన్ డాలర్లు మాత్రమే. ఇది మనదేశంలో తమిళనాడు రాష్ట్రానికంటే తక్కువ.. తమిళనాడు రాష్ట్రం జిడిపి 419.5 బిలియన్ డాలర్లు. మనదేశంలో ఒక రాష్ట్రం స్థాయిలో కూడా జిడిపి నమోదు చేయాలని పాకిస్తాన్.. మనకు యుద్ధం చేస్తానంటూ మేకపోతు గాంభీర్యం పలుకుతోంది. చైనా ఇచ్చే చిల్లర పైసల కోసం.. ఇతర దేశాలు ఇచ్చే అప్పు కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతోంది..పోనీ తెచ్చిన అప్పును సక్రమ మార్గంలో ఖర్చు చేస్తోందా అంటే.. అది కూడా లేదు. మొత్తంగా చూస్తే ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాద దేశంగా పేరు.. పర్యాటకులు రావడానికి ఇష్టపడని తీరు.. చివరికి సొంత దేశ పార్లమెంట్ సభ్యులే ఛీ కొడుతున్న విధానం.. ఇదీ ఉగ్రవాద దేశ అసలు ముఖచిత్రం.. ఇది మారుతుందా.. మారే అవకాశం ఉందా.. ఈ ప్రశ్నలకు మారదు.. మారే అవకాశం లేదు అనే సమాధానాలు మాత్రమే వస్తాయి.

# వైఎస్ రెడ్డి ఎవరో తెలుసా

**విజయవాడ, మే 16, ( వెలుతురు)**

ముంబైలో టౌన్ ప్లానింగ్ డిప్యూటీ డైరెక్టర్ గా పని చేస్తున్న వైఎస్ రెడ్డి అనే వ్యక్తిని ఈడీ అరెస్టు చేసింది. ముంబై, హైదరాబాద్ తో పాటు 12 చోట్ల సోదాలు నిర్వహించిన ఈ డి నగదు, నగలు స్వాధీనం చేసుకుంది. మొత్తం 9 కోట్లు ఐదు వందల నోట్లు దొరికాయి. 8 కోట్ల రూపాయల విలువచేసే బంగారు ఆభరణాలు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇతర ఆభరణాలతో కలిపి మొత్తం 23 కోట్ల రూపాయల విలువచేసే నగలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ముంబైలో 41 భవనాలకు అక్రమ అనుమతులు ఇచ్చారని ఆరోపణలపై ఈడి కేసు నమోదు చేసింది. బిల్డర్స్ తో కుమ్మక్కై అనధికారికంగా అనుమతులు ఇచ్చినట్లు గుర్తించారు. అనధికార భవన అనుమతుల ద్వారా మనీ లాండరింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు జరిగినట్లు ఈడీ తేల్చిది. ఈ కేసు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (PMLA), 2002 కింద నమోదు చేశారు. ఈడీ హైదరాబాద్ మరియు ముంబైలోని వై.ఎస్. రెడ్డి నివాసాలు, కార్యాలయాలలో సోదాలు నిర్వహించి, అక్రమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాలను సేకరించింది. ఈడీ అధికారులు గణనీయమైన మొత్తంలో నగదు, బంగారం, మరియు వజ్రాలను స్వాధీనం చేశారు. ఈ కేసులో ఇతర వ్యక్తులు లేదా సంస్థల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటన గురించి సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. వాసాయి-విరార్ ప్రాంతంలో దశాబ్ద కాలంగా అవినీతికి పాల్పడుతున్నారు. మురుగునీటి శుద్ధి, డంపింగ్ కోసం ఉద్దేశించిన భూమిపై అక్రమంగా నలభై ఒక్క భవనాలు నిర్మించారు. ఎప్పుడూ అమ్మకూడని లేదా నిర్మించకూడని భూమిగా దాన్ని నిర్ధారించర్నా. అయితే సంవత్సరాలుగా, బిల్డర్లు నకిలీ అనుమతులను ఉపయోగించి ఈ ఫ్లాట్‌లను కొనుగోలుదారుల కు విక్రయించారు. వాసాయి-విరార్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పట్టించుకోలేదు. ఈ వైఎస్ రెడ్డి కీలకంగా ఉన్నారు. ఈ నిర్మాణాలను కూల్చివేయాలని బాంబే హైకోర్టు కూల్చివేతకు ఆదేశించింది. సుప్రీంకోర్టు దానిని సమర్థించింది.

## వందలాది మంది మావోలను హత్య చేస్తున్నారు

- ఆపరేషన్ కగార్ సరికాదన్న చాడ



**సిద్దిపేట, మే16( వెలుతురు):**
ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసి, ఉగ్రవాదులను అంతం చేయడం ప్రపంచశాంతికి శుభ పరిణామం అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. నక్సలైట్లు శాంతి చర్చలకు సిద్ధమన్న చర్చించకుండా కక్ష ధోరణి వైఖరితో కేంద్ర ప్రభుత్వం, అమిత్ షా వ్యవహరిస్తున్న తీరును ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దారుణం అన్నారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో సీపీఐ మండల మహాసభలు జరుగుతున్నాయి. ఈ వేడుకలకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వందల మంది మావోయిస్టులను చంపడం రాజ్యాంగ విరుద్ధం.. అమిత్ షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు.. వామపక్ష పార్టీలన్నీ ఖగర్ ఆపరేషన్ ను తీవ్రంగా ఖండిస్తున్నాయి.. నక్సలైట్లతో ప్రధాని మోడీ, అమిత్ షా శాంతి చర్చలకు సిద్ధం కావాలి అని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. అయితే, కొత్త ఆసుపత్రి నిర్మాణం పేరుతో ఇప్పుడు కొనసాగుతున్న హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రి భవనాన్ని కూల్చివేయద్దు అని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. హుస్నాబాద్ ప్రాంత వరప్రదాయాన్ని గౌరవెల్లి ప్రాజెక్టును గత బీఆర్ఎస్ కాలంలో కేసీఆర్ పూర్తి చేయలేదు అని ఆరోపించారు. ఇప్పుడు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా రెండేళ్లు గడుస్తున్నప్పటికీ 437 కోట్ల రూపాయలు తీసుకువచ్చాను అంటు-న్నాడు కానీ ప్రాజెక్టు పనులు మాత్రం పూర్తి కావడం లేదని విమర్శలు గుప్పించారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయాలనే డిమాండ్ తో సీపీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తామని చాడ వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

## పాక్ దురాగతాలపై విదేశాల్లో ప్రచారం

- పహల్‌గామ్ ఉగ్రదాడిపై ప్రచారం
- ఎంపిల బృందాన్ని విదేశాలకు పంపే యోచన



**న్యూఢిల్లీ, మే16( వెలుతురు):**
పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్ సహా ఇప్పటికే అనేక తక్షణ చర్యలు చేపట్టిన భారత్ ఇప్పుడు కొత్త ఇనీషియేటివ్ తీసుకోబోతోంది. ప్రపంచం ముందు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని బట్టబయలు చేయబోతోంది. ఎంపిలను బృందాలుగా చేసి విదేశాల్లో ప్రచారం నిర్వహించాలని చూస్తోంది. ఇందులో శశిథరూర్, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ కూడా ఉండనున్నట్లు సమాచారం. పహల్గాంలో 26 మంది ప్రాణాలు బలిగొన్న ఉదంతాన్ని, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గురించి.. ప్రపంచ దేశాలకు వివరించడానికి భారత ప్రభుత్వం అన్ని పార్టీల ఎంపీ ప్రతినిధుల బృందాన్ని విదేశాలకు పంపనుంది. కశ్మీర్‌పై పాకిస్తాన్ దురాగతాన్ని తిప్పికొట్టడానికి, పాక్ ప్రేరేపిత సీమాంతర ఉగ్రవాదాన్ని బహిర్గతం చేయడానికి ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించారు. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం వివిధ రాజకీయ పార్టీల పార్లమెంటు సభ్యుల ప్రతినిధులను కీలకమైన ప్రపంచ రాజధానులకు పంపడానికి సన్నాహాలు చేస్తోంది. ఉగ్రవాద దాడులపై భారతదేశ దృక్పథాన్ని ప్రదర్శించడం, నిరంతర సీమాంతర ఉగ్రవాద బాధితురాలిగా భారతదేశం ఎదుర్కొంటు-న్న సవాళ్లని ప్రపంచానికి చాటి చెప్పడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఃఊఆ), ఇతర సంబంధిత ప్రభుత్వ విభాగాల సమన్వయంతో ఈ కార్యక్రమం చేపడతారు. దీంతో ఇప్పుడు.. సరిహద్దుల ఆవల నుంచి పుట్టు-కొచ్చే ఉగ్రవాదంపై భారత్ తన వాణిని ప్రపంచ దేశాల ముందు బలంగా వినిపించబోతోంది. ఈ దౌత్య ప్రచారానికి మద్దతు ఇవ్వడానికి విదేశాలలో ఉన్న భారత మిషన్లు పార్లమెంటరీ బృందాలతో కలిసి పనిచేస్తాయి. ఈ బృందంలో అధికార బీజేపీ ఎంపీలతో పాటు-, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితరులు ఉండే అవకాశం ఉంది. దీనికి సంబంధించి కేంద్రం త్వరలోనే అధికారిక ప్రకటన వెలువరించే అవకాశం ఉంది. భారత్ ఈ తరహా కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి.

## పాక్ పరిస్థితే ఎపికి దాపురిస్తోంది

- ఏడాదిగా ప్రభుత్వ హనీమూన్ ముగిసింది
- మాజీమంత్రి బొత్స సత్యనారాయణ



**విజయనగరం, మే16( వెలుతురు):**
ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా.. పాకిస్తాన్ అయిపోతుంది అంటూ మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు.. సంపద సృష్టిస్తామని అన్నారు కదా.. ఇప్పుడు ఏమి అయ్యిందని ప్రశ్నించారు.. ఇక, వరి ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం ఫెయిల్ అని ఫైర్ అయ్యారు.. ఏడాదిగా ప్రభుత్వం హనిమూన్ చేసింది.. ఇచ్చిన ఒక మాట కూడ నిలబెట్టు-కోలేదు.. సూపర్ సిక్స్ ఏం అయ్యిందని నిలదీశారు.. అయితే, ప్రతి పక్షంగా ప్రభుత్వం మెడలు వంచి ఒత్తిడి తెస్తాం అన్నారు.. ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించకపోవడానికి మీరు ఎవరు? 40 శాతం ప్రజలు మాకు ఓటు వేశారన్నారు.. మరోవైపు.. ఎక్కడ చూసిన అవినీతి కనిపిస్తుంది.. రైతుల సమస్యల పట్ల వైసీపీ క్షేత్ర స్థాయిలో పోరాటం చేస్తుంది.. జగన్ కూడా రైతులు దగ్గరకు వస్తారు.. ఆక్వా ,పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం అన్నారు. జూన్‌లోపు మండల స్థాయి, జులై లోపు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు- చేయాలని నిర్ణయం తీసుకున్నాం.. జూన్ 1 నుంచి 50 రోజులు లోపు ఐదు జిల్లా పార్టీ సమావేశాలు ఏర్పాటు- చేయాలని నిర్ణయం తీసుకున్నాం అన్నారు బొత్స.. ఇక, సీజ్ ద షిప్ అన్నారు.. అదంతా ఆమ్యామ్యా అయిపోయిందా? అని సె-టైర్లు వేశారు.. ఒక్క గింజ కూడా బయటకు వెళ్లదు అన్నారు.. మరి ఏమైంది అని ప్రశ్నించారు. ఇక, ఎకరం 99 పైసలు ఇవ్వడం దేశంలో ఎక్కడైనా ఉందా..?పోలీసులతో ప్రభుత్వాలు నడుపుతానంటే కలకలం జరగదు.. మీరు ఏ విచారణ అయిన చేసుకోండి.. నీతి నిజాయితీగా చేసుకోండి అని సూచించారు.. ధాన్యం కొనుగోలు విషయంలో సివిల్ స్లపై మంత్రి చెప్తున్న మాటలు బూటకం అన్నారు.. జిల్లా నుంచి గెలిచి డిప్యూటీ- సీఎం అవ్వడం పవన్ కల్యాణ్ అదృష్టంగా పేర్కొన్న ఆయన.. పవన్ కల్యాణ్ రైతులు దగ్గరకి రాకపోవడం రైతులు దురదృష్టకరం అన్నారు.. మీ తాబేదారులు కి బకాయిలు ఇచ్చుకో మాకు అభ్యంతరం లేదు.. కేంద్రంలో మీ ప్రభుత్వమే ఉంది కదా.. చిత్త శుద్ధి లేదా? అని నిలదీశారు.. సో కాల్డ్ కేంద్ర మంత్రి ఉద్దానం కి ఏమి చేశాడు? అని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దు అన్నారు.. ఏం అయ్యింది.. ఉద్యోగులు ప్రభుత్వాన్ని అడుగుతున్నారు అని వ్యాఖ్యానించారు ఎమ్మెల్యే బొత్స సత్యనారాయణ.

# పెరుగుతున్న అసంతృప్తులు





**హైదరాబాద్, మే16( వెలుతురు):**
తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావొస్తోంది. ఆరు గ్యారంటీలు సహా పలు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ఒక్కో పథకాన్ని అమలు చేసుకుంటూ వస్తోంది. గత బీఆర్ఎస్ చేసిన అప్పులు, వాటికి వడ్డీలు చెల్లిస్తూ మరోవైపు..అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ.. కష్టాలతో నెట్టుకొస్తున్నారు సీఎం రేవంత్ రెడ్డి.ఇదిలా ఉంటే పార్టీలో, పాలనలో అధికార పార్టీ నేతల తీరు మరోరకంగా ఉంది. పవర్ లోకి వచ్చినా.. పవర్ లేకుండా పోయిందని కొందరు.. ఏళ్ళ తరబడి కంట్లో ఒత్తులేసుకుని ఎదురు చూస్తున్నా..పదవులు రావడంలేదని మరికొందరు.. నిత్యం ఇలా అసంతృప్తితో రగిలిపోతున్నారట. ఇదే ఇప్పుడు సర్కార్ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారిందట.అవును గెలిచిన ఎమ్మెల్యేల నుంచి పార్టీలో దశాబ్దాలుగా జెండా పట్టుకుని తిరుగుతున్న వారందరిలో ఇప్పుడు టన్నుల కొద్దీ ఆగ్రహావేశాలు, అసంతృప్తి జ్వాలలు..ఆరని కోపాల్ తాపాల్ ఎగిసి పడుతున్నాయట. దీనికి అద్దం పట్టేలా మొన్నామధ్య..నల్గొండ జిల్లాకు చెందని అధికార పార్టీ ఎమ్మెల్యే..సెక్రటేరియేట్ గేట్ ముందు వ్యక్తం చేసిన ఆగ్రహం.ఎమ్మెల్యేగా గెలిచి..నియోజకవర్గ సమస్యల పరిష్కారం చేయలేక పోతున్నానంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారట. అంతేకాదు తమ సమస్యలు మంత్రులకు చెప్పినా..అధికారులకు చెప్పినా.. ఫైల్ మాత్రం సెక్రటేరియట్ గేట్ కూడా దాటడం లేదని ఊగిపోయిన ఆ సదరు ఎమ్మెల్యే..ఏకంగా తన చేతిలో ఉన్న ఫైల్ ను విసిరికొట్టి తన ఆగ్రహాన్ని కొంత చల్లార్చుకున్నారట. ఇదే పరిస్థితి అధికార పార్టీలో ఉన్న మెజారిటి ఎమ్మెల్యేలు ఎదుర్కొంటున్నారని టాక్.ఇక గెలిచిన హస్తం పార్టీ ఎమ్మెల్యేల పరిస్థితి ఇలా ఉంటే.. పార్టీ పదవులకోసం గాంధీభవన్ లో నేతలు ధర్నాలకు దిగుతున్నారు. ఏకంగా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు..పార్టీ పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని గాంధీభవన్ లో ధర్నాకు దిగడం పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. అంతేకాదు పార్టీ రాష్ట్ర ప్రెసిడెంట్, సీఎం, కొందరు మంత్రులు తమ వారికే పదవులు కట్టబెడుతున్నారంటూ ఆమె బహిరంగంగా టార్గెట్ చేయడంతో అధికారంలో ఉన్న హస్తం పార్టీ పరువు గాంధీభవన్ గేట్ దాటిందనే చర్చ నడుస్తోంది.పార్టీ కార్యవర్గంలో కూడా పార్టీకి పనిచేసిన వారికి కాకుండా..పదవుల్లో ఉన్న కొందరు.. తమ వారికి పంచుతారని..పార్టీ ఎంపికను తప్పుబడుతూ సునీతా రావ్ రేపిన మంటలు హస్తం పార్టీ పెద్దలకు పెద్ద తలనొప్పిగా మారిందట. ప్రెసిడెంట్, సీఎం వాళ్ల మనుషులకే పదవులు ఇచ్చుకుంటే మరి పార్టీలో మిగతా వారి పరిస్థితి ఏంటంటూ గాంధీభవన్ లో కొందరు సీరియర్ నేతలు లోలోపల గొనుక్కొంటున్నారట. వీరి పరిస్థితి ఇలా ఉంటే..ఏడాదిన్నర అయినా..పూర్తి కెబినెట్ ను విస్తరించకపోవడంపై సీనియర్ ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారట. ఖాళీగా ఉన్న ఆరు బెర్త్ లకు డజన్ మంది ఎమ్మెల్యేలు గురి పెట్టుకుని కూర్చున్నారు. ఎవరికి వారు ఢిల్లీ పెద్దలను, సీఎం, సీనియర్ మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. కులాలు, ప్రాంతాలు, ఆర్థిక, అంగ బలం.. ఇలా తమ క్వాలిటీస్ ను ఢిల్లీ పెద్దల చెవికి తాకేలా ఎవరికి వారు లాబీయింగ్ చేసుకునే పనిలో ఉన్నారు.ఇంత జరగుతున్నా క్యాబినెట్ విస్తరణపై ఢిల్లీ నుండి గ్రీన్ సిగ్నల్ డైలీ సీరియల్ ను తలపిస్తుండటంతో కొందరు బయటికి అసంతృప్తిని వెళ్లగక్కుతుంటే..మరి కొందరు లోలోపలే అసంతృతో రగిలిపోతున్నా.. గాడ్ ఫాదర్లను నమ్ముకుని పెదవి దాటనీయడం లేదు.ఖాళీ ఖజానాతో..కష్టాలకు ఓర్చి పాలన సాగిస్తున్నా.. వీటిని పట్టించుకోకుండా పదవులకోసం, నేతలు ఇంతగా పాకులాడుతారా..? ప్రభుత్వాన్ని ఓన్ చేసుకోకపోతే ఎలా..? ప్రభుత్వం అంటే తానొక్కడినే కాదని సీఎం రేవంత్ ఎమ్మెల్యేలకి నొక్కి చెప్తున్నారట. ఇలాగైతే ఎలా అంటూ సీఎం సైతం అసంతృప్తితో ఉన్నారన్న టాక్ విన్పిస్తోంది.ఇలా మొత్తానికి అధికార పార్టీలో సీఎం రేవంత్ రెడ్డి నుండి మొదలుకొని ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు.. ఇలా అందరిలో..సంతృప్తి లెవల్ తగ్గిపోయి.. అసంతృప్తి జ్వాలలు మాత్రం ఎగిసెగిసి పడుతున్నాయట. మరి వీటికి ఢిల్లీ పెద్దలు ఎలా బ్రేకులు వేస్తారో చూడాలి మరి.

# రేషన్ బియ్యం అమ్ముకుంటే... కష్టాలే



**అదిలాబాద్, మే16( వెలుతురు):**
ప్రభుత్వం పేదల ఆకలి తీర్చడానికి రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుండగా.. కొందరు లబ్ధిదారులు, డీలర్లు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. దొడ్డు బియ్యం పంపిణీలో మొదలైన ఈ అక్రమాలు.. సన్న బియ్యం పంపిణీలోనూ కొనసాగుతున్నాయి. లబ్ధిదారులు బియ్యాన్ని దళారులకు అమ్ముకుంటున్నారు. అధికారులు అక్రమాలకు పాల్పడిన లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేస్తున్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకోవాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. పేద ప్రజల ఆకలి తీర్చాలనే సంకల్పంతో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఎంతో ప్రతిష్టాత్మకంగా సీఎం రేవంత్ రెడ్డి దీనిని సూర్యాపేట జిల్లాలో ఉగాది పర్వదినాన ప్రారంభించారు. దీని ద్వారా ఎంతో మంది పేదలు సంతోషంగా ఉన్నారు.దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం ఇవ్వడంతో.. తమకు ఆర్థికంగా కూడా ఎంతో భరోసా కల్పిస్తున్నట్లు లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో కొందరు మాత్రం అక్రమాలకు పాల్పడుతూ బియ్యాన్ని అమ్మేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మొదట్లో సరఫరా చేసిన దొడ్డు బియ్యంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ అవకతవకలకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో సన్న బియ్యం పంపిణీని ప్రారంభించింది. అయినప్పటికీ.. అక్రమార్కుల తీరు మాత్రం మారలేదు. వారు ఇప్పటికీ అడ్డదారులు వెతుక్కుంటూ, తమ పని కానిచ్చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారుప్రభుత్వం ప్రతి నెల రేషన్ డీలర్లకు సకాలంలో బియ్యం సరఫరా చేస్తుంది. అయితే.. బియ్యం అవసరం లేని లబ్ధిదారులు, రేషన్ డీలర్లు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నారు. బియ్యం వద్దనుకునే లబ్ధిదారులు డీలర్లతో ముందుగానే ఒక అవగాహనకు వస్తారు. లబ్ధిదారులు దుకాణానికి వెళ్ళిన వెంటనే.. డీలర్ వారికి బియ్యం కావాలా, డబ్బులు కావాలా అని అడిగి, ఏదో ఒకటి గుట్టుచప్పుడు కాకుండా సర్దుబాటు చేస్తారు. కొందరు లబ్ధిదారులు బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్ర వేసి డబ్బులు తీసుకుంటున్నారు.దొడ్డు బియ్యం తరహాలోనే సన్న బియ్యంలో కూడా అక్రమాలు కొనసాగుతున్నాయి. సన్న బియ్యం రుచిగా లేవని కొందరు, దొడ్డు బియ్యం తింటేనే కడుపు నిండుతుందని నమ్మే శ్రామికులు వాటిని దళారులకు కిలోకు రూ. 25-30 చొప్పున అమ్ముకుంటున్నారు. ఈ పరిస్థితి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ అక్రమాలలో డీలర్ల తప్పు ఎంత ఉందో, లబ్ధిదారుల ప్రమేయం కూడా అంతే స్థాయిలో ఉందని చెప్పవచ్చు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, వాటిలోని లోపాలు, పర్యవసానాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తే ఇలాంటి అక్రమాలను నివారించవచ్చు.మంచిర్యాల జిల్లా, తాండూరు మండలంలోని అచ్చలాపూర్‌లో.. అధికారులు 11 మంది లబ్ధిదారుల రేషన్ కార్డులను రద్దు చేశారు. వీరు దళారులకు బియ్యం విక్రయించినట్లు గుర్తించారు. ప్రస్తుత పరిస్థితుల్లో.. రేషన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా పరిగణించబడుతోంది. అనేక సంక్షేమ పథకాలకు ఇది ప్రామాణికంగా ఉపయోగపడుతుంది. అలాంటిది రద్దు అయితే.. లబ్ధిదారులు అనేక పథకాలు కోల్పోవాల్సి వస్తుంది. కళ్యాణలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్ళు, పింఛన్లు, ఆదాయ ధ్రువీకరణ పత్రం..ఇతర ముఖ్యమైన పత్రాల కోసం కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.కాబట్టి, లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనకరంగా ఉంటుంది. అక్రమాలకు పాల్పడే రేషన్ డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తామని నిర్మల్ జిల్లా ఇన్ఛార్జి డిఎస్ఓ కోమల్ రెడ్డి హెచ్చరించారు. సంక్షేమ పథకాలను లబ్ధిదారులు తమ కుటుంబ సంక్షేమం కోసం మాత్రమే ఉపయోగించాలని, లబ్ధిదారులు బియ్యం విక్రయిస్తే వారి రేషన్ కార్డులను రద్దు చేయడంతో పాటు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# వివాదాల్లో వేములవాడ రాజన్న ఆలయం



**కరీంనగర్, మే16( వెలుతురు):**
కోరిన కోర్కెలు తీర్చే కోడె మొక్కుల రాజన్న ఆలయం చుట్టూ రాజకీయ వివాదం మొదలైంది. ఆలయ విస్తరణపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కాస్త వేములవాడ బంద్ కు దారి తీసింది. ఆలయాన్ని అభివృద్ధి చేస్తామంటే అభ్యంతరం ఎందుకంటు అధికార పార్టీ విపక్షాలను ప్రశ్నిస్తుంటే..అసలు సర్కార్ నిర్ణయమే తప్పంటున్నారు అఖిల పక్ష నేతలు. ఇంతకీ వేములవాడ రాజన్న ఆలయంపై నెలకొన్న వివాదం ఏంటి? అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెప్తుంది? ప్రతిపక్షాలు చేస్తున్నా డిమాండ్ ఏంటి?భక్తి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే వేములవాడ రాజ రాజేశ్వర స్వామి ఆలయ విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. వచ్చే నెల జూన్ 15 నుంచి విస్తరణ పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. గతేడాది నవంబర్ 20న సీఎం రేవంత్ రెడ్డి ఆలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు 47 కోట్ల రూపాయల నిధులను కూడా మంజురు చేశారు. వేములవాడ ఆలయ విస్తరణ కోసం 2025-2026 బడ్జెట్ లో దాదాపు 100 కోట్లను కేటాయించారు.శృంగేరి పీఠాధిపతుల పర్యవేక్షణలో ఆలయ విస్తరణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆలయ విస్తరణ పనులు చేపడితే..భక్తుల దర్శనాలకు ఇబ్బంది కలగకుండా వేములవాడ ఆలయానికి దగ్గర్లో ఉన్న భీమేశ్వరాలయంలో దర్శనాలను కొనసాగించాలని నిర్ణయించడంపై విపక్ష నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గుడిని మూసేసి విస్తరణ చేపడుతామంటే కుదరదని అఖిల పక్ష నేతలు ఆందోళనలు కొనసాగిస్తుండడంతో రాజన్న ఆలయం చుట్టూ రాజకీయ వివాదం మొదలైంది.వేములవాడ రాజన్నను నిత్యం వేలాది మంది భక్తులు దర్శిచుకుంటారు. ఇక ప్రత్యేక రోజుల్లో అయితే లక్షలాది మంది భక్తులు బారులు తీరుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. దేవాలయ ప్రధాన గర్భాలయం, మండప భాగాన్ని మెరుగు పరిచి, పురాతన నిర్మాణాలకు ఇబ్బంది కలగకుండా చుట్టూ కొత్త మండపాన్ని నిర్మిస్తారు. పాత నిర్మాణాన్ని అనుసరిస్తూ..కొత్త నిర్మాణంతో ఆలయాన్ని విస్తరిస్తారు.ఆలయంతో పాటు ధర్మగుండం, గుడి చెరువు ఇలా మొత్తం 35 ఎకరాల పరిధిలో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఇప్పుడున్న ప్రాకారాలను విస్తరించడంతో పాటు స్వామి వారి కోనేరు, కళ్యాణకట్ట, కోడె మొక్కులు చెల్లించే దారి, అన్నదాన సత్రం, వసతి గృహాలు ఇలా అన్నీ ఒకే కాంప్లెక్స్ లో ఉండేలా ప్రణాళికలు సిద్దం చేశారు. అయితే అన్ని ఒకేసారి కాకుండా దశల వారీగా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.ఆలయ విస్తరణ పనులు దాదాపు ఏడాది పాటు కొనసాగే అవకాశం ఉండడంతో జూన్ నెలలో భీమేశ్వరాలయంలో అభిషేకాలు, అన్నపూజాలు, కోడె మొక్కులు జరిపించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే పునర్నిర్మాణం పేరిట ఆలయాన్ని మూసి వేయోద్దంటు డిమాండ్ చేస్తున్నారు రాజన్న ఆలయ రక్షణ సమితి నాయకులు. రాజన్న ప్రధాన ఆలయంలోనే భక్తులకు అనుమతించి విస్తరణ పనులు చేపట్టాలని విపక్షాలు కోరుతున్నాయి. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లో అన్యమత ప్రార్థనా మందిరాలు లేకుండా చూడాలంటున్నారు బిజెపి నేతలు.బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు బంద్ కు పిలుపునివ్వడంతో ఆలయ విస్తరణ పనులపై విమర్శలు పెరుగుతున్నాయి. అసలు ఆలయాభివృద్ధికి ఎన్ని కోట్లు నిధులు మంజురయ్యాయో, ఏ రకమైన డిజైన్లు ఖరారు చేశారో వెల్లడించకుండా జూన్ 15 నుంచి ఆలయాన్ని మూసి వేస్తామనడంపై బీజేపీ అభ్యంతరాలు వ్యక్తం చేస్తోంది. ఆలయ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదంటున్న బీఆర్ఎస్.. భక్తుల మనోభావాలకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు.ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆలయ అభివృద్ధి పనులు చేపడుతుంటే బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ విస్తరణ పనులు జరిగే సమయంలో స్వామి వారికి నిత్యం జరిగే పూజాకైంకర్యాలన్నీ యధావిధిగానే కొననసాగుతాయాని, ఆలయ మూసివేత ఉండదని స్పష్టం చేస్తున్నారు. రాజన్న ఆలయంలో చేసే పూజలను భీమేశ్వరాలయంలో ఎలా చేస్తారంటూ ప్రతిపక్ష నేతలు ప్రశ్నిస్తున్నారు. గతంలో కాశీ, అయోధ్యలో దర్శనాలకు ఇబ్బంది లేకుండా చూసినట్లుగానే వేములవాడ విస్తరణ పనులు జరగాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇలా అధికార, ప్రతిపక్ష నేతల మధ్య గుడి అభివృద్ధిపై తలో అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండడంతో..రాజన్న ఆలయం చుట్టూ రాజకీయం కొనసాగినట్లవుతోంది.అతిపెద్ద దేవస్థానంగా గుర్తింపు పొందిన వేములవాడ రాజన్న ఆలయంలో 1979లో జరిగిన పనులే తప్ప మళ్లీ ఇప్పటివరకు ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదు. రాజన్న ఆలయానికి భక్తుల సంఖ్య పెరగడం, ఆలయం ఇరుకుగా ఉండడంతో కొన్నేళ్లుగా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015 జూన్ 18న సీఎం హెూదాలో వేములవాడ రాజన్నను దర్శించుకున్న కేసీఆర్..ప్రతీ బడ్జెట్?లో 100 కోట్ల చొప్పున మొత్తం 400 కోట్లతో వేములవాడ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు.ఆ తర్వాత వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ-వీటీడీఏని ఏర్పాటు చేశారు. కానీ ఆలయంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాన్ని విస్తరించాలని నిర్ణయించింది. అయితే విపక్షాల అభ్యంతరాల నేపథ్యంలో ఆలయ విస్తరణ పనులు ఎలా కొనసాగుతాయో అన్న ఉత్కంఠ నెలకొంది. మరి భగవంతునికి..భక్తునికి ఇబ్బంది లేకుండా దర్శనాలు ఎలా జరుగుతాయో అనేది చూడాలి.

# సుప్రీం జడ్జి జస్టిస్ బేలా త్రివేది పదవీవిరమణ

- ఎలాంటి ఫేర్‌వెల్ లేకుండా సాదాసీదాగా ముగిసిన ప్రస్థానం



**న్యూఢిల్లీ, మే16( వెలుతురు):**

సుప్రీంకోర్టులో జడ్జిగా విధులు నిర్వర్తించిన జస్టిస్ బేలా ఎం త్రివేది శుక్రవారం పదవీవిరమణ చేశారు. సుప్రీంకోర్టులో ఆమె మూడున్నర ఏళ్ల పాటు జడ్జిగా విధులు నిర్వర్తించారు. సుప్రీంకోర్టులో జడ్జిగా చేసిన 11వ మహిళగా ఆమె కీర్తికెక్కారు. 1995 జూలైలో గుజరాత్‌లోని ట్రయల్ కోర్టు నుంచి ఆమె జర్నీ స్టార్ట్ అయ్యింది. సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక కీలక తీర్పుల్లో బేలా త్రివేది పాత్ర ఉన్నది. బేలా త్రివేది జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన కోర్టులోనే.. ఆమె తండ్రి కూడా జడ్జిగా ఉన్నారు. ఈ విషయం అప్పట్లో చర్చనీయాంశమైంది. లిమ్కా బుక్ ఆఫ్ ఇండియన్ రికార్డుల్లోకి కూడా ఆమె ఎక్కారు. 2021, ఆగస్టు 31వ తేదీన అత్యున్నత న్యాయస్థానం బేలా త్రివేదిని జడ్జిగా ప్రమోషన్ కల్పించారు. ఆ సమయంలో మొత్తం 9 మంది కొత్త జడ్జీలను ప్రకటించారు. ముగ్గురు మహిళల్లో ఈమె ఒకరు. వెనుకబడిన తరగతుల వారికి 10 శాతం కోటా ఇవ్వాలని తీర్పు ఇచ్చిన అయిదుగురు సభ్యుల ధర్మాసనంలో బేలా త్రివేది ఉన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటు- చేసిన ఏడుగురు సభ్యుల ధర్మాసనంలోనూ ఆమె ఉన్నారు. ఎస్సీ జాబితాలో మార్పులు చేయంటే అది పార్లమెంట్ ద్వారే చేయాలని ఆమె ఓ 85 పేజీల నివేదిక తయారు చేసింది. పోక్సో చట్టానికి చెందిన ఓ కేసులో కీలక తీర్పు ఇచ్చారు. కామవాంఛతో మైనర్లను తాకితే అది లైంగిక దాడి అవుతుందని 2021లో తీర్పు ఇచ్చిన బెంచ్‌లో ఆమె ఉన్నారు. గుజరాత్‌లోని పటాన్‌లో 1960, జూన్ 10వ తేదీన ఆమె జన్మించారు. గుజరాత్ హైకోర్టులో ఆమె పదేళ్ల పాటు- లాయర్గా ప్రాక్టీస్ చేశారు. 1995, జూలై 1వ తేదీన అహ్మదాబాద్‌లోని సెషన్స్ కోర్టులో జడ్జిగా నియమించారు. హైకోర్టులో రిజిస్ట్రార్ విలిలెన్స్, గుజరాత్ సర్కారులో న్యాయ కార్యదర్శిగా చేశారు. రిటైర్మెంట్ సందర్భంగా సుప్రీకోర్టు న్యాయవాదుల సంఘాలు ఎటువంటి ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని ఏర్పాటు- చేయలేదు. దీని పట్ల విమర్శలు వస్తున్నాయి. సీజేఐ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మాషి.. లాయర్ సంఘాలను తప్పుపట్టారు. సాధారణంగా సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్, సుప్రీంకోర్టు అడ్వకేట్స్ ఆన్ రికార్డు అసోసియేషన్ సంఘాలు వీడ్కోలు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తుంటాయి. అయితే జస్టిస్ బేలా త్రివేది రిటైర్మెంట్ గురించి మాత్రం ఆ సంఘాలు ఎటువంటి నోటిఫికేషన్ ఇవ్వలేదు.

# భారత్ సిందూర్ ఆపరేషన్ భేష్

- పాక్‌లో ఎక్కడైనా దాడిచేయగల సమర్థత
- అమెరికా రక్షణ రంగ నిపుణుడు జాన్ స్పెన్సర్



**న్యూయార్క్, మే16( వెలుతురు):**

ఉగ్రవాదాన్ని పోత్సహిస్తున్న పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'ను అమెరికా రక్షణ రంగ నిపుణుడు జాన్ స్పెన్సర్ సమర్థించారు. పాక్‌పై భారత్ దాడి, రక్షణాత్మక ఆధిపత్యాన్ని ప్రదర్శించిందన్నారు. ఈ ఆపరేషన్‌తో పాకిస్థాన్‌లోని ఏ ప్రదేశంలోనైనా ఎప్పుడైనా దాడి చేయగలమన్న సందేశాన్ని దాయాదికి పంపిందన్నారు. ప్రముఖ జాతీయ మీడియా ఇండియా టుడేకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జాన్ స్పెన్సర్ మాట్లాడుతూ.. భారత రక్షణ వ్యవస్థలతో పోలిస్తే చైనా, పాక్ ఎయిర్ డిఫెన్స్ చాలా బలహీనమని అభిప్రాయపడ్డారు. భారత్ సామర్థం ముందు అవి ఎందుకూ పనికిరావన్నారు. 'అటు- దాడికి అవసరమైన దూకుడును, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని భారత్ చూపించింది. పాక్ డ్రోన్ దాడులు, హై-స్పీడ్ క్షిపణులను ఎదుర్కోవడంతో సహా తనను తాను విజయవంతంగా రక్షించుకోవడంలో భారత్ విజయవంతమైంది. పాక్‌ను ఎప్పుడైనా, ఎక్కడైనా దెబ్బ కొట్టగలమని నిరూపించింది. భారత్‌పై దాడికి చైనా వైమానిక రక్షణ వ్యవస్థను పాక్ ఉపయోగించింది. అవి ఘోరంగా విఫలమయ్యాయి. భారత సామర్థం ముందు అవి నిలువలేకపోయాయి. భారతదేశ అధునాతన సైనిక సామర్థ్యానికి బ్రహ్మోస్ క్షిపణి నిదర్శనం. చైనా, పాక్ వైమానిక రక్షణ వ్యవస్థలను బ్రహ్మోస్ ధ్వంసం చేసేసింది' అంటూ భారత్ సామర్థ్యాన్ని కీర్తించారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాక్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్‌తో గట్టి బదులు తీర్చుకున్న విషయం తెలిసిందే. దీనికి ప్రతిదాడిగా మే 10న భారత సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇస్లామాబాద్ డ్రోన్, క్షిపణి దాడులకు యత్నించింది. దీంతో భారత్ పాక్ భూభాగంలోని 11 వైమానిక స్థావరాలపై దాడి చేసింది. ఈ దాడులకు భారత్ 'బ్రహ్మోస్' క్షిపణులను వాడింది.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

**విజయనగరం, మే16( వెలుతురు):**

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలసలో చోటు-చేసుకుంది.. వివరాలలోకి వెళితే.. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోదవలస జాతీయ రహదారిపై గోర్లె సురేష్, రావాడ వెంకట్రావు అనే ఇద్దరు యువకులు బైక్ పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో యువకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు యువకుల మృతదేహాలను పోస్ట్ మార్టమ్ నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.




# ఖర్గేను దళిత ప్రధాని చేస్తామని అనగలరా

- రాహుల్ చెబితే బిసి గణన అనడంలో అర్థం
- ఖర్గే కులగణన చేయాలని చెప్పలేదా
- రాహుల్‌నే ఎందుకు ప్రధాని చేస్తామంటున్నారు
- రేవంత్ వ్యాఖ్యలను తిప్పికొట్టిన కొప్పుల ఈశ్వర్



**కరీంనగర్, మే16( వెలుతురు):**

బీఆర్ఏస్ పగ్గాలు దళితునికి ఇవ్వాలంటున్న రేవంత్ రెడ్డి.. ఖర్గేను ప్రధాని చేస్తామని ఎందుకు అనడం లేదని.. రాహుల్ గాంధీనే పిఎం చేస్తామని ఎందుకు అంటున్నారని బిఆర్ఎస్ నేత,మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. రాహుల్ నాయకత్వంలో పని చేద్దామని రేవంత్ అంటారే తప్ప ఖర్గే నాయకత్వం గురించి మాట్లాడతారా అని అడిగారు. ఖర్గే దళితుడు కనుకనే ఆయనకు విలువ ఇవ్వడం లేదని అన్నారు. కులగణన రాహుల్ చెబితే చేశామని అంటాడు తప్ప ఖర్గే సూచనలతో అని ఎపుడైనా రేవంత్ అన్నాడా అని ప్రశ్నించారు. 50 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు కుల గణన ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావుపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్రంగా ఖండించారు. తమ నేతలను బిల్లా రంగా అని సంబోధించడం ద్వారా రేవంత్ రెడ్డి సీఎం పదవి స్థాయిని తగ్గించారని ఆరోపించారు. బిల్లా రంగాల చేష్టలు రేవంత్ రెడ్డివే అని విమర్శించారు. బిల్లా రంగాల స్థాయిని కూడా రేవంత్ రెడ్డి ఎప్పుడో దాటిపోయారని.. చార్లెస్ శోభరాజ్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం కొప్పుల ఈశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. పాలన చేతగాక పనికిరాని మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయ పార్టీల నాయకత్వం అనేది వాటి అంతర్గత వ్యవహారమని కొప్పుల ఈశ్వర్ అన్నారు. మహేశ్ కుమార్ గౌడ్‌ను పీసీసీ అధ్యక్షుడిగా మమ్మల్ని అడిగి చేశారా అని నిలదీశారు. ఆయన్ను ఎందుకు పీసీసీ అధ్యక్షుడిని చేశారు.. ఆ పదవి దళితుడికి ఎందుకు ఇవ్వలేదని మేమైనా అడిగామా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల మనోభావాలకు అనుగుణంగా పని చేసే పార్టీ అని.. ఎవరైతే తెలంగాణ ప్రజలకు ఎక్కువ మేలు జరుగుతుందో వారినే బీఆర్ఎస్ ఎంచుకుంటు-ందని స్పష్టం చేశారు. 2014కి ముందు దళిత ముఖ్యమంత్రి అని అన్నారని.. అప్పటికీ మేం అధికారంలోకి రాలేదని.. విజయ రామారావును బీర్ఎస్ ఎ÷-లోర్ లీడర్‌గా నియమించారని గుర్తుచేశారు. వచ్చిన తెలంగాణ రాష్ట్రాన్నిఅభివృద్ధి చేసే విజన్‌ను సిద్ధం చేసుకున్న కేసీఆర్ సీఎం అయితేనే మంచిది అనుకుని పార్టీ తెలంగాణ ముక్త కంఠంతో నిర్ణయం తీసుకుందని తెలిపారు. అందుకే దళితుడు సీఎం కాలేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం కొత్తగా వచ్చిన రాష్ట్రం కనుక కేసీఆర్ తప్ప ఎవ్వరు సీఎం అయినా రాష్ట్రానికి నష్టం జరిగేదని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయినంక రాష్ట్ర పరిస్థితి ఏమైందో చూస్తునే ఉన్నామని అన్నారు. ఖర్గే ఏఐసీసీ డమ్మీ అధ్యక్షుడు అని.. నడిపేదంతా రాహుల్ గాంధీ అని జనానికి తెలియదా అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ జపం తప్ప ఇంకేమైనా ఉందా అని ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంకలకు ఏ హోదా ఉన్నదని గత ఎన్నికల్లో డిక్లరేషన్లను వారితో రేవంత్ రెడ్డి ప్రకటింపజేశారని అడిగారు. హామీల అమలుకు తమది గ్యారంటీ అని వాళ్ళు ఎలా చెప్పారని కొప్పుల ప్రశ్నించారు.

# హాంకాంగ్, సింగపూర్‌లో కోవిడ్ కేసుల




**న్యూఢిల్లీ, మే16( వెలుతురు):**

ఆసియా ఖండంలో కోవిడ్-19 మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. హాంకాంగ్, సింగపూర్ వంటి జనసాంద్రత అధికంగా ఉన్న నగరాల్లో కేసులు వేగంగా పెరుగుతున్నాయి. వేడి వాతావరణం సానుకూలంగా ఉన్నప్పటికీ, వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. దీనితో ఆరోగ్య అధికారులు అప్రమత్తమయ్యా రు. ఈ కొత్త వేవ్‌తో ఆసుపత్రుల్లో చేరికలు, తీవ్రమైన కేసులు, కొన్ని ప్రాంతాల్లో మరణాలు కూడా నమోదవుతున్నాయి. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులు బూస్టర్ డోసులు తీసుకోవాలని, ప్రజలు తమ టీకాలను తాజాగా ఉంచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. హాంకాంగ్‌లో కోవిడ్-19 కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి, ఇది 7 మిలియన్లకు పైగా జనాభా ఉన్న ఈ నగరంలో ఆందోళన కలిగిస్తోంది. హాంకాంగ్ సెంటర్ ఫర్ హెల్త్ ప్రొటెక్షన్ (సీహెచ్‌పీ) కమ్యూనికబుల్ డిసీజ్ బ్రాంచ్ చీఫ్ ఆల్బర్ట్ ఆయు ప్రకారం, మే 3 నుంచి ఒక వారంలో కోవిడ్ పాజిటివిటీ రేటు ఈ ఏడాదిలో అత్యధిక స్థాయికి చేరింది. ఈ వారంలో 31 తీవ్రమైన కేసులు, మరణాలతోసహా నమోదయ్యాయి. ఇది గత రెండేళ్లతో పోలిస్తే తక్కువ అయినప్పటికీ, వైరల్ లోడ్, ఆసుపత్రిలో చేరికలు గణనీయంగా పెరిగాయి. జనసాంద్రత అధికంగా ఉన్న ఈ నగరంలో వైరస్ వ్యాప్తి వేగంగా ఉండటం, సామాజిక దూరం, మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలను తిరిగి అమలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు.సింగపూర్‌లో కూడా కోవిడ్-19 కేసులు గణనీయంగా పెరుగుతున్నాయి. మే 3 నుంచి ఒక వారంలో కేసుల సంఖ్య 28% పెరిగి 14,200కు చేరగా, రోజువారీ ఆసుపత్రి చేరికలు 30% పెరిగాయి. సింగపూర్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ దాదాపు ఒక సంవత్సరం తర్వాత ఈ డేటాను విడుదల చేసింది, జనాభాలో రోగనిరోధక శక్తి తగ్గడం, కొత్త వేరియంట్లు వంటి కారణాలు ఈ పెరుగుదలకు దోహదపడినట్లు తెలిపింది. అయితే, 2020-21 మహమ్మారి సమయంలో కంటే తీవ్రమైన కేసులు లేదా విస్తృత వ్యాప్తి సూచనలు లేవని స్పష్టం చేసింది. సింగపూర్ అధికారులు ప్రజలను బూస్టర్ డోసులు తీసుకోవాలని, రద్దీ ప్రదేశాల్లో మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. చైనాలో కూడా కోవిడ్ కేసులు పెరుగుతున్నాయి, దీనిని చైనీస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీసీడీసీ) నిశితంగా గమనిస్తోంది. మే 4 వరకు ఐదు వారాల్లో ప్రధాన ఆసుపత్రులలో పాజిటివిటీ రేటు రెట్టింపు కంటే ఎక్కువగా పెరిగింది. ఇది గత వేసవిలో నమోదైన గరిష్ఠ స్థాయివైపు సాగుతోంది. చైనా యొక్క జీరో-కోవిడ్ విధానం ముగిసినప్పటికీ, కొత్త వేరియంట్ల వ్యాప్తి, రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల కేసులు పెరుగుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. చైనా అధికారులు టీకా కార్యక్రమాలను ముమ్మరం చేయడం, ఆసుపత్రి సౌకర్యాలను సిద్ధం చేయడం వంటి చర్యలను చేపడుతున్నారుఈ కొత్త వేవ్ సామాజిక, ఆర్థిక రంగాలపై కూడా ప్రభావం చూపుతోంది. హాంకాంగ్ గాయకుడు ఈసన్ చాన్ కోవిడ్ బారిన పడటం వల్ల తైవాన్‌లోని కావోసియుంగ్‌లో షెడ్యూల్ అయిన కచేరీలను రద్దు చేయాల్సి వచ్చింది, ఇది సాంస్కృతిక కార్యక్రమాలపై వైరస్ ప్రభావాన్ని చూపిస్తుంది. సింగపూర్‌లో ఆసుపత్రి చేరికలు పెరగడం వల్ల ఆరోగ్య వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది, ఇది ఆర్థిక కార్యకలాపాలపై, ముఖ్యంగా పర్యాటకం, వాణిజ్య రంగాలపై ప్రభావం చూపవచ్చు. చైనాలో కేసుల పెరుగుదల, సప్లై చైన్‌లపై, అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది, ఎందుకంటే చైనా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తుంది.ఈ కొత్త వేవ్‌ను ఎదుర్కొనేందుకు ఆరోగ్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు.బూస్టర్ డోసులు: 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తప్పనిసరిగా బూస్టర్ షాట్లు తీసుకోవాలి. హాంకాంగ్, సింగపూర్‌లో టీకా కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. రద్దీ ప్రదేశాల్లో మాస్క్ ధరించడం, సామాజిక దూరం పాటించడం వైరస్ వ్యాప్తిని తగ్గిస్తుంది.ఆసుపత్రి సన్నద్ధత: ఆసుపత్రులు అదనపు బెడ్స్, వెంటిలేటర్లు, ఆక్సిజన్ సరఫరాను సిద్ధం చేస్తున్నాయి.పరీక్షలు: స్వీయ-పరీక్ష కిట్లు, రెగ్యులర్ ఆర్‌టీ-పీసీఆర్ టెస్టింగ్‌ను పెంచడం ద్వారా కేసులను త్వరగా గుర్తించవచ్చు.భారత్‌లో ప్రస్తుతం కోవిడ్ కేసులు తక్కువగా ఉన్నప్పటికీ, ఆసియాలోని ఈ పరిణామాలు భారత ఆరోగ్య వ్యవస్థను అప్రమత్తం చేస్తున్నాయి. భారత్ 2020-2022లో కోవిడ్ మహమ్మారి సమయంలో గణనీయమైన నష్టాన్ని చవిచూసింది, దీనివల్ల టీకా కార్యక్రమాలు, ఆసుపత్రి సౌకర్యాలను మరింత బలోపేతం చేయడం అవసరం. భారత్‌లో కోవాక్సిన్, కోవిషీల్డ్ వంటి టీకాలు విస్తృతంగా అందుబాటులో ఉన్నాయి. కానీ బూస్టర్ డోసులపై ప్రజల్లో అవగాహన పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో టెస్టింగ్ సౌకర్యాలను మెరుగుపరచడం కీలకం.

# పాకిస్తాన్ కు తలనొప్పిగా మారిన బెలూచిస్తాన్




**లాహోర్, మే16( వెలుతురు):**

పాక్‌కు బలూచ్ ఆర్మీ మరింత తలనొప్పులు తెస్తోంది. పాకిస్తాన్ చేతుల్లో నుంచి బలూచిస్తాన్ జారిపోతోంది. వరుస దాడులతో పాక్ ఆర్మీ బెంబేలెత్తిపోతోంది. గత కొన్ని రోజులుగా బలూచిస్తాన్‌లో నాన్‌స్టాప్ వార్ జరుగుతోంది. పాక్ సైన్యాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ తరుముతోంది. బలూచిస్తాన్‌లో పలు చోట్ల పాక్ ఆర్మీపై దాడులు చేస్తోంది. పాక్ పోలీస్ స్టేషన్లను స్వాధీనం చేసుకుని, హైవేలను నిర్బంధించింది. పాకిస్తాన్ పోలీసులను ఖైదు చేసింది. పాక్ ఆర్మీ ఇన్‌ఫార్మర్లను ఫైటర్లు అదుపులోకి తీసుకుంటున్నారు. పాక్ బలగాలపై ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు. బాంబులతో పాక్ ఆర్మీ వాహనాలను పేల్చివేస్తున్నారు.కోటిన్నర జనాభా ఉన్న బెలూచిస్తాన్.. పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రాంతం. బొగ్గు. బంగారం లాంటి ఖరీదైన ఖనిజ నిక్షేపాలతో పాటు సహజవాయు నిల్వలు అపారంగా ఉన్నా.. తమకు ప్రయోజనాలు దక్కడం లేదనేది స్థానికుల వాదన. పైగా.. పాకిస్తాన్ ప్రభుత్వం తమపై రాజకీయంగా కక్ష తీర్చుకుంటోందన్న ఆవేదన. వీళ్ల కడుపుమంట నుంచి పుట్టిందే బలూచ్ లిబరేషన్ ఆర్మీ.. బీఎల్ఏ. పాకిస్తాన్ నుంచి విడదీసి బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో పాతికేళ్ల కింద ఏర్పాటైన వేర్పాటువాద సంస్థ. పాకిస్తాన్-ఇరాన్ మధ్య విభజించిన ఇరానియన్ జాతి సమూహం. బలూచ్-నివాస ప్రావిన్సులు కేంద్ర ప్రభుత్వాలకు నిరంతరం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. సాయుధ స్వాతంత్ర్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.పుట్టింది ఆఫ్ఘన్ నగరం కాందహార్‌లో.. నలుగురితో మొదలై ఇప్పుడు 600 మంది సాయుధులతో మిలిటెంట్ ఆర్గనైజేషన్‌గా ఎదిగింది. మొదట్లో ఆఫ్ఘన్ నుంచే ఎటాకింగ్ షురూచేసేది. తర్వాత పాకిస్తాన్ లోపలికి జొరబడి బెలూచ్ నడిగడ్డ మీద నుంచే సవాల్ విసురుతోంది. ఇప్పుడు పాకిస్తాన్ మిలిటరీకి సమఉజ్జీగా మారి.. ఆ దేశ పాలకుల కంట్లో నలుసుగా మారింది. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల్లో అత్యంత కీలకమైంది బెలూచ్ తిరుగుబాటు బెడద. "పాకిస్తాన్ ఒక వికృతమైన భావజాలమున్న న్యూక్లియర్ కంట్రీ.. ఐసిస్ లాంటి గ్లోబల్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌కు పాలు పోసి పెంచుతోంది.. ఈ మొత్తం ప్రోగ్రామ్ ఐఎస్ఐ కనుసన్నల్లోనే డిజైనౌతోంది.. మేమైతే సైలెంట్‌గా చూస్తూ కూర్చునేవాళ్లం కాదు%ా% 51 చోట్ల 71 సార్లు దాడులు చేశాం.. ఇప్పుడే సినిమా ఐపోలేదు.." అని పాకిస్తాన్ ఒరిజినల్ షేప్‌ను ప్రపంచానికి చాటి చెబుతోంది బెలూచ్ లిబరేషన్ ఆర్మీ.అది 1540 సంవత్సరం, భారతదేశపు మొట్టమొదటి మొఘల్ పాలకుడు బాబర్ కుమారుడు హుమాయున్, బీహార్‌కు చెందిన షేర్ షా సూరి చేతిలో ఓడిపోయాడు. హుమాయున్ భారతదేశం నుండి పారిపోయాడు. అతను పర్షియాలో అంటే ఇరాన్‌లో ఆశ్రయం పొందాడు. షేర్ షా సూరి 1545లో మరణించాడు. అవకాశాన్ని గ్రహించి, హుమాయున్ భారతదేశానికి తిరిగి రావాలని ప్రణాళిక వేయడం ప్రారంభించాడు. అప్పుడు బలూచిస్తాన్ గిరిజన నాయకులు ఈ ప్రణాళికలో అతనికి సహాయం చేశారు. బలూచ్‌ల మద్దతుతో, హుమాయున్ 1555లో ఢిల్లీపై తిరిగి నియంత్రణ సాధించాడు.1659 సంవత్సరం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ఢిల్లీ పాలకుడు అయ్యాడు. అతని అధికారం పశ్చిమాన ఇరానియన్ సరిహద్దు వరకు విస్తరించింది. కానీ దక్షిణాన అతను నిరంతరం మరాఠాల నుండి సవాళ్లను ఎదుర్కోవలసి వచ్చింది. మరోవైపు బలూచి అధిపతులు మొఘల్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. బలూచి నాయకుడు మీర్ అహ్మద్ 1666లో ఔరంగజేబు నుండి బలూచిస్తాన్‌లోని రెండు ప్రాంతాలు - కలాట్, క్వెట్టాను స్వాధీనం చేసుకున్నాడు. నేడు బలూచిస్తాన్ ఉన్న ప్రదేశం చరిత్ర దాదాపు 9 వేల సంవత్సరాల నాటిది. ఆ సమయంలో ఇక్కడ మెహర్‌గఢ్ ఉండేది. ఇది సింధు లోయ నాగరికతలో ఒక ప్రధాన నగరం. దాదాపు 3 వేల సంవత్సరాల క్రితం సింధు లోయ నాగరికత ముగిసినప్పుడు, ఇక్కడి ప్రజలు సింధ్, పంజాబ్ ప్రాంతాలలో స్థిరపడ్డారు. దీని తరువాత ఈ నగరం వేద నాగరికత ప్రభావానికి లోనైంది.ఇక్కడ హిందువుల ప్రధాన శక్తి పీఠాలలో ఒకటి - హింగ్లాజ్ మాతా ఆలయం, దీనిని పాకిస్తాన్‌లో నాని కా హజ్ అని కూడా పిలుస్తారు. కాలక్రమేణా ఈ నగరం బౌద్ధమతానికి ప్రధాన కేంద్రంగా కూడా మారింది. ఏడవ శతాబ్దంలో అరబ్ ఆక్రమణదారులు ఈ ప్రాంతంపై దాడి చేసినప్పుడు, ఇక్కడ ఇస్లాం ప్రభావం పెరిగింది. బలూచిస్తాన్ పాకిస్తాన్‌లో అతిపెద్ద రాష్ట్రం, దాని భూభాగంలో 44 శాతం ఆక్రమించింది. జర్మనీ పరిమాణంలో ఉన్నప్పటికీ, దాని జనాభా కేవలం 15 మిలియన్లు, ఇది జర్మనీ కంటే 70 మిలియన్లు తక్కువ. బలూచిస్తాన్ చమురు, బంగారం, రాగి మరియు ఇతర గనులతో సమృద్ధిగా ఉంది. ఈ వనరులను ఉపయోగించడం ద్వారా పాకిస్తాన్ తన అవసరాలను తీర్చుకుంటుంది. అయినప్పటికీ, ఈ ప్రాంతం అత్యంత వెనుకబడింది. బలూచిస్తాన్‌లో పాకిస్తాన్‌పై ద్వేషం పెరగడానికి ఇదే కారణం. పాకిస్తాన్ ఆక్రమణ తర్వాత బలూచిస్తాన్‌లో ఐదు ప్రధాన తిరుగుబాట్లు జరిగాయి. ఇటీవలి తిరుగుబాటు 2005లో ప్రారంభమై నేటికీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే భారత్ సహా మిగతా దేశాల మద్దతును కూడదీసుకుని.. పాకిస్తాన్ పాలకుల్ని కార్నర్ చేయాలన్నది బీఎల్ఏ స్కెచ్చులా కనిపిస్తోంది. ఈ పాచిక కనుక పారితే.. ఆసియా ఖండంలో కొత్త దేశంగా బెలూచిస్తాన్ జెండా ఎగరడం ఖాయం. ఇది మాత్రం పక్కా..!

# అమెజాన్ ప్రైమ్‌లో అర్జున్ సన్నాఫ్ వైజయంతి

నటులు కల్యాణ్ రామ్, విజయశాంతి కలిసి నటించిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి చిత్రం తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఏప్రిల్ 18న థియేటర్లలో విడుదలైంది. తల్లి కొడుకుల అనుబంధం, యాక్షన్ ప్రధానంగా సాగిన ఈ సినిమాకు థియేటర్లలో మిశ్రమ స్పందన లభించింది. అయితే ఈ సినిమా ఇటీవల రెంటల్ విధానంలో ప్రముఖ ఓటీటీ- వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి వచ్చిన విషయం తెలిసిందే. రెంటల్ రావడంతో సినిమా చూద్దం అనుకున్న ప్రేక్షకులకు నిరాశ ఎదురైంది. అయితే తాజాగా ఈ సినిమాను రెంటల్ నుంచి తొలగించి ఫ్రీగా అందుబాటులోకి తీసుకోచ్చారు. ప్రైమ్ చందదారులు ఈ సినిమాను ఉచితంగా చూడవచ్చు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. వైజయంతి (విజయశాంతి) అనే నిజాయితీగల ఐపీఎస్ అధికారి చుట్టూ తిరుగుతుంది. ఆమెకు అర్జున్ (కళ్యాణ్ రామ్) అనే ఒకే ఒక్క కొడుకు ఉంటాడు. అర్జున్‌ను ఎలాగైనా ఐపీఎస్ అధికారిగా చూడాలనేది వైజయంతి కల. దాని కోసం ఆమె అతన్ని ఐపీఎస్ చదివించి శిక్షణ కోసం ఢిల్లీకి పంపుతుంది. ఏడాది శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి రావాల్సిన అర్జున్, వెళ్లిన ఐదో రోజే తిరిగి వస్తాడు. అందుకు కారణం అతని తండ్రి మరణం. నావికాదళ అధికారి అయిన అతని తండ్రి సముద్రంలో జరిగిన ప్రమాదంలో మరణించాడని పోలీసులు చెబుతారు. అయితే నిజానికి అర్జున్ తండ్రి మరణానికి కారణం ప్రమాదం కాదు, అది ఒక హత్య. ఆ విషయం తెలుసుకున్న అర్జున్, తన తండ్రిని చంపిన వారిపై పగ తీర్చుకోవాలనుకుంటాడు. కానీ వైజయంతి అతన్ని వారించి, చట్ట ప్రకారం దోషులకు శిక్ష పడేలా చూస్తానని చెబుతుంది. అంతేకాకుండా, అర్జున్‌ను ఐపీఎస్ పూర్తి చేయమని చెప్పి మళ్లీ శిక్షణకు పంపిస్తుంది. ఒక సంవత్సరం తర్వాత అర్జున్ శిక్షణ పూర్తి చేసుకుని తిరిగి వస్తాడు. అదే రోజు అతని తండ్రి కేసు యొక్క తీర్పు వెలువడుతుంది. అర్జున్ తండ్రిది హత్య కాదని, అది ప్రమాదవశాత్తు జరిగిందని కోర్టు తీర్పు ఇస్తుంది. హంతకులు కోర్టు నుండి బయటకు వస్తూనే వైజయంతిని అవమానకరంగా మాట్లాడుతారు. అన్యాయం ముందు చట్టం మరియు న్యాయం ఓడిపోవడం అర్జున్ కళ్లారా చూస్తాడు. తన కళ్ల ముందే తల్లిని అవమానిస్తుంటే అతను తట్టు-కోలేకపోతాడు. అతని కోపం కట్టలు తెంచుకుంటుంది. కోర్టు ఎదురుగానే ఒక హంతకుడిని కొట్టి చంపేస్తాడు. అంతేకాదు, తన తండ్రి హత్యకు కారణమైన ముఠాలోని 41 మందిని నరికి చంపుతాడు. ఐపీఎస్ కావాల్సిన కొడుకు తన కళ్ల ముందే హంతకుడిగా మారడం చూసిన వైజయంతి దిగ్భ్రాంతికి గురవుతుంది. గూండాగా మారిన కొడుకుతోనే యుద్ధానికి సిద్ధమవుతుంది. మరి విధి వేరు చేసిన ఈ తల్లి కొడుకులు మళ్లీ ఎలా కలిశారు? ఐపీఎస్ అవ్వాల్సిన అర్జున్ గూండాగా మారి ఏమి సాధించాడన్నది మిగతా కథ.




## ఎన్టీఆర్ నెగెటివ్ షేడ్‌లో వార్-2

### 20న టీఈజర్ విడుదలకు సన్నాహాలు

:బాలీవుడ్‌లో ఇదివరకు సంచలన విజయం అందుకున్న యాక్షన్ స్పై థ్రిల్లర్ 'వార్'కు సీక్వెల్‌గా రాబోతున్న చిత్రం 'వార్ 2'. 2019లో విడుదలైన మొదటి భాగంలో హృతిక్ రోషన్, టైగర్ ష్రాఫ్ యాక్షన్ సీన్స్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేశారు. ఇప్పుడు ఈ సీక్వెల్‌కి మరింత క్రేజీగా రూపొందించడానికి పాన్ ఇండియా స్టార్ ఎన్టీఆర్ రంగంలోకి దిగాడు. ఇది ఎన్టీఆర్‌కి బాలీవుడ్‌లో తొలి చిత్రం కావడంతోనే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని 'బ్రహ్మాస్త్ర' వంటి విజువల్ వండర్‌ని తెరపైకి తీసుకొచ్చిన అయాన్ ముఖర్జీ డైరెక్ట్ చేస్తున్నారు. యశ్ రాజ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రానికి సరికొత్త మేకింగ్ కథాంశం ఉండబోతున్నట్లు సమాచారం. ఈ సినిమాలో ఎన్టీఆర్ పాత్ర ఎలా ఉండబోతుందనేది అభిమానుల్లో పెద్ద క్యూరియాసిటీగా మారింది. కొన్ని లీకుల ప్రకారం, ఆయన నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారని, అయితే అది పూర్తిగా విలన్ కాదని.. గ్రే షేడ్స్ కలిగిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని సమాచారం. కొత్త లుక్‌లో ఎన్టీఆర్ స్క్రీన్‌పై ఎలా కనిపిస్తాడన్నదే ఇప్పుడు ప్రధాన చర్చాంశం. ఇక ఈ సినిమాకు సంబంధించి టీజర్ విషయానికి వస్తే.. ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 సందర్భంగా చిత్ర యూనిట్ రిలీజ్ చేయాలనే ప్లాన్‌లో ఉంది.



## హరిహరవీరమల్లు.. జూన్ 12న విడుదల

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న భారీ చిత్రం హరి హర వీరమల్లు. ఈ సినిమా విడుదల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభిమానులకు ఎట్టకేలకు శుభవార్త అందింది. అన్ని అడ్డంకులను దాటుకొని జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతుంది. ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామాకు సంబంధించిన మొత్తం షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ చిత్రం పాన్‌ఇండియా స్థాయిలో విడుదల అవుతుంది. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పెద్దెత్తున విడుదల కానుంది. అమెజాన్ ప్రైమ్ దీని డిజిటల్ రైట్స్‌ను భారీ ధరకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ హరి హర వీరమల్లు సినిమా గత కొన్నేళ్లుగా ఆలస్యమవుతూ వచ్చింది. హీరో పవన్ కళ్యాణ్ రాజకీయాల కారణంగా ఈ సినిమా షూటింగ్ నిరవధికంగా ఆగిపోవడంతో ఆలశ్యం అయ్యింది. కానీ ఎట్టకేలకు పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్ లో పాల్గొని పూర్తి చేశారు. మే 6, 2025న సినిమా చిత్రీకరణ ముగిసినట్లు- నిర్మాతలు ప్రకటించారు. గతంలో ఈ సినిమా మార్చి 28, మే 9 తేదీలలో విడుదల అవుతుందని పలు వార్తలు వచ్చినా.. పలు కారణాల వల్ల వాయిదా పడింది.




## రామాయణంలో మండోదరిగా కాజల్ ?

టాలీవుడ్, బాలీవుడ్‌లో తనదైన ముద్ర వేసిన ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే చాలా రోజుల తర్వాత సత్యభామ అంటూ ఇటీ-వల ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ అందుకుంది. అయితే ఈ భామ తాజాగా మరో బంఫరాఫర్ కొట్టినట్లు- తెలుస్తుంది. బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం రామాయణలో కాజల్ ఛాన్స్ కొట్టేసినట్లు- తెలుస్తుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమాలో కాజల్ రావణుడి భార్య మండోదరి పాత్రలో కనిపించనున్నారు. నితీష్ తివారి 'రామాయణ' ప్రాజెక్ట్ అనౌన్స్ చేసినప్పటి నుంచి నటీనటుల ఎంపికపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి ఖరారయ్యారు. ఇప్పుడు మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ను ఎంపిక చేసినట్లు- వార్తలు వస్తున్నాయి. కాజల్ అగర్వాల్ తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. ఆమె నటనకు మంచి గుర్తింపు ఉంది. 'మగధీర', 'డార్లింగ్', 'బృందావనం' వంటి తెలుగు చిత్రాలతో పాటు-, 'సింగం', 'స్పెషల్ 26' వంటి హిందీ చిత్రాల్లోనూ ఆమె తన ప్రతిభను చాటు-కున్నారు. ఇప్పుడు 'రామాయణం' వంటి ప్రతిష్టాత్మక చిత్రంలో మండోదరి వంటి బలమైన పాత్రలో ఆమె ఎలా మెప్పిస్తారో చూడాలి. మండోదరి పాత్ర రామాయణంలో ఒక ముఖ్యమైన పాత్ర. రావణుడి పట్టపురాణిగా ఆమె రావణుడికి మంచి సలహాలు ఇస్తూ, ధర్మం వైపు నిలబడే ప్రయత్నం చేస్తుంది. తన భర్త తప్పులను ఎత్తిచూపుతూ, సీతను తిరిగి రాముడికి అప్పగించాలని సూచిస్తుంది. కాబట్టి, ఈ పాత్రకు కాజల్ వంటి అనుభవం ఉన్న నటి అయితే మరింత న్యాయం చేకూరుస్తుందని మేకర్స్ భావిస్తున్నట్లు- సమాచారం. అయితే, ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే, కాజల్ అగర్వాల్ కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు. నితీష్ తివారి 'రామాయణం' మూడు భాగాలుగా తెరకెక్కనున్నట్లు సమాచారం. ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకుంటు-ందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతికతతో ఈ చిత్రం రూపొందనుంది.



## సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఎలెవన్ మూవీ

నవీన్ చంద్ర హీరోగా నటించిన 'ఎలెవన్' చిత్రం విడుదలకు ముందే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. విడుదలైన ప్రచార చిత్రాలు కూడా ఆసక్తికరంగా ఉండటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. తాజాగా, చిత్ర యూనిట్ నిన్న మీడియా కోసం ప్రత్యేకంగా షోను ఏర్పాటు- చేసింది. సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాగా ఇది తెరకెక్కింది. విశాఖపట్నంలో వరుస హత్యలు సంచలనం సృష్టిస్తాయి. బాధితులను గుర్తించలేని స్థితిలో పోలీసులు తలలు పట్టుకుంటారు. ఈ కేసును డీల్ చేస్తున్న పోలీస్ ఆఫీసర్ శశాంక్‌కు ప్రమాదం జరగడంతో, ఏసీపీ అరవింద్ (నవీన్ చంద్ర) రంగంలోకి దిగుతాడు. అరవింద్ రంగంలోకి దిగిన కూడా హత్యలు ఆగవు. హంతకుడితో పాటు హత్యకు గురైన వారి ఆనవాళ్లు కూడా దొరకవు. సవాలుగా మారిన ఈ కేసులో చివరకు ఓ చిన్న ఆధారం లభిస్తుంది. అయితే ఈ క్లూతో నేరస్థుడిని అరవింద్ ఎలా పట్టుకున్నాడు. నేరస్థుడికి ఎవరు సహాయం చేశారు? అసలు ఆ సైకో ఎందుకు హత్యలు చేస్తున్నాడన్నదే అసలు కథ. సినిమా ప్రారంభంలో ఇది ఒక సాధారణమైన ఇన్వెస్టిగేటివ్ డ్రామా అనిపించినా, ఇంటర్వెల్ తర్వాత కథ ఊహించని మలుపు తిరుగుతుంది. ఫస్ట్ హాఫ్‌లో మనం ఊహించిన విధంగానే కథ సాగుతుంది. అయితే, సెకండ్ హాఫ్‌లో దర్శకుడు ఊహకు అందని ట్విస్ట్‌లతో ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తాడు. ఇది కొత్త కథ కానప్పటికీ, తెలివైన కథనంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం అభినందనీయం. రివెంజ్ స్టోరీలు చాలా చూసినప్పటికీ, ఇందులో చూపించిన అంశం లాజికల్‌గా ఉండటం విశేషం. ఒక పోలీస్ ఆఫీసర్ ఆరు హత్యల మిస్టరీని ఛేదించే క్రమంలో ఎదుర్కొన్న సవాళ్లు, అనూహ్యమైన ట్విస్ట్‌లు ప్రేక్షకులను అలరిస్తాయి. అయితే, సినిమాలో మరికొంత మంది తెలిసిన నటీనటులు ఉంటే సినిమా మరింత మెరుగ్గా ఉండేదని చెప్పవచ్చు. నవీన్ చంద్ర పోలీస్ ఆఫీసర్ పాత్రలో అద్భుతంగా నటించాడు. ముఖ్యంగా కొన్ని ఎక్స్‌ప్రెషన్స్‌తో అతను ప్రేక్షకులను బాగా ఆకట్టు-కుంటాడు. హీరోయిన్ పాత్ర పరిమితంగా ఉన్నప్పటికీ, ఆ పాత్ర పోషించిన నటి తన పరిధి మేరకు బాగానే నటించింది. శశాంక్, కిరీటి వంటి ఇతర నటీ-నటు-లు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. సినిమాటోగ్రఫీ సినిమాకు ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా యొక్క మూడ్‌ను మరింత ఎలివేట్ చేసింది. పాటలు అంతగా గుర్తుండిపోయేలా లేనప్పటికీ, నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. సినిమా నిడివి కూడా చాలా క్రిస్ప్‌గా ఉండటం సినిమాకు ప్లస్ పాయింట్. అయితే, కొన్ని ఎమోషనల్ సీన్స్‌ను మరింత బాగా తీర్చిదిద్ది ఉంటే సినిమా మరింత కనెక్ట్ అయ్యేది. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్టుగా ఉన్నాయి.



## వల్లభనేని వంశీపై

# మరో కేసు

**విజయవాడ, మే16( వెలుతురు):**

వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై మరో కేసు నమోదైంది. గన్నవరం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని వంశీపై కేసు



నమోదైంది. మైనింగ్ ఏడీ గన్నవరం పోలీసు స్టేషన్‌లో వంశీపై పిర్యాదు చేశారు. అక్రమ తవ్వకాలపై నివేదికను ఆయన పోలీసులకు అందించారు. 2019–2024 సమయంలో వంశీ, ఆయన వర్గం అక్రమాలపై పాల్పడినట్టు- నివేదికలో పేర్కొన్నారు. 100 కోట్ల పైన అక్రమాలకు పాల్పడ్డారని వంశీపై మైనింగ్ ఏడీ ఫిర్యాదు చేశారు. మైనింగ్ ఏడీ ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వంశీ సహా 8 మందిపై కేసు నమోదైంది. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వల్లభనేని వంశీ ఇప్పటికే విజయవాడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈరోజు బెయిల్ పిటిషన్‌పై విజయవాడ కోర్టులో తీర్పు రానుంది. ఈ కేసులో బెయిల్ వచ్చినా.. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధిస్తే వంశీకి మరలా జైలు తప్పదు. ఇది చాలదన్నట్టు- నేడు మరో కేసు నమోదయింది. ప్రస్తుతం వంశీపై మూడు కేసులు ఉన్నాయి. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి, నకిలీ ఇళ్ల పట్టాల కేసు, అక్రమ మైనింగ్ కేసులు ఆయనపై ఉన్నాయి.

## కోడిగుడ్డుపై ఈకలు పీకినట్లుంది

- కేటీఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ చామల



**హైదరాబాద్, మే16( వెలుతురు):**

కోడిగుడ్డుపై ఈకలు పీకినట్లు రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్ వద్ద మీడియాతో మాట్లాడారు. సైకో రాము కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్నారని.. రామప్పగుడి దగ్గర అత్యుత్సాహంతో ఎవరో మిస్ వరల్డ్ కంటెస్టెంట్ల కాళ్లు కడిగి ఉండవచ్చునని, దానికి తెలంగాణ మహిళల ఆత్మ గౌరవం ఏమైందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ట్విట్ చేశారని మండిపడ్డారు. పదేళ్లు వాళ్ల ఇంటి ఆడబిడ్డ గురించి తప్ప ఏ ఇంటి ఆడబిడ్డ గురించి మాట్లాడలేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఇప్పుడు కేటీఆర్ మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కలెక్టర్లతో కాళ్లు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీదని.. జనాన్ని తప్పుదోవ పట్టించాలని కేటీ–ఆర్ రోజు ఎదో ఒకటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుంటే.. కేటీఆర్ డిస్టర్బ్ చేస్తున్నారని, గతంలో దండుకున్న వందల కోట్ల రూపాయలతో కొన్ని యూట్యూబ్ చానల్స్‌తో.. మార్ఫింగ్ వీడియోలతో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు. మంత్రి కొండా సురేఖ ఏ సందర్భంలో మాట్లాడారో దానికి ఆమె సమాధానం చెబుతారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

## అవగాహనతో డెంగ్యూ వ్యాధి దూరం


- వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్



**భద్రాద్రి కొత్తగూడెం, మే16( వెలుతురు):**

అవగాహనతో డెంగ్యూ వ్యాధి దరిచేరకుండా చూసుకోవచ్చని భద్రాద్రి కొత్తగూడెం డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ తెలిపారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం కొత్తగూడెంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ నాయక్ నేతృత్వంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంవత్సరం చెక్, క్లీన్ అండ్ క్లియర్ అనే థీమ్‌తో డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పౌరులు తమ ఇండ్లలో, అలాగే పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమల లార్వాలను నాశనం చేయడానికి ఆయిల్ బాల్స్ ఉపయోగించాలన్నారు. నిల్వ చేసిన నీటిని ఒక మూత లేదా గుడ్డతో క్లియర్ చేయాలని లేదా కవర్ చేయాలని తెలిపారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ (మలేరియా) డాక్టర్ పి.స్పందన థీమ్‌ను అమలు చేయడంలో, స్థానిక ప్రాంతాల్లో డెంగ్యూ ప్రమాదాన్ని తగ్గించడంలో సమాజ భాగస్వామ్యం ప్రాముఖ్యతను తెలిపారు. ఈ ర్యాలీని డిప్యూటీ- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జయలక్ష్మి, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల (యుపీహెచ్‌సీ) నుండి వైద్య అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, కుమార్ స్వామి, జేతు నగేశ్, చేతన్, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

# ఇప్పటి నుంచే పక్కా ప్లాన్..



**విజయవాడ, మే16( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అవగతమయినట్లుంది. కిందిస్థాయిలో క్యాడర్ కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, జనంలోకి వెళ్లడానికి జంకుతున్నారన్న అభిప్రాయానికి వచ్చి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నట్లు కనపడుతుంది. ఏడాది పాలన పూర్తయిన నాటి నుంచి ఇక జోరుగా హామీల అమలుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు నిన్న జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో తన మనసులో మాట చెప్పకనే చెప్పారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం వెళ్లినా ఈసారి కూడా పెద్ద సంఖ్యలో స్థానాలను కూటమి సాధించాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.ఈ ఏడాది జూన్ పన్నెండో తేదీ నాటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టి ఏడాది పూర్తవుతుంది. ఆరోజున లక్షమందికిపైగా వితంతు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి తేదీలతో త్వరలో క్యాలెండర్ ను విడుదల చేయనున్నారు. ఏడాది పొడవునా ఏ ఏ హామీలు ఏ తేదీన అమలు చేయనున్నామో స్పష్టంగా ప్రజల ముందు ఉంచి వారికి ఖచ్చితమైన సమాచారం అందచేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. ఆరు నూరైనా ఆరోజు ఆ హామీని అమలు చేసేలా అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను కూడా రెడీ చేసుకునేందుకు అధికారులకు కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించారు.మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అయితే ఏ నెల నుంచి అమలు చేస్తారరన్నదానిపై ఇంకా స్పష్టత లేకున్నా త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని జిల్లా స్థాయిలో ప్రవేశపెట్టాలని రెడీ అయిపోయినట్లే కనిపిస్తుంది. దీపం పథకం ఇచ్చే మూడు సిలిండర్లకు సంబంధించి ముందుగానే నగదును లబ్దిదారుల ఖాతాలోనే విడుదల చేయాలని నిర్ణయించారు. సిలిండర్ బుక్ చేసుకున్నారా? లేదా? అన్నది సంబంధం లేకుండా ముందుగానే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. చాలా మందికి డబ్బులు పడటం లేదన్న ఫిర్యాదులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల మహిళల ఓటు బ్యాంకు చెక్కు చెదరకుండా ఉండేలా ఇటు ఉచిత బస్సు పథకం, అటు దీపం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు.మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంతో పాటు ఓటు బ్యాంకు కూడా పటిష్టపర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పాక్ – భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లే అవకాశముందని కూడా చంద్రబాబు అనుమానిస్తున్నారు. జమిలి ఎన్నికలు 2027 లేదా 2028 లో వచ్చినా ప్రజల్లో అసంతృప్తి లేకుండా అన్ని రకాలుగా గ్రౌండ్ ను చంద్రబాబు ప్రిపేర్ చేస్తున్నారు. ఈ సారి కూటమితోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటునట్లే కనపడుతుంది. ఇలా చంద్రబాబు జగన్ పాదయాత్ర చేసినా తన పథకాలతో జనాన్ని తన వైపునకు తిప్పుకునేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు నిర్ణయించి ఈ మేరకు ముందుకు వెళుతున్నారు.

# జీరో గోల్డ్ బిజినెస్ తో నయా దందా



**విజయవాడ, మే16( వెలుతురు):**

జిఎస్టీ పన్నులు లేవు, తరుగు ఉండదు.. కారుచౌకగా ఆభరణాలు అని ప్రచారం చేస్తే ఎవరైనా ఎగబడకుండా ఉంటారా.. సరిగ్గా ఈ బలహీనత మీదే విజయవాడలో జీరో బిజినెస్ గోల్డ్ దందా నడుస్తోంది. తక్కువ ధరకు బంగారం వస్తుందనే ఆశపడితే అసలు బంగారానికే ఎసరు పెడుతున్నారు. బెజవాడలో బంగారం కొనే ముందు ఒకటి పదిసార్లు ఆలోచించి కొనాల్సిన పరిస్థితులు ఉన్నాయి. జిఎస్టీ లేకుండా తరుగు తక్కువకు బంగారం తక్కువ ధరకు లభిస్తుందని కక్కుర్తి పడితే నిలువునా ముంచేస్తారు. విజయవాడ కేంద్రంగా జరుగుతున్న ఈ మోసాలపై ప్రభుత్వ యంత్రాంగాలు కూడా దృష్టి పెట్టడం లేదు.బంగారం అమ్మకాల్లో వ్యాపారులు రకరకాల లెక్కలు చెప్పి ఆభరణాలకు ధరలు నిర్ణయిస్తుంటాయి. వీటి హేతుబద్దత గురించి సరైన నిర్వచనాలు మాత్రం ఉండవు.బడా షోరూమ్‌లలో ఆభరణాలను కొనుగోలు చేస్తే తరుగు, మజూరీ, జిఎస్టీ పేరుతో కొంత అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఈ క్రమంలో విజయవాడ హోల్ సేల్ మార్కెట్‌లలో కొత్త దందా నడుస్తోంది.బంగారు ఆభరణాల విక్రయాల్లో విజయవాడ గవర్నర్‌పేట మార్కెట్‌కు తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు ఉంది. జైహింద్ మార్కెట్‌లో ఉండే బంగారు దుకాణాల్లో గుట్టలుగుట్టలుగా ఆభరణాలను విక్రయిస్తుంటారు. షోరూమ్‌లలో ఉండే డిజైన్ల కంటే వందల సంఖ్యలో ఎక్కువగా ఆభరణాలు ఇక్కడ లభిస్తాయి. దీంతో పెళ్లిళ్లు, శుభకార్యాలతో పాటు ఆభరణాలపై పెట్టుబడి పెట్టే వారు హోల్‌సేల్ బంగారు ఆభరణాల దుకాణాల్లో నగలను కొనుగోలు చేస్తుంటారు. ఈ దుకాణాల్లో నిత్యం కోట్లలో టర్నోవర్ జరుగుతుంది.విజయవాడలో బంగారం కొనేటపుడు కాస్త ముందు వెనుక ఆలోచించి కోవాలి. కార్పొరేట్ షోరూమ్‌ల మాదిరి తాము పన్నులు వసూలు చేయమని స్థానిక వ్యాపారులు ప్రచారం చేసుకోవడంతో ఈ దుకాణాల్లో కొనుగోళ్లు భారీగా జరుగుతుంటాయి.విజయవాడకు చెందిన ఓ మహిళ ఇటీవల జైహింద్ కాంప్లెక్స్ హోల్‌సేల్ ఆభరణాల దుకాణంలో సుమారు రూ.5లక్షల ఖరీదు చేసే ఆభరణాన్ని కొనుగోలు చేశారు. కొద్ది రోజుల తర్వాత ఆ ఆభరణంపై రుణం తీసుకునేందుకు బ్యాంకును సంప్రదించడంతో దాని విలువ మూడు లక్షలకు మించదని తేల్చడంతో షాక్‌కు గురయ్యారు. దీంతో దుకాణదారుడిని ప్రశ్నిస్తే కొనుగోలు చేసిన ఆభరణంలో రాళ్ల బరువు మినహాయిస్తే బంగారం బరువు అంతే ఉంటుందని నింపాదిగా చెప్పారు.52 గ్రాముల బరువు ఉన్న ఆభరణానికి రూ.4.94లక్షల ధరగా నిర్ణయించి, బేరసారాల తర్వాత మహిళకు రూ.4.70 లక్షలకు విక్రయించారు. ఆభరణాన్ని విక్రయించే సమయంలో 52.5 గ్రాముల బరువుకు రూ.9వేల చొప్పున ధర వసూలు చేశారు. బ్యాంకులో ఆభరణం విలువను లెక్కించే సమయంలో ఆభరణంలో దాదాపు 13 గ్రాములు రాళ్ల బరువు ఉన్నట్టు అప్రైజర్ తేల్చాడు. బంగారు ఆభరణంలో ఉన్న 9 పెద్ద పూసలు ఒక్కోటి 0.750 మిల్లీ గ్రాములు, మిగిలిన రాళ్లు కలిపి 12 నుంచి 13 గ్రాముల బరువు ఉంటాయని ఆభరణం అసలు బరువు 38 గ్రాముల్లోపు ఉంటుందని లెక్కించాడు.ఈ వ్యవహారంలో 13 గ్రాముల రాళ్ల బరువుకు కూడా రూ.9వేల చొప్పున బంగారం ధరను వసూలు చేసిన దుకాణదారుడు వారికి జిఎస్టీ రూపంలో లబ్ది కలిగించినట్టు నమ్మించాడు. తాను తరుగు రెండు శాతం లోపు మాత్రమే తీసుకున్నామని చెప్పాడు. కొనుగోలు చేసిన ఆభరణం అసలు బరువు లెక్క మాత్రం చెప్పలేదు. బ్యాంకు లెక్కలో 38గ్రాములు మాత్రమే బరువు తేలడంతో హోల్‌సేల్ లెక్క తేల్చాలని బాధితులు దుకాణం యజమానిని ప్రశ్నించారుబంగారు ఆభరణాల తయారీలో తరుగు 18శాతం వరకు ఉంటుందని, మేకింగ్ ఛార్జీలు, డిజైనింగ్ ఛార్జీలు, జిఎస్టీతో పాటు రాళ్ల బరువు క్యారెట్‌లలో లెక్కించినా తాము హోల్‌సేల్‌గా విక్రయించిన ధర కంటే ఎక్కువే అవుతుందని నమ్మించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఆభరణాల్లో రాళ్ల బరువును విడిగా లెక్కిస్తారని సాధారణ రంగురాళ్లకు బంగారంతో సమానంగా ధర వసూలు చేయరని ప్రముఖ దుకాణాలు స్పష్టత ఇచ్చాయి. ఈ క్రమంలో అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించేందుకు నిరాకరించడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు.రాళ్ల బరువుతో కలిపి ఆభరణం విలువను లెక్కించడం, హోల్‌సేల్ పేరుతో ఆభరణంలో బంగారం బరువును లెక్కలో చూపకుండా రాళ్ల బరువుతో కలిపి మొత్తం బరువును లెక్కించడంపై పోలీసులు దుకాణదారుడిని ప్రశ్నించడంతో దుకాణదారుడు వివాదాన్ని ముగిస్తామని దారికొచ్చారు. కొనుగోలు చేసిన సొమ్మును వాపసు చేస్తామని చెప్పడంతో వివాదం ముగిసింది.బంగారు ఆభరణాల కొనుగోలులో ధరల విషయంలో నాలుగైదు చోట్ల విచారించడంతో పాటు ధరను లెక్కించే సమయంలో ఆభరణాల్లో రాళ్ల బరువును విడిగా తెలుసుకోక పోతే నిండా మునుగుతారు. నిత్యం కోట్లాది రుపాయలు లావాదేవీలు జరిగే చోట జిఎస్టీలు, బిల్లులు లేకుండా ఆభరణాల విక్రయాలు యథేచ్ఛగా జరగడం సందేహాలకు తావిస్తోంది.లీగల్ మెట్రాలజీ, కమర్షియల్ టాక్సెస్ వంటి ప్రభుత్వ శాఖలకు తెలిసే నగరంలో ఈ జీరో బిజినెస్ గోల్డ్ దందా సాగుతుందనే అనుమానాలు ఉన్నాయి. ఎప్పుడైనా బాధితులు మోసాలను గుర్తించినపుడు వారి డబ్బు వెనక్కి ఇచ్చేసి గుట్టుగా సెటిల్ చేసుకుంటున్నారు.సాధారణ రంగు రాళ్లకు బంగారంతో సమానంగా ధర వసూలు చేయడం, అదే ఆభరణం బరువుగా నిర్ధారిస్తూ వాటికి సర్టిఫికెట్లను సైతం జారీ చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# మన మిత్రలో మరిన్ని సేవలు

**విజయవాడ, మే16( వెలుతురు):**




ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అభివృద్ధి దూసుకుపోతుందని మంత్రి నారా లోకేష్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతుందని అన్నారు. మరిన్ని పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భారీ పారిశ్రామిక సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. వాళ్లకు కావాల్సిన సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు ఆ దిశగానే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం ఈ మన మిత్ర యాప్ ద్వారా 317 సేవలు అందుతున్నాయి. దీన్ని మే చివరి నాటికి 400కు పెంచాలని అధికారులకు నారా లోకేష్ సూచించారు. ప్రస్తుతానికి ఈ యాప్‌లో రెవెన్యూ శాఖ పరంగా భూరికార్డులు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, నివాస ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం, జన్మ ధ్రువీకరణ పత్రం, పంట నష్టం అంచనా వివరాలు, భూ మార్పిడికి సంబంధించిన వివరాలు, ఐ పట్టా పాస్‌బుక్‌ల వివరాలు లభిస్తున్నాయిగ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికల వివరాలు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కోసం దరఖాస్తు, నీటి సరఫరాల, పారిశుద్ధ్యానికి సంబంధించిన ఫిర్యాదులు, గ్రామస్థాయిలో వివిధ పన్నుల చెల్లింపు, భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తుల, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల సేవలు లభిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను చెల్లింపు, నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు, వ్యాపార లైసెన్స్ కోసం దరఖాస్తు, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదులు, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన ఫిర్యాదుల సేవలు లభిస్తాయి. విద్యాసంస్థల గురించి సమాచారం, ఉద్యోగాల నోటిఫికేషన్ల సమాచారం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల వివరాలు, ఉన్నత విద్యకు సంబంధించిన సమాచారం, ప్రభుత్వ పాఠశాలలలు, కళాశాలల వివరాలు ఈ మన మిత్ర వాట్సాప్ యాప్‌లో లభిస్తాయి. ప్రభుత్వ ఆసుపత్రుల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వివరాలు, వైద్య శిబిరాల సమాచారం, టీకాల కార్యక్రమాల వివరాలు, ఆరోగ్య పథకాల గురించి సమాచారం, రక్త నిధి కేంద్రాల వివరాలు లభిస్తాయి. ఆర్టీసీ బస్సుల సమయం, టికెట్ బుకింగ్, డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సమాచారం, వాహన పన్ను చెల్లింపుల వివరాలు లభిస్తాయి. వీటితోపాటు పోలీస్ శాఖ ఫిర్యాదులు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమాచారం, సామాజిక సంక్షేమ పథకాల గురించి సమాచారం, వ్యవసాయ శాఖకు సంబంధించిన మసాచారం, విద్యుత్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు, చెల్లింపుల వివరాలు ఈ వాట్సాప్ యాప్‌లో లభిస్తాయి.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com